ninadam.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
సోమవారం 17 ఆగస్టు 2026 | సంపుటి: 22 | సంచిక: 320 | వెల: రూ.7 | పేజీలు: 12+12
Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## తిరుమలలో భారీ రద్దీ

**దర్శనానికి సుదీర్ఘ నిరీక్షణ**
**తిరుమలకు పోటెత్తిన భక్తులు**
**శ్రీవారి సర్వదర్శనానికి 22 గంటల సమయం**
**నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు**
**శనివారం 90 వేల మందికి పైగా స్వామివారి దర్శనం**



2



నవంబరు నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల

## షెడ్యూల్ విడుదల

2026 నవంబర్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లు, దర్శన టోకెన్లు, వసతి గదుల ఆన్‌లైన్ కోటా విడుదల షెడ్యూల్‌ను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది.

- తిరుమల (నినాదం)

# వనదేవతల సమక్షంలో చేయూత పింఛన్లకు శ్రీకారం

**రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క- సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి: సీఎం రేవంత్ రెడ్డి**

**పలువురు మహిళలకు కొత్త పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన సీఎం .. హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించిన రేవంత్**




వనదేవతలను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్న సీఎం రేవంత్ రెడ్డి, రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క - సారలమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. చదువు ఒక్కటే ఉద్యోగాన్ని ఇవ్వదని, స్కిల్స్ కూడా నేర్చుకోవాలని, ఇంటర్ తర్వాత విద్యార్థులు స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. నైపుణ్యం ఉన్నవారికి జర్మని, జపాన్, కొరియాలో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులకు జర్మని, జపాన్, కొరియన్ భాషలు నేర్పిస్తామని తెలిపారు.

2 – మేడారం, ఆగస్టు 16 (నినాదం)



సమ్మక్క-సారలమ్మలను

## దర్శించుకున్న రేవంత్

మేడారం: ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క-సారలమ్మ గద్దెలను సీఎం రేవంత్‌రెడ్డి దర్శించుకున్నారు. పూజారులు గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలోకి ముఖ్యమంత్రిని ఆహ్వానించారు.

- మేడారం, ఆగస్టు 16 (నినాదం) 2



## 'టీజీ సేఫ్'తో కల్తీకి చెక్

**ఒకే గొడుగు కిందకు ఆహార, ఔషధ శాఖలు**

**ఆహార, ఔషధ నియంత్రణ శాఖలను విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం**
**'టీజీ సేఫ్' పేరిట కొత్త ఏకీకృత అథారిటీ ఏర్పాటు**
**నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతి నియామకం**
**ఆహార, ఔషధాల కల్తీని అరికట్టి ప్రజారోగ్యాన్ని కాపాడటమే లక్ష్యం**
**నియంత్రణ వ్యవస్థల ఆధునికీకరణకు రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటు**

తెలంగాణలో ఆహార, ఔషధాల నాణ్యతను పర్యవేక్షించేందుకు, కల్తీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు వేర్వేరుగా పనిచేస్తున్న ఆహార భద్రత (ఫుడ్ సేఫ్టీ), ఔషధ నియంత్రణ (డ్రగ్స్ కంట్రోల్) విభాగాలను విలీనం చేస్తూ ఏకీకృత పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసింది. ఈ కొత్త సంస్థకు 'టీజీ సేఫ్' (తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్) అని నామకరణం చేసింది.

2 - హైదరాబాద్, ఆగస్టు 16 (నినాదం)

వచ్చే వారం నుంచి

## ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

**టీజీపీఎస్సీ కీలక ప్రకటన**

**వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు**
**పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ**
**ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్**
**ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్**
**వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన**

**హైదరాబాద్, ఆగస్టు 16 (నినాదం)**
తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ రెండు కీలక ప్రకటనలతో ఉద్యోగార్థుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టీజీపీఎస్సీ కార్యాల




యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడారు. నియామక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనానికి ...మిగతా 2లో

మోదీ ఫొటో కావాలంటే

## సన్నబియ్యం డబ్బులివ్వండి

**స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు**

- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి



స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు.

2 హైదరాబాద్, ఆగస్టు 16 (నినాదం)



మెడికో ప్రియాంక కేసులో

## కీలక పరిణామం

**దర్యాప్తుకు ప్రత్యేక ఐపీఎస్ అధికారి**
**రాజమండ్రి వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం**
**విచారణాధికారిగా ఐపీఎస్ అధికారి పాటిల్ దేవరాజ్‌ను నియమించిన ప్రభుత్వం**
**ప్రియాంక కుటుంబానికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం చంద్రబాబు**
**నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**
**మద్యం మత్తులో యువకులు కారుతో ఢీకొట్టడంతో ప్రాణాలు కోల్పోయిన ప్రియాంక**

2



విద్యార్థుల గొంతును ఎవరూ

## అణచలేరు

రాహుల్ గాంధీ

2



కాలువలో పడిన కారు

## నలుగురి గల్లంతు

**పశ్చిమ గోదావరిలో ఘోర ప్రమాదం**

**ఇరగవరం మండలం ఆయిలంపూడి లాకుల వద్ద ఘటన**
**పెళ్లికి హాజరై తిరిగి వస్తుండగా తెల్లవారుజామున ఘటన**
**గల్లంతైన వారి కోసం ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు**

# నేటి నుంచి అసెంబ్లీ


**కీలక బిల్లులపై ఏపీ ప్రభుత్వం ఫోకస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపరుస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. నేడు ఉదయం 9 గంటలకు శాసనసభ, 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. తొలిరోజే ఉభయ సభల బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు నిర్వహించి సమావేశాల వ్యవధి, రోజువారీ కార్యక్రమాలను ఖరారు చేయనున్నాయి. ఈ దఫా సమావేశాలు సుమారు నాలుగు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అమరావతి, ఆగస్టు 16 (నినాదం)

2




## భోగాపురం ఎయిర్‌పోర్ట్ రెడీ

**అర్ధరాత్రి నుంచి విమాన సర్వీసులు.. వాణిజ్య సేవలు ప్రారంభం**

**విశాఖపట్నం ఎయిర్‌పోర్ట్‌లో వాణిజ్య కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేత**
**తొలి రోజు హైదరాబాద్, ఢిల్లీ సహా పలు నగరాలకు 31 విమాన సర్వీసులు**
**రికార్డు సమయంలో పూర్తయిన ఈ ప్రాజెక్టును ఆగస్టు 1న ప్రధాని మోదీ ప్రారంభించారు**
**ఉత్తరాంధ్ర ఆర్థికాభివృద్ధిలో ఈ విమానాశ్రయం కీలక పాత్ర పోషిస్తుందని అంచనా**

2



## యాదవులంతా ఐక్యతతో ముందుకు సాగాలి

అఖిల భారత యాదవ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మామిండ్ల ఐలయ్య యాదవ్ అధ్యక్షతన ఆదివారం రంగాధంపల్లి శ్రీ కృష్ణ యాదవ సంఘంలో సిద్దిపేట పట్టణ 23 సంఘాలతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. నూతన కార్యవర్గం ఎన్నిక జరిపి ముఖ్య అతిథి శ్రీ పోచబోయిన శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ జాతి సంక్షేమం, అభివృద్ధి కోసం యాదవులంతా ఐక్యత తో ముందుకు సాగుతు మిగితా కుల సంఘాలకు కూడా ఆదర్శంగా ఉండాలని నూతనంగా ఎన్నికైన కార్యవర్గం భాద్యతతో పని చేయాలని కోరారు.

2 - సిద్దిపేట ప్రతినిధి (నినాదం)

## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం

**హాజరైన చంద్రబాబు, రేవంత్**

2





నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజతో ఘనంగా జరిగింది. హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. –హైదరాబాద్ (నినాదం)

# నేటి నుంచి అసెంబ్లీ

**కీలక బిల్లులపై ప్రభుత్వం దృష్టి**

ఈ సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను సభ ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన దిశ చట్టాన్ని ఉప సంహరించుకునే బిల్లు, మహిళలు, బాలికల భద్రతకు ప్రత్యామ్నాయంగా మరింత పటిష్టమైన నిబంధనల రూపకల్పన, స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు వంటి అంశాలు ప్రాధాన్యం సంత రించుకున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీల రాజకీయ ప్రాతి నిధ్యాన్ని 34 శాతానికి పెంచే అంశంపై ప్రభుత్వం బిల్లు తీసుకురావడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన బిల్లును సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల భోగట్టా. పెట్టుబడులను ఆకర్షించడం, మౌలిక వసతుల ప్రాజె క్టులను వేగవంతం చేయడం లక్ష్యంగా రూపొందించిన ఏపీ పీపీపీ పాలసీ–2026, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు సంబంధించిన చట్టపరమైన సంస్కరణలు కూడా సమావేశాల్లో ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. వీటికి రాష్ట్ర మంత్రివర్గం ఇప్పటికే ఆమోదం తెలిపింది.

**అమరావతి అంశాలకు ప్రాధాన్యం**

రాజధాని అమరావతి అభివృద్ధికి సంబంధించిన పలు నిర్ణయాలు కూడా సమావేశాల సందర్భంగా చర్చకు వచ్చే అవకాశముంది. క్వాంటమ్ వ్యాలీ ట్విన్ టవర్స్, అమరావతి మౌలిక వసతుల అభివృద్ధి, రైల్వే–రోడ్డు కనె క్టివిటీ, భూసేకరణ తదితర అంశాలపై ప్రభుత్వం తన నిర్ణయాలను సభ ముందు వివరించే అవకాశం ఉంది.

**మేయర్లు, చైర్మన్ల ప్రత్యక్ష ఎన్నికలు**

మున్సిపల్ మేయర్లు, చైర్మన్లను ప్రత్యక్షంగా ఎన్నుకునే విధానానికి సంబంధించిన చట్టసవరణలపైనా చర్చ జర గనున్నట్లు సమాచారం. పట్టణ స్థానిక సంస్థల ఎన్నిక లకు సంబంధించి ఈ ప్రతిపాదన కీలకంగా మారనుంది.

**డీఎస్సీపై ప్రతిపక్షం**

మరోవైపు మెగా డీఎస్సీ–2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు సమావేశాల్లో రాజ కీయంగా వేడెక్కించే అవకాశం ఉంది. ఈ అంశంపై సమగ్ర విచారణకు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోంది. శాసనమండలిలో ఈ అంశాన్ని ప్రధానంగా లేవనెత్తేందుకు ఆ పార్టీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. సంక్షేమ పథకాల అమలు, రైతు సమస్యలు, సాగునీరు, ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, శాంతిభద్రతలు, పెట్టుబ డులు, పరిశ్రమలు, ఎల్‌నినో ప్రభావం తదితర అంశాలు కూడా సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది.



**భద్రత కట్టుదిట్టం**

శాసన సభ, మండలి సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల ప్రవేశానికి డిజిటల్ పాస్‌ల తనిఖీలను పటిష్టం చేయడంతో పాటు సభ సజావుగా సాగేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శాసనసభ్యులు అడిగే ప్రశ్నలకు శాఖల నుంచి సమాధానాలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు ఇచ్చారు.



## తిరుమలలో భారీ రద్దీ

వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిటలా డుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 22 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపలికి కిలోమీటర్ల మేర విస్తరించాయి. రద్దీ పరిస్థితులను టీటీడీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శనివారం (ఆగస్టు 15న) ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకు న్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.81 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## నవంబరు నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల షెడ్యూల్ విడుదల

భక్తులు ఈ తేదీలను గమనించి, టిక్కెట్లను ముందస్తుగా బుక్ చేసుకోవాలని సూచించింది. భారీ డిమాండ్ ఉండే సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవల కోసం ఎలక్ట్రానిక్ డిప్ (లక్కీ డిప్) విధానంలో టికెట్లను కేటాయించనున్నారు. ఇందుకోసం భక్తులు ఆగస్టు 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు ఆగస్టు 22వ తేదీ మధ్యాహ్నంలోగా నిర్ణీత రుసుము చెల్లించి తమ టిక్కెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర సేవా టికెట్లను ఆగస్టు 21న విడుదల చేయనున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టిక్కెట్లు అందు బాటులోకి వస్తాయి. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవల కోటాను టీటీడీ విడుదల చేస్తుంది. ఆగస్టు 24న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనం టిక్కెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దివ్యాంగుల ప్రత్యేక దర్శన టోకెన్ల కోటాను విడుదల చేస్తారు. ఇక ఆగస్టు 25న ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల బుకింగ్ కోటాను అందుబాటులో ఉంచుతారు. భక్తులు టీటీడీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే టికెట్లను బుక్ చేసుకోవా లని అధికారులు స్పష్టం చేశారు.

## యాదవులంతా ఐక్యతతో ముందుకు సాగాలి

గౌరవాధ్యక్షులు: పయవుల ఎల్లం యాదవ్, టౌన్ అధ్యక్షులు : గందం రాజు యాదవ్ , ఉపాధ్యక్షులు దుబాల శ్రీశైలం యాదవ్, గంగుల ఎల్లం యాదవ్, బత్తిరాజు హరికృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి: రాజబోయిన రమేష్ యాదవ్, ఆర్థిక కార్యదర్శి: ఎలుక పోచయ్య యాదవ్, సహాయ కార్యదర్శి: రాజవేణి బాలయ్య యాదవ్, తెల్జీరు ఐలయ్య యాదవ్, కార్యవర్గ సభ్యులు: పుల్లూరి కుంటయ్య యాదవ్, రాగారం శ్రీనివాస్ యాదవ్, రాగం సాయి యాదవ్, కుంచం కనకయ్య యాదవ్, ప్రచార కార్యదర్శి: కుక్కల తిరుపతి యాదవ్ లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కార్యక్రమంలో బైరి రాములు యాదవ్, జక్కుల బాలమల్లు యాదవ్, ఉండ్రాళ్ళ రాజేశం యాదవ్, గౌర్రె మల్లికార్జున్ యాదవ్, బైరి అనీల్ కుమార్ యాదవ్, బొల్లు రాముయాదవ్, తలారి చంద్రశేఖర్ యాదవ్, పట్టణ యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా రాజబోయిన రవి యాదవ్,రమేష్ యాదవ్, సాయియాదవ్, యాదగిరి యాదవ్, రాజయ్య యాదవ్, శ్రీనివాస్ యాదవ్, ఐలయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

సూర్యాపేటలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్దిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫోటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## బంగ్లా ప్రధాని పర్యటనపై అనిశ్చితి!

**న్యూఢిల్లీ, (నినాదం)**

తమ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ మరోసారి భారత్‌ను కోరింది. బంగ్లా ప్రధాని తారిఖ్ రెహమాన్ ఢిల్లీ పర్యటనపై అనిశ్చితి నెలకొన్న వేళ ఈ అంశాన్ని మరోసారి లేవనెత్తింది. ప్రధాని పర్యటన ముందు అనుకూలమైన వాతావరణం కోరుకుంటున్నామని పేర్కొంది. పరోక్షంగా హసీనా అప్పగింత అంశాన్ని ముడిపెట్టింది. త్వరలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ సమావేశానికి రెహమాన్ హాజరవ్వటంపై ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆ దేశ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి షాహిదుల్ కరీమ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''ప్రధాని రెహమాన్ భారత్ పర్యటనపై గత కొన్ని వారాలుగా ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి.

### ప్రభుత్వ ఆర్థిక విధానాల్లో

## మా జోక్యం పరిమితం: హైకోర్టు

### రైతుబంధు చెల్లించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వుల రద్దు

### తీర్పు వెలువరించిన హైకోర్టు – ప్రభుత్వ ఆపీల్‌కు హైకోర్టు అనుమతి

**హైదరాబాద్, ఆగస్టు 16 (నినాదం):**

ఆర్థిక, సంక్షేమ విధానాలకు సంబం ధించిన ప్రభుత్వ నిర్ణయాల్లో ప్రాధాన్యా లను కోర్టులు నిర్ణయించలేవని హైకోర్టు తేల్చి చెప్పింది. ఆర్థిక విధానాల్లో కోర్టుల జోక్యం పరిమిత మని, ప్రభుత్వ విధానం ఏకపక్షం, వివ క్షాపూరితం, రాజ్యాంగ, చట్టనిబంధన లకు విరుద్ధంగా ఉన్నట్లు రుజువైతే తప్ప జోక్యం చేసుకోవాలని స్పష్టం చేసింది. కోవిడ్ 2019 ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతుబంధు పథకం నిధులు విడుదల చేయకపోవడం ప్రభుత్వ విధాన నిర్ణయంలో భాగమేనని పేర్కొంది. బడ్జెట్ కేటాయింపులు లేని మొత్తాన్ని చెల్లించాలంటూ కోర్టు ఆదేశాలు జారీ చేయలేదని పేర్కొంది. 2019 రబీ, ఖరీఫ్ సీజన్‌లో నిలిపివే సిన రైతుబంధు సొమ్ము చెల్లించా లంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వు లను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు వెలు వరించింది.



ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు దాఖలు : కొవిడ్ సమయంలో 2019లో ఖరీఫ్, రబీ సీజన్‌లకు రైతుబంధు చెల్లించకపోవడాన్ని సవాలు చేస్తూ ఖమ్మం జిల్లా తల్లాడ మండలం తల్లాడ, తెలగారం గ్రామాలకు చెందిన టి.వెంకటనారాయణ మరో నలుగురు రైతులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి రైతుబంధు చెల్లించాలంటూ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. అప్పీలుపై విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహి యుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యాలపై ప్రభుత్వా లేదే నిర్ణయం : కొవిడ్ సమయంలో తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రభుత్వం సమ ర్పించిన వివరాల ద్వారా స్పష్టమవు తోందని ధర్మాసనం తెలిపింది. 2019 వానా కాలంలో 1.42 లక్షల మంది రైతులకు రూ.850.82 కోట్లు, యాసంగిలో 9.46 లక్షల మందికి రూ.2132.95 కోట్లు నిధులు విడుదల చేయలేదని స్పష్టం చేసింది. అయితే దీన్ని ఆధారంగా పిటిషనర్లు మాత్రమే ప్రత్యేకంగా వివక్షకు గుర య్యారని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు అని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వ నిధుల కేటాయిం పులపై న్యాయ సమీక్ష పరిధిని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసిందని, ప్రభుత్వ ఆర్థిక ప్రాధాన్యాలు, నిధుల లభ్యతవంటి అంశాలను ప్రభుత్వాలే నిర్ణయించాల్సి ఉంటుందని, కోర్టులు కాదని తేల్చిచె ప్పిందని గుర్తు చేసింది. రైతుబంధు కింద నిధులు విడుదల చేయాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దుచేస్తూ ప్రభుత్వ అప్పీలును అనుమతించింది.





### మెడికో ప్రియాంక కేసులో

## కీలక పరిణామం

రాజమండ్రిలో వైద్య విద్యార్థిని ప్రియాంక మృతి ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఐపీఎస్ అధికారి, ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మునీష్‌ను ప్రత్యేక దర్యాప్తు అధి కారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధ్యమైనంత త్వరగా విచారణ పూర్తి చేసి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఉన్నతాధికారులను ఆదేశించింది. ఈ దర్యాప్తులో ఏఎస్పీకి సౌత్ డీఎస్పీ శివప్రియ, ప్రకాశంనగర్ సీఐ బాజీలాల్ సహకరించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న వైద్య విద్యార్థిని అకాల మరణం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని అన్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన, బాధిత కుటుం బానికి రూ. 20 లక్షల ఆర్థిక సాయం అందించా లని అధికారులను ఆదేశించారు. నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టవద్దని, వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే ప్రభుత్వం ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రత్యేక అధికారిని నియమించింది.

**అసలేం జరిగిందంటే..!**

తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ఏక్లాస్‌పూర్‌కు చెందిన ప్రియాంక, తూర్పుగోదా వరి జిల్లా రాజానగరంలోని ఓ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ విభాగంలో పీజీ చదువుతున్నారు. ఆగస్టు 3వ తేదీ రాత్రి రాజమహేంద్రవరంలోని ప్రసాద్ ఆదిత్య మాల్‌లో సినిమా చూసి, స్నేహితు డితో కలిసి స్కూటీపై తిరిగి వస్తున్నారు. మాల్ గేట్ వద్ద వారు ఆగి ఉన్న సమయంలో మద్యం మత్తులో ఉన్న నామవరానికి చెందిన దుష్యంత్, లాలాచెరువుకు చెందిన ఆండ్రూ విలియం జోసెఫ్ అనే ఇద్దరు యువకులు తమ కారుతో ప్రియాంక స్కూటీని ఉద్దేశపూర్వకంగా మూడుసార్లు ఢీకొట్టారు. అనంతరం ఆమెపై నుంచి కారు పోని వ్వడంతో ప్రియాంక తలకు తీవ్ర గాయాల య్యాయి.
వెంటనే ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఆగస్టు 5న సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుప త్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రియాంక ఆగస్టు 10న మృతి చెందారు. ఈ దారుణ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసన వ్యక్తమవడంతో ప్రభుత్వం నిందితులపై కఠిన చర్యలకు ఉపక్రమించింది.



### వచ్చే వారం నుంచి

## ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

మొదటి పేజీ తరువాయి

అత్యధిక ప్రాధాన్యం ఇస్తామని ఆయన స్పష్టం చేశారు. చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్య త్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాప త్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివ రించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగా లను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటి ష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

### 'టీజీ సేఫ్'తో

## కల్తీకి చెక్

ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు (జీవో) జారీ చేసింది. 'టీజీ సేఫ్' నూతన కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి అవినాశ్ మహంతిని నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ మరో జీవోను విడుదల చేసింది. ఆయన గతంలో డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.
రాష్ట్రంలో ఆహార వ్యాపార కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో, నాణ్యత లేని, నకిలీ ఆహార పదార్థాలు, ఔషధాలను నిరోధించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం తన జీవోలో పేర్కొంది. ఆహార భద్రత, ప్రమాణాల చట్టం–2006, డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం–1940 కింద నిబంధ నల అమలు, పర్యవేక్షణను బలోపేతం చేయడమే ఈ విలీనం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది. ఈ రెండు విభాగాల లక్ష్యాలు ప్రజారోగ్యం, వినియోగదారుల భద్రత, నాణ్యతా ప్రమాణాల హామీ వంటి ఉమ్మడి అంశాలతో ముడిపడి ఉన్నాయని ప్రభుత్వం వివరించింది. ఈ కొత్త ఏకీకృత వ్యవస్థ కింద డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, లీగల్ అండ్ ప్రాసిక్యూషన్, లేబొరేటరీ, అడ్మినిస్ట్రేటివ్ విభాగాలు పనిచే స్తాయి. అయితే, ఆహార భద్రత, ఔషధ నియంత్రణ చట్టాల ప్రకారం సంబంధిత అధి కారుల చట్టబద్ధమైన అధికారాలు యథాత థంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ తరహా ఏకీకృత విధానం ఇప్పటికే విజయవంతంగా అమలవుతున్నట్లు తెలిపింది. మారుతున్న పరి స్థితులకు అనుగుణంగా నియంత్రణ వ్యవ స్థలను ఆధునికీకరించేందుకు, ప్రస్తుతం ఉన్న యంత్రాంగాలను సమీక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వ్యవస్థాగత ఆధునికీ కరణ, సర్వీస్ రూల్స్ సమన్వయం, క్షేత్రస్థాయి యూనిట్లు, ప్రయోగశాలల మౌలిక సదుపా యాల మెరుగుదల వంటి అంశాలపై ఈ కమిటీ సమగ్ర అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులకు అనుగు ణంగా ఒక పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను రూపొందించేందుకు సూచనలు చేస్తుంది.

## బండ్ల గణేశ్ కుమార్తె వివాహం

ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరా బాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఆమె ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన అగ్ర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.
ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ కుమార్తె జనని–సూర్య తేజ వివాహ వేడుకకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజర య్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వ దించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ వివాహ మహోత్సవా నికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా హాజరయ్యారు. వేడుకలో బండ్ల గణేశ్ కుటుం బసభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.
ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు–నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళసూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# విద్యార్థుల గొంతును ఎవరూ అణచలేరు

**న్యూఢిల్లీ, (నినాదం)**

నీట్ పేపర్ లీక్ సహా వివిధ పరీక్షల అక్రమాలపై ఆందోళన లకు దిగిన విద్యార్థులపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశంసలు కురిపించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, అధికా రాన్ని ప్రశ్నిస్తూ నిలబడిన భారత యువత ధైర్యం, పట్టుద లను కొనియాడారు. ముఖ్యంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థినులు ఎదుర్కొన్న వేధింపులు, దూషణలు, హింసను ప్రస్తావిస్తూ వారికి తన మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో ఇటీవల నిర్వహించిన సమావేశానికి సంబంధించిన వీడియోను రాహుల్ గాంధీ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.
'జవాబుదారీతనం కోసం పోరాడుతూ, మోద హింసాత్మక పాలనకు ఎదురు నిలిచిన భారత యువత ధైర్యం, స్థైర్యం ప్రశంసనీయం. శాంతి, ప్రేమ, హాస్యాన్ని ఆయుధాలుగా చేసుకుని యువత తమ గళాన్ని వినిపించింది. అధికారాన్ని ప్రశ్నించడం, తమ హక్కుల కోసం నిలబడటం ప్రజాస్వా మ్యంలో కీలకం. బీజేపీ కార్యకర్తల నుంచి దురుసు ప్రవర్తన, మాటల దాడులు, హింసను ఎదుర్కొన్నప్పటికీ విద్యార్థినులు వెనక్కి తగ్గలేదు. కొంతమందిని ప్రధాని మోదీకి క్షమాపణ చెప్పే పరిస్థితికి కూడా నెట్టారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న ప్రతి ఒక్క యువతిపై తనకు గర్వంగా ఉంది. ఇక వారి గొంతులను ఎవరూ అణచలేరు. విద్యార్థులు తమ సమస్యలను బహిరంగంగా చెప్పుకునే అవకాశం కల్పించా ల్సిన అవసరం ఉంది' అని రాహుల్ గాంధీ అన్నారు.

**పుణెలో 'ఛత్రోన్ కీ గూంజ్'**

ఇక విద్యార్థులతో తన సమావేశాలను కొనసాగించనున్నట్లు రాహుల్ తెలిపారు. ఆగస్టు 22న పుణెలో 'ఛత్రోన్ కీ గూంజ్' పేరుతో మరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈసారి కార్యక్రమం ప్రత్యేకంగా విద్యార్థినుల కోసమే నిర్వహించనున్నట్లు తెలిపారు. 'ఇప్పుడు అమ్మాయిలు మాట్లాడతారు. దేశం వింటుంది' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను నేరుగా వినడం, వారి అనుభవాలను దేశ ప్రజల ముందుకు తీసుకు రావడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

**ఆగస్టు 5న విద్యార్థులతో భేటీ**



రాహుల్ గాంధీ ఈ నెల 5న విద్యా ర్థులతో సమావేశమైన అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదుగురు విద్యార్థులు ఆయనతో కలిసి మీడియా ముందుకు వచ్చారు. వారిలో మోడల్ రియా అహిర్ కూడా ఉన్నారు. ముంబైలో విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసు వ్యాన్‌ను అడ్డుకుంటూ ఆమె నిలబడిన ఫొటో అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అయింది. తనపై ఆన్‌లైన్‌లో వేధింపులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రియా అహిర్ పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం.
ఇక దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల నిరసనల్ని కూడా రాహుల్ గాంధీ ఇటీవల జరిగిన ఛత్రోం కీ గూంజ్ కార్యక్ర మంలో ప్రస్తావించారు. ఈ నిరసనలు చీకటిలో వెలుగు దివ్వెలా నిలిచాయని, తమ భయాల్ని పక్కనబెట్టి పోరాడిన యువతకు శుభాకాంక్షాలు తెలిపారు. అయితే సమస్యల్ని పరిష్కరించేందుకు ద్వేషం, హింసను ఆశ్రయించబోమని స్పష్టం చేసిన రాహుల్ గాంధీ 'ప్రేమ, ఆప్యాయతతో వ్యవస్థను మారుస్తాం' అని చెబుతూ, యువత కూడా అదే మార్గాన్ని అనుసరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు హాజర య్యారు. తీవ్రంగా కురిసిన వర్షానికి మైదానంలో నీళ్లు నిలిచిపోవడం, బురద పేరు కుపోయినప్పటికీ పెద్ద ఎత్తున యువత కార్యక్రమానికి తరలి వచ్చారు. రాహుల్ గాంధీ రాకకు ముందు ముంబయికి చెందిన ర్యాపర్లు డ్యాన్స్ ప్రదర్శనలు చేశారు. కార్యక్రమానికి ముందు రోజు కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలో బైక్ ర్యాలీ కూడా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు అంతకుముందు హాస్టళ్లలో ఎదురవుతున్న సమస్యలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ఇబ్బందుల్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్నట్లు తెలిపారు

### కాలువలో పడిన కారు

## నలుగురి గల్లంతు

### పశ్చిమ గోదావరిలో ఘోర ప్రమాదం

**భీమవరం, (నినాదం)**

పశ్చిమ గోదావరి జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఇరగవరం మండలం ఆయిలం పూడి లాకుల వద్ద నియంత్రణ కోల్పోయిన ఓ కారు ప్రమాదవశాత్తు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు గల్లంతు కాగా, మరో వ్యక్తి సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డాడు. ఓగిడి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు పెరవలిలో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరై, తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఆయిలంపూడి లాకుల సమీపంలో కారు ఒక్కసారిగా అదుపుతప్పి వేగంగా కాలువలోకి పడిపోయింది. ప్రమాద సమయంలో ఒక యువకుడు వెంటనే కారులో నుంచి బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకోగా, మిగిలిన నలుగురు కారుతో పాటు నీటిలో మునిగిపోయారు. గల్లంతైన వారిని పోతుల లక్ష్మి భాను (18), రాజారామ్ (17), నాగిరెడ్డి దుశ్వంత్ (18), సాయి సూర్య (19)గా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సాయంతో కాలువలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## ముత్యాలమ్మ పండుగ.. భక్తుల కోలాహలం



- బోనాలతో తరలివచ్చిన మహిళలు..
- పూజలు చేసిన మాజీ ఎమ్మెల్యే బొల్లం

**కోదాడ, ఆగస్టు 16(నినాదం):** అనంతగిరి మండలంలోని చనుపల్లి, అమీనాబాద్ గ్రామాల్లో ముత్యాలమ్మ పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, జాతర సందర్భంగా ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్లా భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది



- పోలీలను అభినందించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, ఆగస్టు 16(నినాదం ):** జిల్లా పరిధిలోని దౌల్తాబాద్ గ్రామానికి చెందిన ఓ మహిళ కుటుంబం వ్యక్తిగత సమస్యల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఆమె ఏడుస్తూ దౌల్తాబాద్ చెరువు వైపు వెళ్తుండగా, బ్లూకోల్ట్ విధుల్లో ఉన్న పీసీ చంద్రశేఖర్, పీసీ రాఘవేందర్ ఆమెను గమనించారు. ఆమె చెరువులో దూకేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని గుర్తించిన పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి, ఆమెను అడ్డుకుని కాపాడారు. అనంతరం ఆమెకు ధైర్యం చెప్పి కౌన్సెలింగ్ నిర్వహించి, కుటుంబ సభ్యుల వద్దకు సురక్షితంగా తీసుకెళ్లారు. సమయస్ఫూర్తితో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన బ్లూకోల్ట్ సిబ్బంది పోలీస్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, పోలీస్ కానిస్టేబుల్ రాఘవేందర్‌లను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అభినందించారు. ఆపదలో ఉన్న వారికి మానవతా దృక్పథంతో స్పందించి సహాయం చేయడం పోలీసుల బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు.

## సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ప్రారంభం



- పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి
- ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ

**కూకట్ పల్లి, ఆగస్టు 16 (నినాదం) :** పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ పరిధిలోని హనుమాన్ నగర్‌లో 'సుమని హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ క్లినిక్' ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు చంద్రకాంత్ రావు, జిల్లా గణేష్ తదితరులు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ క్లినిక్ యజమాని, వైద్యురాలు డాక్టర్ సుకన్యను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హనుమాన్ నగర్ మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా నివసిస్తున్నాయని, వారందరికీ అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఒకే చోట జనరల్ ఫిజిషియన్, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ వంటి ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులో ఉంచడం అభినందనీయమని అన్నారు. వైద్యులు రోగులతో సానుకూలంగా మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ పెద్దలు, వివిధ వైద్య నిపుణులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

### బీఆర్ఎస్‌లో చేరిన గౌతమ్ నగర్ డివిజన్ యువకులు



**మల్కాజిగిరి, ఆగస్టు 17 (నినాదం):** బిఆర్ఎస్ పార్టీ అధికారంలో లేకపోయినా, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మల్కాజిగిరి నియోజకవర్గం లోని ప్రజలకు దగ్గరగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చి అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని, బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు, సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. గౌతమ్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు మాశెట్టి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వివిధ పార్టీ లకు చెందిన పలువురు యువకులు బిఆర్ఎస్ పార్టీ లో చేరారు. వారికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ గులాబీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాన్ని పాతిపెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- కూకట్ పల్లి, శేర్లింగంపల్లి నియోజకవర్గాల బీఆర్ఎస్ నేతలతో సమీక్షా సమావేశం
- ఎస్ఐఆర్ తుది జాబితాపై ప్రత్యేకదృష్టి పెట్టాలని దిశానిర్దేశం
- కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల నిలుపుదలపై తీవ్ర ఆగ్రహం



**కూకట్ పల్లి, ఆగస్టు 16 (నినాదం) :** ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతి పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కూకట పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం కూకట్ పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎస్ఐఆర్ తుది జాబితా రూపకల్పన, ప్రజా సమస్యలు మరియు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రధానంగా ఓటర్ల జాబితా ప్రక్షాళనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న అర్హుల ఓట్లు ఏమైనా తొలగింపునకు గురైతే ఆ వివరాలను సేకరించి సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు బాధ్యతను వివరిస్తూ, ఓటు లేని వారిని కొత్తగా చేర్పించే దిశగా నాయకులు చొరవ తీసుకోవాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి, 'ప్రజా పాలన' ముసుగులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తోందని దుయ్యబట్టారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామన్న రేవంత్ రెడ్డి సర్కార్ నేడు ఆ లక్ష రూపాయల సాయానికి కూడా దిక్కులేకుండా చేసిందని విమర్శించారు. ఇప్పటికే మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీని నిలిపివేయడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేద ఆడబిడ్డల కల నెరవేర్చడానికి నాటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన ఈ పవిత్ర పథకాలను అడ్డుకోవడం ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. కేసీఆర్ కిట్ల నిలిపివేత, నిరుపేదల పింఛన్ల తొలగింపు, ఉన్న ప్రభుత్వ భూములను విక్రయించడంతో పాటు చివరకు చిన్నపిల్లలకు ఉపయోగపడే పార్కు స్థలాలను కూడా అమ్మి వారి భవిష్యత్తును అంధకారం చేస్తున్నారని మండిపడ్డారు. 420 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని రంగాలను భ్రష్టు పట్టించిన ఈ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వారి మోసాలను ఎండగట్టే బాధ్యత బీఆర్ఎస్ శ్రేణులు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఉచిత శిక్షణ అందించడం.. ఉద్యోగ సాధనకు మార్గం

### రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి





**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 16 (నినాదం):** పేద కుటుంబాలకు చెందిన యువతకు పోటీ పరీక్షలపై ఉచిత శిక్షణ అందించడం ఉద్యోగ సాధనకు మార్గం చూపుతోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుకర్ స్వామి ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం నిర్వహించనున్న ఉచిత ప్రీ–రిక్రూట్‌మెంట్ శిక్షణకు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 11 కేంద్రాల్లో ఎలిజిబిలిటీ టెస్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన అభ్యర్థుల కోసం వనపర్తి జిల్లా కేంద్రంలోని రేడియంట్ కాన్సెప్ట్ స్కూల్ లో ఆదివారం పరీక్ష నిర్వహించగా సుమారు 500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై అభ్యర్థులకు పరీక్షా పత్రాలను పంపిణీ చేసి పరీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ 2005 నుంచి ఇప్పటివరకు మధుకర్ స్వామి, గద్దె భాస్కర్ లు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అందిస్తున్న సేవలను ప్రత్యేకంగా ఆయన ప్రశంసించారు. గ్రామీణ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పిస్తూ వారికి ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన శిక్షణ అందించడం సామాజిక బాధ్యతతో కూడిన గొప్ప కార్యక్రమమని ఆయన కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో దోహదపడాలని ఆకాంక్షించారు. పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ గద్దె భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఎలిజిబిలిటీ టెస్ట్‌కు అభ్యర్థుల నుంచి విశేషస్పందన లభించిందన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులకు సబ్‌ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత ప్రీ–రిక్రూట్‌మెంట్ శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్, రేడియంట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పరి తిరుమలేష్, పాఠశాల సిబ్బంది, ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, కవిత, బాలసుబ్రమణ్యం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు శైలజ, సాహితీ కళా వేదిక ప్రతినిధులు భైరవ చంద్రశేఖర్, డాక్టర్ బైరోజు శ్యాంసుందర్, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# అసమానతల నిర్మూలనతోనే సామాజిక న్యాయం

### డిల్లీ విద్యార్థుల స్ఫూర్తితో సామాజికోద్యమాలు...

### కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



**మల్కాజిగిరి, ఆగస్టు 17(నినాదం):** సామాజిక ఆర్థిక రాజకీయ అంతరాలను అంతం చేయడం ద్వారానే సామాజిక న్యాయం సిద్ధిస్తుందని జెన్ జీ తరం సామాజిక న్యాయ సాధన కోసం ఉద్యమించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఓల్డ్ నేరేడ్ మెట్ లోని అంబేద్కర్ భవన్ లో కుల వివక్ష వ్యతిరేక సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో "79 ఏళ్ల స్వాతంత్ర్యం సామాజిక న్యాయం' అనే అంశంపై జిల్లా సదస్సు నిర్వహించారు. కేవీపీఎస్ జిల్లా ఆధ్యక్షులు ఎం కృపాసాగర్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళితులపై రోజురోజుకి దౌర్జన్యాలు పెట్రేగిపోతున్నాయని, ప్రత్యేకించి ఉత్తర ప్రదేశ్ లో గత పన్నెండ్ల కాలంలో 59 వేల దౌర్జన్యాలు జరిగాయన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ లోనే దౌర్జన్యాలు ఎక్కువ జరుగుతున్నాయని, ఢిల్లీ కేంద్రంగా రిజర్వేషన్ హటావో ఆందోళన చేస్తున్న వారివెనుక ఆర్ఎస్ఎస్ బిజెపి హస్తం ఉందన్నారు. బిజెపి రాజకీయ విధానం దళితులు బలహీన వర్గాలు మైనార్టీలకు వ్యతిరేకంగా ఉంటుందని ఈ వాస్తవాన్ని గ్రహించి బిజెపి మనువాద మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా యువతరం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. బిజెపి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్ మధ్యప్రదేశ్ రాజస్థాన్ ఛత్తీస్ ఘడ్ బీహార్ ఢిల్లీ రాష్ట్రాల్లో దళితులపై గంటకు 15 దౌర్జన్యాలు జరుగుతున్నాయని చెప్పారు రాజ్యాంగ బద్ధంగా రూపొందించిన ఎన్నికల కమిషన్ ఈ డి, సి బి ఐ వంటి స్వతంత్ర సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలపై కక్ష సాధింపులకు పాల్పడుతుందన్నారు బిజెపి విధానాల ఫలితంగా గౌతం ఆదాని ప్రపంచంలో అతిపెద్ద రెండవ కుబేరుడుగా ఒకవైపు ఎదిగితే మరొకవైపున 46 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నారని చెప్పారు లక్షల కోట్ల రూపాయలు బడా పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని మరోవైపున పేదలపై మోయలేని భారాలు మోపుతుందని విమర్శించారు అసమాన తల పెరుగుదల దేశ అభివృద్ధికి అడ్డుగా నిలుస్తుందన్నారు రిజర్వేషన్లు రద్దు చేయడానికి కుట్ర జరుగుతుందని, కులాన్ని రద్దు చేయడం ద్వారా రిజర్వేషన్లు లేకుండా పోతాయని కులాన్ని రద్దు చేసే ధైర్యం కేంద్ర బిజెపి సర్కార్ కు ఉందా అని ప్రశ్నించారు. కుల వివక్ష అంటరానితనం 79 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా కొనసాగడం దేశ పాలకులు సిగ్గుతో తలదించుకోవాలని, సాటి మనిషిని మనిషిగా ప్రేమించలేని వాళ్లే మత కలహాలు సృష్టించి దేశ ప్రజల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారని, నేటికీ కొనసాగుతున్న కుల వివక్ష అంటరానితనం ఈ దేశ దీనస్థితికి కారణమని, ఇటీవల ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఉద్యమ స్ఫూర్తితో విద్యారంగ పరిరక్షణ ఉపాధి వంటి లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఓవైపు జెన్ జీ ఉద్యమాన్ని బలపరుస్తూనే తమ సంఘ పరివార్ కార్యకర్తలతో మరోవైపున ఆ ఉద్యమంపై అనేక అసత్య ప్రచారాలు సామాజిక మాధ్యమాలలో చేపట్టారని విమర్శించారు బీజేపీపై వ్యతిరేకత పెరుగుతున్న ప్రతి సందర్భంలో అసంతృప్తి వెలిబుచ్చిన ప్రజలతో ఉన్నట్లు ఆర్ఎస్ఎస్ నటన చేస్తుందన్నారు ఉత్తరాఖండ్ రామ్ లీలా మైదానంలో ఒక జాతీయ పార్టీ అధ్యక్షులు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శ్రీరామ్ సేన పేరిట శుద్ధికరణ చేసిన దాని వెనక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందన్నారు. దళితుల పట్ల బీజేపీ ఆర్ఎస్ఎస్ వైఖరేమిటో దీన్నిబట్టి విధితమవుతుందన్నారు. రైతాంగ ఉద్యమం విద్యార్థి ఉద్యమం బిజెపి పాలకుల మెడలు వచ్చిందన్నారు ప్రజాస్వామ్య దేశంలో నియంత పాలనకు చోటు లేదని, సామాజిక న్యాయం సాధించబడాలంటే భూమి పరిశ్రమలు ప్రకృతి వనరులు అన్నింటిలో ప్రజలకు సహజ న్యాయం జరగడం ద్వారానే సంపూర్ణ సామాజిక న్యాయం సిద్ధించబడుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జి శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎన్ బాలపీరు, జిల్లా ఉపాధ్యక్షులు చింతల యాదయ్య, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎన్ సృజన, ఆల్ పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి లు పాల్గని మాట్లాడారు. ఈ కార్యక్రమం లో కేవీపీఎస్ సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎన్ సబిత, జయరాజు, గుంటి లక్ష్మణ్, లీలావతి, దర్శనం, రమేష్, పి భాగ్య, సిహెచ్ అశోక్, బాలయ్య, మధు, స్వాతి, హరి, పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

### ఆలస్యంగా వెలుగులోకి ఘటన



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు16(నినాదం):** ఇంట్లో నుండి గత మూడు రోజుల క్రితం బయటకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన కాటారం మండలం మద్దులపల్లిలో ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కాటారం మండలం మద్దులపల్లికి చెందిన పొట్ల లక్ష్మీరాజు(20) ఈ నెల 14న సాయంత్రం పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై ఇంటి నుండి బయల్దేరి వెళ్ళాడు. మూడు రోజులుగా లక్ష్మీరాజు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసినప్పటికి ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఇదే క్రమంలో కాటారం మండలం మేడిపల్లి శివారు అటవీప్రాంతంలో ఓ యువకుడు అనుమానస్పదంగా మృతి చెంది ఉన్నట్లు అటు వైపుగా వెళ్లిన పశువుల కాపరి చూశారు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. ద్విచక్ర వాహనం జాతీయ రహదారి పక్కనే గల చెట్టును బలంగా ఢీ కొట్టడంతో సదరు యువకుడు ఎగిరిపడి తీవ్ర గాయాల పాలై మృతి చెందినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మృతదేహం కొంత కుళ్ళిపోయి ఉండటంతో గత రెండు, మూడు రోజుల క్రితం ఈ ప్రమాదం జరిగిన ఆనవాళ్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా అనుమానంతో లక్ష్మీరాజు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా దీంతో వారు మృతదేహం వద్దకు చేరుకొని లక్ష్మీరాజుగా నిర్ధారించారు. మృతుడి తండ్రి నర్సయ్య గత కొంత కాలం క్రితం మృతి చెందగా తల్లి మల్లమ్మ ఉన్నారు. లక్ష్మీరాజు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

# దేశానికి వాజ్ పేయి చేసిన సేవలు చిరస్మరణీయం

- మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి




**మల్కాజిగిరి, ఆగస్టు 16 (నినాదం):** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం వినాయక్ నగర్ లోని వాజ్‌పేయి విగ్రహానికి వినాయక్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. దేశభక్తి, ప్రజాసేవ, విలువలతో కూడిన రాజకీయాలకు వాజ్‌పేయి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, సాయి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## 60 లక్షల రూపాయల రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 16 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 279వ ముతామేస్త్రి నగర్ డివిజన్ శ్రీరామ్ నగర్–-బి రోడ్డు, ముతామేస్త్రి నగర్ ప్రాంతాల్లో 8, 9, 10, 11, 12వ వీధుల్లో రోడ్ల దుస్థితి కారణంగా ప్రజల రాకపోకలకు, చిన్నారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని స్థానికులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సిఎంసి నిధుల ద్వారా రూ. 60 లక్షల మంజూరు చేయించి రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ఆదివారం స్థానికులు స్థానిక పార్టీ ముఖ్య నేతల తో కలిసి రోడ్డుపనులకు కొలను హనుమంత రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, డీసీసీ సెక్రటరీ లాయక్, అజయ్, జమీర్ రహీమ్, కలీమ్, గఫార్, ఖాజా రెహ్మాన్ ఖలీల్, ఎం.డి. ఖలీల్ ఉర్ రెహ్మాన్, హనీఫ్, నవీన్ గౌడ్, యాదగిరి, బుచ్చి రెడ్డి, అంజనేయులు, నరసింహాచారి, విశ్వనాథ్, ప్రభాకర్, అజాజ్, శ్రావణ్, విష్ణువర్ధన్ గౌడ్, కృష్ణ గౌడ్, ప్రభు గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాలు



**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 16 (నినాదం):** తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతి కథ బోనాల పండుగ జరుపుకుంటామని ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణం లోని ఊర ముత్యాలమ్మ, 48వ వార్డు కోట మైసమ్మ 16వ వార్డు బేచిరాగ్ మాదారం శ్రీ ముత్యాలమ్మ ఒకటో వార్డు లోని ముత్యాలమ్మ రెండో వార్డులోని ముత్యాలమ్మ దేవాలయాలను మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న తో కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రావణమాసం మొదటి వారంలో జరిగే బోనాల పండుగకు ఎంతో విశిష్టత దాగి ఉందని పూర్వీకుల నుండి బోనాల పండుగ ఆనవాయితీగా తెలంగాణ ప్రజలు జరుపుకుంటారని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ నిర్వహకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరి కుంట్ల వేణుగోపాల్ జిల్లా యువజన అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ మాజీ జెడ్పిటిసి చింతమల రమేష్ అబ్దుల్ రహీం కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి మన్యం అరుణ మల్లేష్ గుణగంటి హేమ సతీష్ కోడి శిరీష జహీర్ తన్వీర్ మణిరత శ్రీనివాస్ దండు మైసమ్మ దేవాలయం చైర్మన్ తంగెళ్ల కరుణాకర్ రెడ్డి ఇతరులు పాల్గొన్నారు.



## జిల్లా వ్యవసాయ శాఖకు ఉత్తమ పురస్కారం



**గద్వాల బ్యూరో, ఆగస్టు 16 (నినాదం ):** జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ పని తీరుకు రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం లభించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించిన వేడుకల్లో జోగులాంబ గద్వాల జిల్లా వ్యవసాయ శాఖ తరఫున తాను రాష్ట్రస్థాయి ఉత్తమ పనితీరు అవార్డును రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు గోపి చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు. జిల్లాలో రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించడంతో పాటు, ప్రభుత్వ వ్యవసాయ పథకాలను క్షేత్రస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచిందన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల కృషి వలన ఈ గుర్తింపు సాధ్యమైందని తెలిపారు. ఇకముందు కూడా తమ అధికారులు, సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో, బాధ్యతతో పని చేసి రైతుల సంక్షేమానికి కృషి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## బాలకృష్ణ మృతదేహానికి కాంగ్రెస్ నేతల నివాళులు



**అశ్వాపురం, ఆగస్టు 16 (నినాదం):** మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామం ఎస్సీ (సర్వయ్యగూడెం) కాలనీకి చెందిన కాంగ్రెస్ బాలకృష్ణ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు ఆదివారం బాలకృష్ణ నివాసానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాలకృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, మల్లెలమడుగు సర్పంచ్ మచ్చ నరసింహారావు, అవుల రవి, గొల్లపల్లి నరేష్, ఐప్పలకూరి వెంకట్, వంగూరి మధు, బొడ్డు సైదులు, బొడ్డు కృష్ణ, బొడ్డు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు



**కల్వకుర్తి , ఆగస్టు 16 (నినాదం):** తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోని ఖలుపల్లి గ్రామ పంచాయతీలోని జర్పుల సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్యాంక్ ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ కడారి శేఖర్ యాదవ్, ఉప సర్పంచ్ శ్రీశైలం గౌడ్, వార్డు సభ్యులు జగదీష్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, నాగయ్య, శివ, గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వర్షకాల సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడు ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరతకు అవకాశం..

### జూరాల నీటిని పొదుపుగా వినియోగించాలి

**వరికి బదులుగా తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి**



**గద్వాల బ్యూరో ఆగస్టు 16 (నినాదం):** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని నీటిపారుదల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ డి. కేశవరావు అన్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గుతున్న నేపథ్యంలో పర్యవేక్షక ఇంజనీర్ డి. కేశవరావు ఆధ్వర్యంలో నీటిపారుదల శాఖ అధికారులు, కార్యనిర్వాహక ఇంజనీర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. రైతుల పంటల అవసరాలు, అందుబాటులో ఉన్న నీటి పరిస్థితిపై సమీక్షించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రానున్న రోజుల్లో సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. రైతులు తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగు చేయవద్దని సూచించారు. జూరాల ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గిన వెంటనే ముందస్తు చర్యగా కాలువలను మూసివేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులు ఆందోళన చెందవద్దని, సాగునీటిని క్రమపద్ధతిలో విడుదల చేస్తామని పేర్కొన్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో అందుబాటులో ఉన్న నీరు ఆయకట్టు పరిధిలోని గ్రామాలు, మండలాల తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైతులు సాగునీటిని అవసరానికి అనుగుణంగా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో జూరాలకు సరిపడా నీటి ప్రవాహం వచ్చినట్లయితే అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించి కాలువలకు సాగునీటి విడుదలపై తదుపరి చర్యలు తీసుకుంటామని పర్యవేక్షక ఇంజనీర్ డి. కేశవరావు తెలిపారు. ఈ సమావేశంలో ఇంజినీర్లు , అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్లు పెట్టి సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

**బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జ్**



**మధిర, ఆగస్టు 16 (నినాదం):** మధిర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత మధిర బిఆర్ఎస్ పార్టీనియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజ్ మాట్లాడుతూ మధిర నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో విధ్వంసం జరుగుతుంది. గతంలో మధిర అంటే గొప్ప పేరు ఉండేది. ఇప్పుడు మధిరకు మంచి పేరు లేదు. నియోజకవర్గంలో నాయకుడికి డబ్బులు వచ్చే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోడ్ల వెడల్పు పేరుతో అడ్డగోలుగా ధ్వంసం చేస్తున్నారు. సామాన్యుల ఆస్తులను మాత్రం పడగొడుతున్నారు. రోడ్డుకు దగ్గరగా ఉన్న కాంగ్రెస్ ఆఫీసును ఎందుకు తొలగించడం లేదు. మధిరలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం పంట పొలాలను 260 ఎకరాలను రైతుల దగ్గర తీసుకునేందుకు 193 కోట్లు కేటాయించారు. ఈ ఔటర్ రింగ్ రోడ్డు కనుక అయితే మధిరలో వ్యాపార వాణిజ్య సంస్థలు పూర్తిగా మూతపడతాయి. రింగు రోడ్డు పేరుతో రైతుల భూము లను అతి తక్కువ ధరలకు తీసుకుంటే బి ఆర్ ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుంది. ఔటర్ రింగ్ రోడ్డు ఎందుకోసమో డిప్యూటీ సీఎం సమాధానం చెప్పాలి. నిజంగా మీకు అభివృద్ధి చేయాలని తపన ఉంటే సిరిపురం నుండి మధిర వరకు, దెందుకూరు నుండి మధిర వరకు, రాయపట్నం నుండి మధిర వరకు డివైడర్లు పెట్టి సెంటర్ లైటింగును ఏర్పాటు చేయాలి. ఈ అభివృద్ధి మధిర కోసమేనా లేక మీకోసమేనా చెప్పాలి. బి ఆర్ఎస్ పాలనలోనే మధిర అభివృద్ధి. మేము చేసిన అభివృద్ధిని కాంగ్రెస్ నాయకులు మేము చేసాము అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2వ విడత ఎస్ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు

### నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి: సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి

**కల్వకుర్తి ఆగస్టు 16 (నినాదం):** కల్వకుర్తి పట్టణం గ్రామీణ ప్రాంత యువతకు ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో అండగా నిలవాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని తహశీల్దార్ ఆఫీస్ ఎదురుగా పాత కృష్ణవేణి జూనియర్ కాలేజ్ బిల్డింగ్ లో నిర్వహిస్తున్న ఎస్ ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ 2వ బ్యాచ్‌నుఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓసుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఈరోజు ప్రారంభించారు,ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఒక విద్యార్థి జీవితంలో ఉద్యోగం ఎంత ముఖ్యమో ప్రతి యువత గుర్తించాలన్నారు,ఉద్యోగం సాధించడం అంటే కేవలం నెలవారీ జీతం పొందడం మాత్రమే కాదని.. అది ఒక యువకుడి జీవితానికి స్థిరత్వం, కుటుం బానికి ఆర్థిక భరోసా, తల్లిదండ్రులకు సమాజంలో గౌరవం తీసుకువచ్చే గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖలో ఉద్యోగాల భర్తీకి అవకాశం కల్పిస్తూ ఎస్ ఐ కానిస్టేబుల్ తదితర విభాగాల్లో మొత్తం 7 వేలకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేయడం పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతకు ఒక గొప్ప అవకాశమని తెలిపారు,అవకాశం వచ్చినప్పుడు సిద్ధం కావడం కాదు.. అవకాశం



రాకముందే సిద్ధంగా ఉండాలి అనే ఉద్దేశంతోనే ఈ ఉచిత శిక్షణను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇచ్చిన ఈ సమయంలో యువత సమయాన్ని వృథా చేయకుండా క్రమశిక్షణతో చదివి శారీరక దారుఢ్యంతో పాటు రాత పరీక్షకు కూడా పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని సూచించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎస్ ఐ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ మొదటి బ్యాచ్‌ను విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందని,ఆరు మండలాల్లో మొదటి బ్యాచ్ ద్వారా గ్రామీణ యువతకు నాణ్యమైన శిక్షణ,పరీక్షల ద్వారా నిరంతర ప్రాక్టీస్, మార్గదర్శకత్వం అందించామని తెలిపారు, మొదటి బ్యాచ్ ఇచ్చిన అనుభవం, విద్యార్థుల నుంచి వచ్చిన స్పందన ఆధారంగా ఇప్పుడు మరింత మెరుగైన



ప్రణాళికతో కల్వకుర్తిలో రెండో బ్యాచ్‌ను ప్రారంభిస్తున్నామని చెప్పారు,గ్రామీణ ప్రాంతంలో ప్రతిభ ఉన్న ప్రతి యువకుడికి సమానమైన అవకాశం లభించాలన్నదే తన లక్ష్యమని,ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారి ఏ ఒక్క విద్యార్థి కూడా తన ఉద్యోగ కలను వదులుకోకూడదని.. ప్రతిభ ఉన్న యువతకు శిక్షణ, మార్గదర్శకత్వం అందించి వారిని ఉద్యోగ సాధన దిశగా నడిపించాలనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ కార్యక్రమాలను కొనసాగిస్తుందని తెలిపారు,యువతకు కేవలం పోలీస్ ఉద్యోగ శిక్షణ మాత్రమే కాకుండా నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, శిక్షణ, మార్గదర్శకత్వం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలన్నదే తన ప్రయత్నమని చెప్పారు,మీ కలను మీరు నమ్మండి. మీ సామర్థ్యాన్ని మీరు నిరూపించుకోండి.. మీ విజయానికి అవసరమైన సహకారం అందించేందుకు మా ఐక్యత ఫౌండేషన్ సేవలు ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటాయి అంటూ విద్యార్థులకు భరోసానిచ్చారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులు మాట్లాడుతూమా లాంటి గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే అవకాశం కల్పించడం చాలా గొప్ప విషయం, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి లేకుండా.. పూర్తిగా ఉచితంగా నాణ్యమైన శిక్షణ అందిస్తున్నందుకు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు. మా కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మా భవిష్యత్తు కోసం ఇలాంటి గొప్ప అవకాశం కల్పించడం మాకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తోంది,మాపై నమ్మకం ఉంచి.. మా కలలను సాకారం చేసుకునే దిశగా మాకు అండగా నిలుస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో,మాజీ కౌన్సిలర్ బోజి రెడ్డి,అధ్యాపకులు మోహన్ లాల్, ఫౌండేషన్ సభ్యులు యూసుఫ్ బాబా, గణేష్, శేఖర్, శ్రీపతి, శ్రీను లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మొండికుంటలో ముత్యాలమ్మ తల్లి బోనాల సందడి

### అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు.. భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లింపు

**అశ్వాపురం, ఆగస్టు 16 (నినాదం):** మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపం చాయతీ తరఫున ముందుగా ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నూతన వస్త్రాలను సమర్పించారు. అనంతరం గ్రామంలోని మహిళలు, చిన్నారులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలను సమర్పించి అమ్మవారికి తమ మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా కొందరు భక్తులు పోతురాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ ఆచార సంప్రదాయాల ప్రకారం కోళ్లు, మేకలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.



మహిళలు బోనాలతో తరలిరావడంతో గ్రామ వీధులు సందడిగా మారాయి. కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలం దరూ ఆయురారోగ్యాలతో జీవిం చాలని భక్తులు ముత్యాలమ్మ తల్లిని వేడుకు న్నారు. సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ.. ముత్యాలమ్మ తల్లి ఆశీస్సులతో మొండికుంట గ్రామం



సుభిక్షంగా ఉండాలని, గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచే భక్తుల కోరికలు నెరవేరాలని, గ్రామంపై ముత్యాలమ్మ తల్లి కృప ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు. గ్రామస్తులు, మహిళలు, యువత, చిన్నా రులు పాల్గొనడంతో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

# పరీక్షల్లో ప్రతిభ.. విద్యార్థులకు నగదు పురస్కారం

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 16 (నినాదం)** పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపినవిద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు. వనపర్తి మండలంకడుకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందినముసలి బాలరాజు తల్లిదండ్రులైన ముసలి కొండన్న, ముసలి శంకరమ్మల జ్ఞాపకార్థం2025-26 పబ్లిక్ పరీక్షల్లో టాప్ గా నిలిచిన మొదటి 5 మంది విద్యార్థులకురూ. 2000 చొప్పున, మిగతా 21 మంది విద్యార్థులకు రూ. 1500 చొప్పున మొత్తం రూ. 41, 500 నగదు పురస్కారాన్ని స్వాతంత్ర దినోత్సవ వేడుక వేడుకలసందర్భంగా అందజేసినట్లు పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండలవిద్యాశాఖ అధికారి మద్దిలేటి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, గ్రామ సర్పంచు తిరుపతయ్య, ఉప సర్పంచ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్



ఇందిరమ్మ, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు.

# కల్తి రమకు రూ,40వేలు ఆర్థిక సహాయం చేసిన ఆదివాసీ హెల్ప్ లైన్

**ఇల్లందు,ఆగస్ట్ 16,(నినాదం ) :** ఇల్లందు మండలం మామిడిగుండాల నివాసి కల్తి రమ,రామయ్య దంపతులు ఇటీవల మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం వెళ్లి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో లారి గుద్ది రమ తీవ్రంగా గాయాలపాలైంది. లారీ ప్రమాదంలో కుడికాలు తొడభాగం నుండి పాదం వరకు కండరం దెబ్బతిని, ఎడమ కాలు విరిగింది. కుడి కాలు ప్లాస్టిక్ సర్జరీ, ఎడమ కాలు ఆపరేషన్ కు 7 లక్షల వరకు ఖర్చు అవుతుందని సహాయం చేయవలసిందిగా రమ భర్త కల్తీ రామయ్య ఆదివాసీ హెల్ప్ లైన్ ఇల్లందు వారిని సంప్రదించగా ఆదివాసీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు మొదలగు వారు స్పందించి విరాళాలు అందజేశారు. అలా సమకూర్చిన 40,000 రూపాయలను ఈ రోజు కల్తీ రమ భర్త రామయ్యకు ఇల్లందు కొమరం భీం కాలనీలో హెల్ప్ లైన్ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హెల్ప్ లైన్ వ్యవస్థాపకులు కబ్బాకుల



రవి, హెల్ప్ లైన్ అధ్యక్షులు కుర్సం అంజయ్య, ఉపాధ్య క్షులు చాపల రమేష్ బాబు, కార్యవర్గ సభ్యులు కొడెం కృష్ణయ్య, మోకాళ్ళ మోహన్ రావు, పూణెం బాలరాజు, హెల్ప్ లైన్ సభ్యులు దాతలు సూర్ణపాక స్వరూప, పాయం స్వరూప, ఎట్టి సుధీర్, సరియం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# గట్టుసింగారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

### కేజీబీవీ మురుగునీటితో నరకయాతన పడుతున్న కాలనీ వాసులు

**కూసుమంచి, ఆగస్టు 16:నినాదం):** గట్టుసింగారం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ జిల్లా నాయకులు, టిడబ్ల్యూఎఫ్ జిల్లా ఇన్‌చార్జ్ గుండా ఉపేందర్‌రెడ్డి అధికారులను కోరారు. ఆదివారం లగిశెట్టి వీరబాబు, షేక్ అలీ ఆధ్వర్యంలో ఆయన కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ప్రధానంగా డ్రైనేజీ, తాగునీరు, సీసీ రోడ్ల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామానికి దూరంగా కాలనీ ఉండటంతో తమ సమస్యలను పట్టించుకునే వారు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కేజీబీవీ నుంచి వెలువడుతున్న మురుగునీరు నేరుగా డబుల్ బెడ్‌రూమ్ కాలనీ ముందు నుంచి ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తోందని తెలిపారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి, కాలనీ వాసులు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని



ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 20 కుటుంబాలు ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం విచారకరమని గుండా ఉపేందర్ రెడ్డి అన్నారు. కేజీబీవీ నుంచి వస్తున్న మురుగునీటిని కాలనీకి ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించాలని, అలాగే కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. కాలనీలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని అధికారుల ను డిమాండ్ చేశారు. పర్యటనలో బీజేపీ యువమోర్చా నాయకులు మంద చంద్రశేఖ ర్‌గౌడ్, స్థానికులు బొజ్జ రమేష్, గుంటూరు రమేష్, పావురాల శీను, కడారి జ్యోతి, లోడిగ జానయ్య, బి. లలిత, రెడ్డబోయిన లింగమ్మ, ధారా కుమార్ పాల్గొన్నారు.

17 నుంచి మండల

## స్థాయిలోనూ ప్రజావాణి

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**



**గద్వాల బ్యూరో ఆగస్టు 16 (నినాదం):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలోనే కాకుండా ఈనెల 17వ తేదీ నుంచి మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించినం దున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా సంబం ధిత మండలాల అన్ని శాఖల అధికారులు ప్రజావాణి కార్యక్ర మంలో పాల్గొంటారన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు నిర్వహించే మం డల స్థాయి ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలను సమర్పించ వచ్చన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులను సంబంధిత అధికారులు నిర్దేశిత సమయంలోగా పరిష్కరిస్తారన్నారు. ప్రజలు చిన్న చిన్న సమస్యలకే కలెక్టరేట్ వరకు రావాల్సిన అవసరం లేకుండా ఆయా మండలాల్లోనే ప్రజలు తమ సమస్యలను పరిష్కరిం చుకునేందుకు వీలుగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల సంబంధిత మండలాధికా రులు మండల స్థాయి ప్రజావాణికి సకాలంలో విచ్చేసి విజయవంతం చేయాల్సిం దిగా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## కల్దుర్కిలో ఘనంగా వాజ్ పేయి వర్ధంతి



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు6(నినాదం )ం** బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వాజ్ పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజకీయాల్లో నవశకానికి నాంది పలికి, దార్శనిక నాయకత్వంతో దేశ పురోగతికి బాటలు వేసిన మహనీయుడు వాజ్ పేయి అని కొనియాడారు. దేశాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు వాజపేయి చేసిన కృషి మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జ్యోతి శంకర్,బిజెపి కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు న్యాలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు లచ్చప్ప, భాస్కర్ రెడ్డి, రాజన్న, గంగా కిషన్, చంద్రకాంత్, రామ్ జీ,మల్లు గోండ, అశోక్, రాజు,కార్యకర్తలు అశోక్ పటేల్,రాములు, చందు, సాయిలు, మాధవరావు సాయి,రాచప్ప, తదితరులు పాల్గొన్నారు.

### రోటరీ క్లబ్ ఆఫ్ బోధన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం




**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 16(నినాదం ):** బోధన్ జిల్లా ఆస్పత్రిలో రోటరీ క్లబ్ బోధన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరాజు, అల్లే రమేష్ మాట్లాడుతూరక్తదానం చేయండి -- ప్రాణాలను కాపాడండి అనే సందేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, కిషన్, సురేష్, విగ్నేశ్వర్, వినయ్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన మరిపెడ

**- వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుక...**

**ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ , మున్సిపాలిటీ చైర్ పర్సన్ ప్రగతిశ్రీపాల్ రెడ్డి**



**డోర్నకల్ /మరిపెడ (నినాదం):** తెలంగాణలో ఆషాఢ లేదా శ్రావణ మాసంలో గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతోనిర్వహించే ప్రముఖ గ్రామదేవత పండుగ ముత్యాలమ్మ తల్లి బోనాలు. వర్షాలు బాగా కురిసి,పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామస్థులు ఆయురారోగ్యాలతోసుఖసంతోషాలతో



ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి నైవేద్యంసమ ర్పిస్తారు. మహబూబాద్ జిల్లా మరి పెడ మున్సిపా లిటీ కేంద్రంలో ముత్యాలమ్మతల్లి బోనాల పండు గను ఘనంగా నిర్వహించుకున్నారు. డోర్నకల్ నియోజకవర్గఎమ్మెల్యే రామచంద్రు నాయక్ పాల్గొని ముత్యాలమ్మ తల్లికి



మొక్కులుచెల్లించుకున్నారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ ఈసారపు ప్రగతి శ్రీపాల్‌రెడ్డి ప్రత్యేక బోనం చేసి ముత్యాలమ్మ తల్లికి మొక్కుకున్నారు. గ్రామప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని గ్రామ దేవతలకు నైవిద్యాన్ని సమర్పించి, ముత్యాలమ్మ తల్లికి పసుపు కుంకుమలతో చీరలు



సమర్పించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సి పాలిటీ వైస్ చైర్పర్సన్‌కాలం సునీత రవీందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు రాంలాల్, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ మహిళలు పెద్ద ఎత్తున ముత్యాలమ్మ తల్లికి బోనాలుసమర్పించారు.

# యువకుడికి అండగా మాజీ ఎమ్మెల్యే

**ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స.. ప్రత్యేక చొరవతో మెరుగుపడుతున్న శివ ఆరోగ్యం**





**సత్తుపల్లి, ఆగస్టు16 (నినాదం) :** తేలు కాటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకుడికి సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అండగా నిలిచి, మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక చొరవ తీసుకున్నారు. సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన 25 ఏళ్ల గొల్లమందల శివ ఇటీవల ప్రమాదవశాత్తు తేలు కాటుకు గురయ్యాడు. తేలు కాటుకు గురైన వెంటనే శివ ను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అనంతరం కొద్దిసేపటికే శివ రక్తపు వాంతులు చేసుకోవడంతో పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో ఖమ్మంలోని సంకల్ప ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివ ఆరోగ్యం క్షీణించడంతో వైద్యులు పరిస్థితిని పరిశీలించి అత్యవసర వైద్యం అందించారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దృష్టికి తీసుకొని వెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. ప్రత్యేక చొరవ తీసుకుని కేపీ అనే వ్యక్తిని ఆసుపత్రికి పంపించి వైద్యులతో సండ్ర మాట్లాడించారు. శివ ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు వైద్యులతో, కేపీతో మాట్లాడి సండ్ర పర్యవేక్షించారు. తీవ్ర ప్రాణాపాయ స్థితిలో ఉన్న శివకు ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రిలో అందిన సకాలపు వైద్యంతో ప్రస్తుతం ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సండ్ర వెంకట వీరయ్య ప్రత్యేక చొరవతోనే తమ కుమారుడికి మెరుగైన వైద్యం అందిందని శివ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఖమ్మంలోని ఆసుపత్రికి వెళ్లి శివను పరామర్శించారు. వైద్యులను కలిసి శివ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శివ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు కాలం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**డోర్నకల్ /మరిపెడ ఆగష్టు 16(నినాదం) :** మరిపెడ ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు కాలం శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను ఫర్టిలైజర్ షాప్ యాజమాన్యులు ఘనంగా నిర్వహించారు. ఫర్టిలైజర్ షాపులో కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని,ఆ భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. మరిపెడ ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులకు ఎల్లప్పుడూ తమ సేవలను ఇలాగే కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండలంలోని అన్ని ఫర్టిలైజర్ షాపుల యజమానులు పాల్గొన్నారు. ఫెర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు కాలం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాపై అభిమానంతో నాకు సోషల్ మీడియా, వాట్సాప్,స్వయంగా ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాములు.



## పరీక్షల్లో ప్రతిభ.. విద్యార్థులకు నగదు పురస్కారం

**వనపర్తి ప్రతినిధి, ఆగష్టు 16 (నినాదం) :** పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందించారు. వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ముసలి బాలరాజు తల్లిదండ్రులైన ముసలి కొండన్న, ముసలి శంకరమ్మల జ్ఞాపకార్థం 2025-26 పబ్లిక్ పరీక్షల్లో టాప్ గా నిలిచిన మొదటి 5 మంది విద్యార్థులకు రూ. 2000 చొప్పున, మిగతా 21 మంది విద్యార్థులకు రూ. 1500 చొప్పున మొత్తం రూ. 41, 500 నగదు పురస్కారాన్ని స్వాతంత్ర దినోత్సవ వేడుక వేడుకల సందర్భంగా అందజేసినట్లు పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి మదిలేటి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, గ్రామ సర్పంచు తిరుపతయ్య, ఉప సర్పంచ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఇందిరమ్మ, మాజీ సర్పంచులు, వార్డు మెంబర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు,యువకులు పాల్గొన్నారు



## చిన్నపాటి వర్షానికే తాడ్వాయి వీధులు జలమయం

**డ్రైనేజీ సమస్యపై అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం**

**మునగాల, ఆగస్టు16 (నినాదం):** తాడ్వాయి గ్రామంలో చిన్నపాటి వర్షానికే అంతర్గత రహదారులు, వీధులు మురుగు నీటితో నిండిపోతున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల ముందు మురుగునీరు నిలిచి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పాత బజారుపై నిర్లక్ష్యమంటూ ఆరోపణలు..**



గ్రామంలోని ఇతర రహదారులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా పాత బజారును పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. మోకాళ్ల లోతు నీరు నిలవడంతో దోమలు పెరిగి వ్యాధుల భయం నెలకొందన్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలి:**

మండల అభివృద్ధి అధికారి స్పందించి రోడ్డు మరమ్మతులతో పాటు శాశ్వత మురుగునీటి కాలువలు నిర్మించాలని ప్రజలు కోరారు. సమస్య పరిష్కరించకుంటే కలెక్టరేట్ ముట్టడికి దిగుతామని తాడ్వాయి గ్రామస్థులు హెచ్చరించారు.

## కల్తీ పెరుగు, కోవా తయారీ కేంద్రంపై ఎస్ఓటీ దాడి





**జవహర్ నగర్, ఆగస్టు 16( నినాదం):** కాప్రా సర్కిల్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో ఓ మిల్క్ సెంటర్‌లో కల్తీ పెరుగు, కోవా తయారు చేస్తున్న కేంద్రంపై మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా 120 కిలోల కల్తీ పెరుగు, 6 కిలోల కోవాను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి తయారీ, గడువు తేదీలు, లేబుళ్లు లేకుండా పెరుగు, కోవా తయారు చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు ఎస్ఓటీ ఎస్ఐ. సాయికుమార్ తెలిపారు. తనిఖీల్లో సుమారు వెయ్యి కిలోల పెరుగు, 50 కిలోల కోవా నిల్వ ఉన్నట్లు గుర్తించామన్నారు. పెరుగు, కోవా నమూనాలను ఆహార భద్రతాధికారులకు పంపించామని, పరీక్షల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కల్తీ ఆహార పదార్థాలను తయారు చేసి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో కల్తీ పెరుగు కల్తీ పదార్థాలు పట్టుకున్నారని వైరల్ కావడంతో మళ్లీ రంగంలోకి దిగిన ఎస్ఓటి పోలీసులు దాడి చేసి 120 కిలోల కల్తీ పెరుగు. 50 కిలోల కల్తీ కోవాను పట్టుకొని జవహర్ నగర్ ఎస్ఓటి పోలీసులకుఅప్పగించారు. అక్రమంగా దొంగ చాటున నడుపుతున్న మిల్క్ సెంటర్ ను ఎస్ఓటి పోలీసులు సీజ్ చేసి మిల్క్ సెంటర్ యజమానిని జవహర్ నగర్ ఎస్ ఓ టి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ మిల్క్ సెంటర్ లో గత కొంతకాలంగా కల్తీ పదార్థాలను తరలిస్తూ ప్రముఖ బ్రాండ్ల పేరుమీద చలామణి చేస్తూ కల్తీ వస్తువులకు ఆద్యం పోస్తున్నాడు. మిల్క్ షాప్ యజమాని కల్తీ వస్తువులు అమ్ముతూ ప్రజల ప్రాణాల పాలిట యమ శాపాలుగా మారారని, ఇకపై కల్తీ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నారు.

## విహారయాత్రలో విషాదం..

**మానేరు వాగులో పడి వ్యక్తి మృతి**



**సుల్తానాబాద్, ఆగస్టు16 (నినాదం):** కుటుంబ సభ్యులతో కలిసి సరదా గా విహారయాత్రకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మానేరు వా గులో పడి మృతిచెందిన విషాద ఘటన సుల్తానా బాద్ మండలం నీరుకుల్ల గ్రామంలో చోటుచేసు కుంది. ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వి వరాల ప్రకారం.. సుల్తానాబాద్ మున్సిపల్ కేంద్రా నికి చెందిన ఎం. డి. జాంగిర్ (43) కుటుం బ సభ్యు లతో కలిసి నీరుకుల్లలోని మానేరు వాగు వద్దకు విహారయాత్రకు వెళ్లారు. కుటుంబ సభ్యులతో క లిసి సరదాగా గడుపుతున్న సమయంలో జాంగిర్ ప్రమాదవ శాత్తు మానేరులో పడిపోయారు. కు టుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. స మాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంత రం జాంగిర్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీ సినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసు లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కు టుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు వె ళ్లిన జాంగిర్ మృతి చెందడం తో బంధువులు, కుటుంబ సభ్యు లు కన్నీరుమున్నీరయ్యారు. గ్రా మంలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

## ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం

**ఆగస్టు 17 నుంచి ప్రారంభం.. మండల కేంద్రాల్లోనే దరఖాస్తుల స్వీకరణ**



**చింతలమానేపల్లి ఆగష్టు 16(నినాదం):** చింతలమానేపల్లి మండలంలోని అన్ని గ్రామాల ప్రజల సమస్యలను స్థానికంగానే పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ఆగస్టు 17వ తేదీ సోమవారం ఉదయం 10గంటల నుండి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రారంభించనున్నట్లు. ఎంపీడీఓ సత్యనారాయణ తెల్పినారు. ఈ ప్రజావాణి కార్యక్రమం లో ఎమ్మార్వో గేడం ప్రకాష్, అన్ని శాఖల అధికారులు పాల్గొంటా రని ఎంపీడీఓ అన్నారు. ఇకపై ప్రతి సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించనున్నమని అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమకు ఎదురవుతున్న వ్యక్తిగత, సామాజిక, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తుల రూపంలో సమర్పించవచ్చు. ముఖ్యంగా రేషన్ కార్డులు, పింఛన్లు, భూ సమస్యలు, ధరణి/భూ రికార్డులు, విద్యుత్, తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, గృహ నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు.

**అధికారుల సమన్వయంతో పరిష్కారం**

ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం లేకుండా సమయపాలన పాటించాలని ఉన్నతాధికారులు సంబంధిత అధికారులకు సూచించనున్నారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను నమోదు చేసి, ప్రజలకు సమాచారం అందించేలా చర్యలు తీసుకోనున్నారు.

**ప్రజలకు అందుబాటులో పాలన**

మండల స్థాయిలోనే ప్రజావాణి నిర్వహించడం వల్ల జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ప్రజలకు లభించనుంది. దీంతో సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత సులభతరం కానుంది. ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని పారదర్శకంగా స్వీకరించి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అర్హత ఉన్న సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపడంతో పాటు, ఇతర శాఖల పరిధిలో ఉన్న అంశాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నారు.

**ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి**

చింతలమానేపల్లి మండలంలోని ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సత్యనారాయణ కోరారు. తమ సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో దరఖాస్తును సమర్పించాలని, అవసరమైన పత్రాల ప్రతులను జతచేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ పాలనను మరింత చేరువ చేయడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, అన్ని శాఖల అధికార యంత్రాంగంలో జవాబుదారీతనం పెంచడం లక్ష్యంగా మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం కొనసాగనుంది కావున ప్రజలు అందరూ కూడా ఈ అవకాశాన్ని సాధ్వినియోగం చేసుకోవాలని తెల్పినారు.

## పర్యావరణ రక్షకులు.. పారిశుద్ధ్య కార్మికులు

**పారిశుద్ధ్య కార్మికుల... సేవలు వెలకట్టలేం**

**బీజేవైఎం అధ్యక్షులు శశాంక్ సింగ్**





**జవహర్ నగర్, ఆగష్టు 16 (నినాదం):** పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేమని వారు ప్రకృతికి పర్యావరణానికి రక్షకులని బీజేవైఎం అధ్యక్షులు శశాంక్ సింగ్ పేర్కొన్నారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లో మేడ్చల్ రూరల్ జిల్లా జవహర్ నగర్ డివిజన్లో బీజేవైఎం అధ్యక్షులు, డివిజన్ బిజెపి అధ్యక్షులు కలికోట కమలాకర్ సమక్షంలో ఆదివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శశాంక్ సింగ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు జవహర్ నగర్ పారిశుద్ధ్య కార్మికుల విషయంలో నిర్లక్ష్యం చేశాయని జవహర్ నగర్ గ్రామపంచాయతీ నుండి మున్సిపల్ కార్పొరేషన్ గా మారిన ఆ తర్వాత మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ గా మారినా వారి జీవితాల్లో మార్పు రాలేదని తెలిపారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇప్పటివరకు పారిశుద్ధ్య కార్మికుల విషయంలో ఏమి న్యాయం చేయలేదని దుయ్యబట్టారు. ముఖ్యంగా కార్మికులకు జీతాలు పెంచాలని ఉద్యోగాలు పెర్మనెంట్ చేయాలని మౌలిక వస్తువులైన గ్లౌజులు, బూట్స్, రైన్ కోట్స్, మాస్కులు తదితర సామాగ్రిని అందజే యాలని వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని వారికి పెన్షన్స్ సౌకర్యాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు గొడుగులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు తులసిరాం అమర్ రవి అనిల్ అరుణ్ కుమార్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అంగట్లో సరుకుల్లా అంగన్వాడీ పోస్టులు..

**దరఖాస్తుదారులతో ప్రజా ప్రతినిధుల భేరసారాలు..**

**టీచరుకు రూ 2 నుండి రూ 3 లక్షలు, ఆయాకు లక్ష డిమాండ్..**

**ఎంపికల్లో నిబంధనలకు నీళ్లు...?**



**ఇల్లందు,ఆగస్టు16, (నినాదం):** అంగట్లో సరుకుల్ల అంగన్వాడీ టీచర్,ఆయా పోస్టులు మారాయని దరఖాస్తు దారులు వాపోతున్నారు. ఎంపికలు పారదర్శకంగా నిబంధనల ప్రకారం ఎంపిక చేస్తామంటూ ఎంపికలను కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తారని అని చెప్తున్నప్పటికీ స్థానికంగా నా అధికారులు మాత్రం నిబంధనలకు నీళ్లు వదిలి స్థానిక ప్రజాప్రతినిలో ఒత్తిడికి తలలొగ్గి ఎంపికలు చేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో మొత్తం 80 పోస్టులు ఖాళీగా ఉండగా ఇల్లందు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 5 టిచర్ పోస్టులు ఖాళీగా వున్నాయి. ఈ పోస్టులకు ఆయా ప్రాంతాలకు కేటాయించి కులాల వారీగా ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నిబంధనలను పాటించకుండా ప్రాథమిక ఎంపిక లిస్టులో ఇతర కులాలకు చెందిన వారి పేర్లను అర్హులుగా గుర్తించినట్లు సమాచారం.

**పోస్ట్ ను బట్టి డిమాండ్..**

టీచర్ పోస్టుకు రూ 2లక్షల నుండి రూ 3 లక్షలు ఆయా పోస్ట్ కి రూ,లక్ష అంటూ ప్రజా ప్రతినిధులు పోస్ట్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో బెరసారాలు ఆడుతున్నారు. అంగన్వాడీ పోస్టులు ఖాళీగా ఉన్న ఆయా ప్రాంతాల పరిధిలో ఉన్న ప్రజాప్రతినిధులు నేరుగా ఫోన్ల ద్వారా దరఖాస్తుదారులతో బేరసారాలు ఆడుతూ డిమాండ్ చేస్తున్నారట. ఐసిడిఎస్ అధికారులు విడుదల చేసిన నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ తాము సూచించిన అభ్యర్థులకే ఎంపిక నిర్వహిస్తారు అంటూ దరఖాస్తుదారులను తప్పుతోవ పట్టిస్తున్నారు.

**ఎంపికల్లో మా మాటే వేదవకు...**

తాము ఫలానా ఫలానా మంత్రి ఎంపీ ఎమ్మెల్యేలకు నేను చాలా కావలసిన వాళ్ళం దగ్గర వారం రేపు వారికి ఓట్లు వేసి గెలిపించేది కూడా మేమే కాబట్టి వారు నేను చెప్పినట్టు విని మేము సూచించే అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలో ఈ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా లెటర్ ప్యాడ్ ద్వారా ఆదేశాలు ఇస్తారంటూ అభ్యర్థులను నమ్మించి ప్రయత్నంలో నిమగ్నమయ్యారంటూ అన్ని అనుమతులు ఉన్నప్పటికీ దరఖాస్తులు తిరస్కరణకు గురైన అభ్యర్థులు వాపోతున్నరు.

**నిబంధనలకు నీళ్లు ఎంపికపై అనుమానాలులి..**

ఎంపికల విషయంలో ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలకు స్థానికంగా స్క్రూటీని చేసి ప్రాథమిక లిస్ట్ ఎంపిక చేసే చేసే సమయంలో అధికారులు నిబంధనలు పాటించడం లేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కొన్ని సెంటర్లు నిబంధనల ప్రకారం క్యాస్ట్ రిజర్వేషన్ పాటించకుండా ఇతర కేటగిరీలకు చెందిన వారిని ప్రాథమిక ఎంపిక లిస్టులో అర్హులుగా ప్రకటించారని రాబోతున్నారు. దరఖాస్తు సమయంలో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను జత చేసినప్పటికీ స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధుల ఒత్తిడితో కొందరి దరఖాస్తులకున్న ధ్రువీకరణ పత్రాలను తొలగించివేసి అనర్హులుగా గుర్తిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏ కేటగిరి వారి కైతే కేటాయించారు ఆ పోస్టులను వారితో మాత్రమే భర్తీ చేయాల్సి ఉంటుంది అలా కాకుండా అసలు అర్హతలేని వారిని ఎంపికల జాబితాలో అర్హులుగా ప్రకటించడం చూస్తుంటే ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత అధికారులు సైతం కుమ్మక్కైనట్టు అర్థమవుతుంది. ప్రభుత్వం సూచించిన నిబంధనలకు నీళ్లు వదిలి వేరసారాలు చేస్తున్న ప్రజాప్రతినిధులతో ఎంపికలు నిర్వహించే సిబ్బంది అధికారులు చేతులు కలిపి ఉంటారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**అభ్యర్థుల వివరాలు పూర్తిగా బహిర్గతం చేయాలి.**

తాము ఎక్కడైతే దరఖాస్తు చేసుకున్నామో ఆ సెంటర్ పరిధిలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ఎంత మంది తిరస్కరణ గురయ్యారు ఏ నిబంధనల ప్రకారం తిరస్కరించారు ఎంపికైన అభ్యర్థులకు అర్హత ఏంటి మెరిట్ లిస్టును పూర్తిగా బహిర్గతం చేసి వారి తిరస్కరణకు గురైన వారికి గల అనార్హత ఏంటి అనేది ప్రకటించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉన్న కొన్ని సెంటర్లలో స్థానిక ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు దరఖాస్తులను తిరస్కరించారు. విషయమై సంబంధిత అభ్యర్థులు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

## కొత్తకొండ వీరభద్రుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

**భీమదేవరపల్లి ఆగష్టు 16 (నినాదం):** శ్రావణమాసం ప్రత్యేక పూజల్లో భాగంగా కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న సతీష్‌కుమార్‌కు దేవస్థానం అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు. శ్రావణమాసంలో స్వామివారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో ఆలయ పరిసరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి. కిషన్‌రావు తెలిపారు.



## బీరంగూడలో ఘనంగా విగ్రహ ప్రతిష్ట

**ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్!**

**అమీన్పూర్ ఆగష్టు 16:, (నినాదం ):** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ జీహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ డివిజన్, పరిధిలోని ఇస్కబావి శ్రీ పోచమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత మరియు శివలింగ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం గత మూడు రోజులుగా అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఈ పవిత్ర కార్యక్రమం యొక్క ముగింపు వేడుకలకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరియు అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ముఖ్య అతిథులుగా విచ్చేయడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి నిర్వాహక బాధ్యతలు చేపట్టిన 14వ వార్డు మాజీ కౌన్సిలర్ ఏనుగు కవిత శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో, ఆలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. వేడుకల్లో భాగంగా మాజీ కౌన్సిలర్ ఏనుగు కవిత శ్రీనివాస్ రెడ్డి మరియు ఆలయ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని అలాగే అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్ ని శాలువాలతో సత్కరించి, వారి పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, భక్తి కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని, ఇస్కబావి ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరియడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో స్థానిక భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తజనంతో, శివనామస్మరణతో మార్మోగింది.






## భారత పాకిస్థాన్ మధ్య చిచ్చు పెట్టిన
# హద్దుల విభజన

### ఆగస్టు 17... భారత్, పాక్ మధ్య విభజన దినం

రాడ్ క్లిఫ్ రేఖ అంటే చాలా మందికి తెలియక పోవచ్చు. అది భారత, పాకిస్తాన్ మధ్య విభజన రేఖ. సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ నేతృత్వంలోని సరిహద్దుల కమిషన్ ఈ రేఖను నిరారించింది. రాడ్ క్లిఫ్ రేఖ 1947 ఆగస్టు 17న భారత దేశ విభజన అనంతరం భారత పాకిస్తాన్ ల నడుమ సరిహద్దు రేఖగా ఏర్పరచారు. భారత్ లో బ్రిటిష్ రాజ్యం మరో నెల రోజుల్లో, అంటే 1947 ఆగస్టు 15న ముగుస్తుందని భారత స్వాతంత్ర్య చట్టం, 1947 ద్వారా బ్రిటిష్ పార్లమెంటు 1947 జూలై 15న పేర్కొంది. భారత దేశాన్ని రెండు భాగాలుగా విభజించాలని కూడా అది వివరించింది.



పాకిస్తాన్ ముస్లింల రాజ్యంగా కొనసాగాలని, అదే సమయంలో భారత్ హిందూ మెజారిటీతో కూడిన లౌకిక రాజ్యంగా ఉండాలని ఉద్దేశించారు. ఉత్తరాదిన ఉన్న ముస్లిం ప్రాబల్య ప్రాంతాలు పాకిస్తాన్ గా రూపుదిద్దుకోవాలని నిర్ణయించారు. బలూచిస్థాన్ (విభజనకు ముందు 91.8 శాతం ముస్లిం జనాభా), సింధ్ (72.7 శాతం ముస్లిం జనాభా) ప్రావిన్సులను పూర్తిగా పాకిస్తాన్ కు కేటాయించారు. అయితే, ఈశాన్య బెంగాల్ (54.4 శాతం ముస్లింలు), వాయవ్యాన పంజాబ్ (55.7 శాతం) ప్రావిన్సుల్లో పూర్తిగా ముస్లిం మెజారిటీ లేకపోయింది. దాంతో పంజాబ్ పశ్చిమ భాగం పశ్చిమ పంజాబ్ మారింది. తూర్పు ప్రాంతం పంజాబ్ రాష్ట్రం పేరుతో భారత్ లో అంతర్భాగమైంది. బెంగాల్ కూడా అదే మాదిరిగా తూర్పు బెంగాల్ పాకిస్తాన్ లో, పశ్చిమ బెంగాల్లో భారత్ లో విలీనమైంది. ఇక పంజాబ్ లో జనాభా విస్తృతి సంక్లిష్టంగా ఉంది. దాంతో దాన్ని హిందూ, ముస్లిం, సిక్కుల ప్రాంతాలుగా స్పష్టంగా విభజించలేని పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా మహ్మదాలీ జిన్నా నేతృత్వంలోని ముస్లిం లీగ్, జవహర్ లాల్ నెహ్రూ, పటేల్ సారథ్యంలోని భారత జాతీయ కాంగ్రెస్, బ్రిటిష్ వారందరినీ సంతృప్తి పరిచే విభజన ప్రణాళిక కూడా ఏదీ లేకపోయింది. వీలనంత త్వరగా భారత్ ను విడిచి వెళ్లిపోవడమనే బ్రిటిష్ ప్రభుత్వ తక్షణావసరాల కారణంగా ఐక్యరాజ్య సమితి వంటి బయటి సంస్థల నిపుణులకు సరిహద్దు నిర్ణయ ప్రక్రియలో భాగస్వామ్యం లేకపోయింది. భారత వైస్రాయిగా పనిచేసిన లార్డ్ వేవెల్, అంతకు ముందు 1947 ఫిబ్రవరిలో లార్డ్ లూయిస్ మౌంట్బాటెన్ అప్పటికే ఒక సరిహద్దు రేఖను సిద్ధం చేశారు. రెండు దేశాలకు ఏయే ప్రాంతాలను అప్పగించాలో ఇదమిత్థంగా నిర్ధారించేందుకు 1947 జూన్ లో సర్ సిరిల్ రాడ్ క్లిఫ్ ను బెంగాల్, పంజాబ్ సరిహద్దు కమిషన్లు రెండింటికీ చైర్మన్ గా బ్రిటన్ నియమించింది.

పంజాబ్ లో ముస్లిం, ముస్లిమేతర మెజారిటీ ప్రాంతాలను వీలైనంత స్పష్టంగా విడదీస్తూ ఇరు ప్రాంతాల మధ్య సరిహద్దులను నిర్ధారించాల్సిందిగా కమిషన్ కు సూచనలందాయి. 1947 జులై 8న ఢిల్లీలో అడుగు పెట్టిన రాడ్ క్లిఫ్.. ఆగస్టు 12 నాటికి పూర్తి చేశారు. భారత్ గురించి ఏ మాత్రం తెలీకుండా.. చివరకు బెంగాల్.. పంజాబ్ ప్రాంతాలు ఎక్కడ ఉంటాయో కూడా తెలీకుండానే రాడ్ క్లిఫ్ దేశ విభజనను పూర్తి చేయటం విశేషం. భారత్ గురించి ఏ మాత్రం అవగాహన లేని వ్యక్తి, తనకు చెప్పిన పనిని చెప్పినట్లుగా చేయటం, అందుకు తనకున్న అవగాహనతో గీసిన గీతలు, నిర్ణయించిన హద్దులు, కోట్లాది మంది ప్రజల బతుకుల్ని, భవిష్యత్తును నిర్దేశించాయి. భారీ మారణ హోమానికి కారణ మయ్యాయి. జూలై 8న భారత్ వచ్చాక, రాడ్ క్లిఫ్ కు సరిహద్దు నిర్ణయానికి కేవలం 5 వారాలు మాత్రమే ఇచ్చారు. ఆయన వెంటనే తన కాలేజీ సహాధ్యాయి మౌంట్ బాటెన్ ను కలిశాడు. తర్వాత ఇద్దరూ లాహోర్, కలకత్తా వెళ్లి కమిషన్ సభ్యులను కలిశారు. ముఖ్యంగా కాంగ్రెస్ నుంచి నెహ్రూను, ముస్లిం లీగ్ అధ్యక్షుడు జిన్నాను కలుసుకున్నారు. అంత తక్కువ కాలావధి ఇవ్వడాన్ని ఆయన అభ్యంతర పెట్టారు. కానీ ఆగస్టు 15న భారత్ నుంచి బ్రిటిష్ వారు వెళ్లిపోయే లోపే ఈ పని పూర్తవాలని ఇరు వర్గాలూ పట్టుబట్టాయి. దాంతో మరో అవకాశం లేకపోయింది. ఈ తక్కువ డెడ్ లైన్ షరతు మీదే మౌంట్బాటెన్ భారత వైస్రాయి పదవిని అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని బ్రిటిష్ వారు వెళ్లిపోవడానికి కేవలం 2 రోజుల ముందే తీసుకున్నారు. కానీ రాజకీయ కారణాల వల్ల ఆగస్టు 17 దాకా, అంటే భారత్, పాకిస్తానకు స్వాతంత్ర్యం ఇచ్చిన రెండు రోజుల దాకా దాన్ని బయట పెట్టలేదు. రాడ్ క్లిఫ్ తన నియామకానికి ముందు భారత్ ను ఒక్కసారి కూడా సందర్శించ లేదు. ఆయన వ్యక్తిగత కార్యదర్శి క్రిస్టోఫర్ బీమంటకు మాత్రమే పంజాబ్ జీవన విధానం, అక్కడి యంత్రాంగాన్ని గురించిన అవగాహన ఉంది.. తన వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉందని నిరూపించు కోవడానికి గాను కనీసం వైస్రాయ్ మైంట్బాటెన్ కూడా కలవకుండా రాడ్ క్లిఫ్ పూర్తి దూరం పాటించారు. రాడ్ క్లిఫ్ కు కేవలం నెల రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో అనుకూలంగా గ్రామాలను విభజించడానికి జాగ్రత్తలు తీసుకునే సావకాశం చిక్కలేదు. ఆయన నిర్ధారించిన సరిహద్దు అస్తవ్యస్తమైంది. కొన్ని ప్రాంతాల మధ్య నుండి కాక నేరుగా వాటి మీదుగా వెళ్లింది. విభజన రేఖ ఒకే ఇంట్లో కొన్ని గదుల్ని భారత్ కు, మరికొన్ని గదుల్ని పాకిస్తాన్ కు కూడా కేటాయిస్తూ సాగిన ఉదంతాలు కోకొల్లలుగా ఉండడం గమనార్హం. రాడ్ క్లిఫ్ తాను భారత్ నుంచి వెళ్లే ముందు ఈ ప్రక్రియకు సంబంధించిన అన్ని పత్రాలనూ నాశనం చేశాడు. ఆయన స్వాతంత్ర్య దినం రోజునే భారత్ విడిచి వెళ్లిపోయాడు. తాను నిర్ణయించిన సరిహద్దులను సాధికారికంగా ప్రకటించడానికి కూడా ముందే దేశాన్ని వదిలాడు. అన్ని రికార్డులనూ రాడ్ క్లిఫ్ నాశనం చేయగా, మౌంట్బాటెన్ కూడా ఈ విషయాలు తనకేమీ తెలియదని చెప్పారు.

**విభజన అనంతరం. సరిహద్దు రేఖల నిర్ణయాన్ని అమలు చేసుకోవాల్సిన బాధ్యత భారత, పాకిస్తాన్ ప్రభుత్వాలపై పడింది. 1947 ఆగస్టు 15న తాము సరిహద్దులకు ఏ వైపుకు చెందామన్నది అక్కడి గిరిజనుల్లో చాలామందికి తెలియక పోవడాన్ని బట్టి ఎంత అవగాహన రాహిత్యంతో విభజించారో అర్థం చేసుకోవచ్చు. చివరికి విభజన అమలు సందర్భంగా... ఉపఖండంలో దాదాపు 1.4 కోట్ల మంది ప్రజలు సొంత ఇళ్లను వదులుకున్నారు.**

బస్సులు, రైళ్లు, విమానాలు, కార్లు, లారీలు, ఎడ్లబళ్లు, ఇంకా అత్యధికులు కాలి నడకన తమ సొంత వారితో కలిసి ఆవాసాన్ని వెదుక్కునేందుకు బయల్దేరారు. వారిలో చాలామంది అవతలి పక్షం వారి చేతుల్లో హత్యకు గురయ్యారు. మరికొందరు ఆకలికి తాళలేక ప్రాణాలు విడిచారు. ఇంకా కొంతమంది ప్రాణాంతక వ్యాధులకు బలయ్యారు. ఈ మొత్తం ప్రక్రియలో మరణించిన వారి సంఖ్య కనీసం 2 లక్షల (ఇది ఆ సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం పేర్కొన్న గణాంకాలు) నుంచి 20 లక్షల దాకా ఉంటుందని అంచనా వేశారు. అంతిమంగా ఈ సరిహద్దు వివాదాలే భారత్, పాకిస్తాన్ మధ్య 1947, 1965, 1971ల్లో యుద్ధాలకు కూడా దారితీశాయి. 1998 మేలో కూడా ఇరు దేశాలూ అణ్వాయుధ పరీక్షలు జరిపేందుకు, 1999లో కార్గిల్ యుద్ధానికి కూడా అవే కారణమయ్యాయి. నాటి తొందరపాటు చర్యలతో అస్తవ్యస్త విభ జన ఫలితంగా నేటికీ భారత పాకిస్థాన్ దేశాల మధ్య వివాదాలు కొన సాగుతూ, పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే స్థితి నెలకొని ఉంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...
9440595494

# బహుజన చైతన్యపు జ్వాల సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్

**కాలచక్రంలో 17వ శతాబ్దపు చివరి కాలంలోకి ఒకసారి తిరిగి ఆలోచన చేస్తే దట్టమైన అడవులు, ప్రాణాలకు తెగించి, పోరాడే యోధులు. గాలిలో పక్షుల కిలకిలా రావలు లేవు కేవలం యుద్ధనగారాల మోతలు మాత్రమే వినిపిస్తున్న కాలం. ఢిల్లీ పీఠంపై ఔరంగాజేబు క్రూరమైన పాలన సాగుతున్న రోజులవి. సామాన్యుడి కన్నీళ్ళకు విలువ లేని సమయం అది సరిగ్గా అప్పుడే తెలంగాణ గడ్డపై ఒక సామాన్య గౌడ బిడ్డ ఆ మొఘల్ సామ్రాజ్యపు పునాదులను కదిలించాడు. ఆయనే తెలంగాణ గడ్డ గర్వించదగ్గ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.350 ఏళ్ల క్రితమే పాపన్న బహుజన జాతులను ఏకం చేసి తెలంగాణలో రాజ్యాధికారాన్ని హస్త గతం చేసుకొని అగ్రవర్ణ జమీందారుల, గడిల దొరలను గడగడ లాడించి 21 కోటలు అక్రమించాడు.**



ఖీల షాపూర్ నుండి మొదలు పెట్టి తాటికొండ, వేములకొండ భువనగిరి, కొలనుపాక, జాఫర్గడ్ చేర్యాల్ ,ఖైరన్ పల్లి సర్వాయిపేట, వరంగల్, హుస్నాబాద్ హుజురాబాద్ కరీంనగర్ జనగామ నల్గొండ ప్రాంతాలలో తన రాజ్యాన్ని విస్తరించి పరిపాల సాగించిన గొప్ప బహుజన చక్రవర్తి.1650 ఆగస్టు 18 న ధర్మన్న సర్వాయమ్మ పుణ్య దంపతులకు జన్మించాడు.యుక్త వయస్సుకు రాగానే గౌడ కులంలో పుట్టిన పాపన్న తన కులవృతి ఐన తాళ్లు ఎక్కుతు కల్లు అమ్ముతు కల్లు మండవలో తన స్నేహితులైన చాకలి సర్వన్న మంగలి, మాసన్న కుమ్మరి, గోవిందు, దూదేకుల మీర్ సాహెబ్ కొత్వాల్ కు కల్లు పోస్తు అందరితో కలివిడిగా ఉండేవాడు.గోల్కొండ నవాబు తురుష్క సైనికులు గ్రామలల్లో శిస్తు వసూలు చేసుకొని గుర్రాలపైఅటుగా వెళుతు పాపన్నను కల్లు పోయమని అడుగగా తురుష్క సైనికులకు తాటి చెట్టు ఎక్కి కల్లు పోస్తాడు.కల్లు తాగిన సైనికులు డబ్బులు ఇవ్వకుండా పోతుంటే పాపన్న స్నేహితులు కల్లు తాగిన పైకం కట్టాలని అడుగుతే తురుష్క సైనికులు మేము రాజుగారి సైనికులం మమ్మలనే అడుగుతారా అని పాపన్న స్నేహితులపై చేయి చేస్తుకుంటారు.అది సహించలేని పాపన్న కోపంతో ఉగ్ర రూపుదై వారితో యుద్ధం చేసి కల్లు గీసే కత్తితో కొందరిని చంపుతాడు.కొందరు చావు భయంతో పారిపోయి గోల్కొండ నవాబుతోజరిగిన సంఘటన చెబుతారు.అలా పాపన్న రాజ్యధికారం వైపు అడుగులు పడుతాయి.అప్పుడే తన మనసులో మెదిలిన మాట తాల్లేక్కుతే ఏమోస్తది కల్లు అమ్ముతే ఏమోస్తది కొడితే గోల్కొండను కొట్టాలే రాజుగా రాజ్య పరిపాలన చేయాలే నా బహుజన జాతులకు న్యాయం చేయాలే అనే ఆలోచనతో వివిధ కులాలకు సంబంధించిన తన స్నేహితులు 12 మందితో సైన్యాన్ని తయారు చేసుకొని వారికి యుద్ధ విద్యలు నేర్పి వారిని కూడా నాయకులుగా తయారు చేసి తన తల్లి దగ్గరున్న బంగారు నగలు అమ్మి ఆయుదాలు సమకూర్చుకొని ఇప్పుడున్న కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయి పేట దగ్గర నాలుగు వేల ఎకరాల కొమ్ముగుట్టను స్థావరంగా చేసుకొని మూడు వేల మంది సైన్యాన్ని తయారు చేసి వారందరికీ గెరిల్లా శిక్షణ ఇచ్చి యుద్ధ వీరులుగా తయారు చేశాడు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక వ్యక్తి కాదు కొన్ని శతాబ్దాల అణిచివేత పై పుట్టిన ఒక విప్లవం. రాజ్యం అంటే భూభాగం కాదు అట్టడుగు వర్గాల ఆత్మగౌరవం అనే విభిన్న ఆలోచన శైలి పాపన్న వ్యక్తిత్వానికి నిదర్శనం.అది తట్టుకోలేని జమీందారులు, గడిల దొరలు పాపన్న ను బందిపోటు దొంగగా చిత్రీకరించారు. పాపన్న కేవలం కత్తి పట్టి యుద్ధం చేసే వీరుడు మాత్రమే కాదు శత్రువు ఎత్తుగడలను పసిగట్టే గొప్ప ఆలోచనపరుడు.పాపన్న తన సైన్యాన్ని క్రమక్రమంగా పన్నెండు వేలకు పెంచి గడీలు అక్రమించికుంటు 21 కోట గడీలు ఆక్రమించుకొని 20 సంవత్సరాలు పరిపాలించి ఏకంగా గోల్కొండ పై దండయాత్ర చేసి 7 నెలలు పరిపాలించాడు. 1707లో ఔరంగాజేబ్ మరణించిన తర్వాత గోల్కొండలో సింహాసనాన్ని సర్వాయి పాపన్న గౌడ్ అధిష్టించాడు. కొత్త రాజు అయిన తర్వాత దక్కన్ పాలకుడు కంబక్ష్ ఖాన్ బలహీన పాలనను చూసిన పాపన్న 1708 ఏప్రిల్ ఒకటిలో వరంగల్ కోటపై దాడి చేశాడు. అయితే ఈ దాడిలో పాపన్న గౌడ్ పట్టుబడ్డాడు. శత్రువుల చేతిలో చావడం ఇష్టం లేని పాపన్న గౌడ్ తన బాకుతో గుండెల్లో పొడుచుకుని చనిపోయాడు. ఆ తర్వాత పాపన్న గౌడ్ తలని గోల్కొండ ముఖద్వారానికి వేలాడదీశారు.ఇంతటి గొప్ప వీర యోధుడి చరిత్రను ఈ ప్రాంతపు అగ్రవర్ణాలు, వారి అధిపత్య తొత్తులు పాతరేసి కనుమరుగు చేశారు. కానీ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లండన్ లో ఉన్న కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ పాపన్న మహారాజ్ చరిత్ర పై అధ్యయనం చేయించి పుస్తకాలను ముద్రించింది. పాపన్న గౌడ్ ముఖచిత్రంతో కేంబ్రిడ్జి యూనివర్సిటీ ది న్యూ కేంబ్రిడ్జ్ హిస్టరీ ఆఫ్ ఇండియా, ది సోషల్ హిస్టరీ ఆఫ్ ది డెక్కన్ అని రెండు పుస్తకాలను ముద్రించింది.బ్రిటిష్ ప్రభుత్వం లండన్ లోని విక్టోరియా అండ్ ఆల్బర్ట్ మ్యూజియంలో పాపన్న గౌడ్ మహారాజ్ శాశ్వత శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణం.అణగారిన కులంలో పుట్టిన పాపన్న చరిత్రను బ్రాహ్మణ వాదులు, అగ్రవర్ణాలు ఎక్కడ కూడా రాయటానికి ఇష్ట పడలేదు.సంచార జాతి శారదా గాళ్ల ,బుర్ర కథలతో కొంత బ్రతికి బట్టకట్టింది. ఆధునిక కాలంలో మనం చెప్పుకునే గెరిల్ల యుద్ధం నుండి గూఢచారి వ్యవస్థ దాకా ఆ రోజుల్లోనే పాపన్న ఒక సైనిక విజ్ఞాన శాస్త్రంగా పోరాటాలు చేశారు. కత్తికి పదును ఉంటే చాలదు ఆలోచనలు కూడా పదునైనప్పుడే సామ్రాజ్యాలను గడగడలాడించగలమని పాపన్న భావించేవాడు. యుద్ధం అంటే కేవలం కొన్ని వర్గాల మనుషులు కత్తులు దూసుకోవడమే కాదు. యుద్ధం అంటే రెండు సిద్ధాంతాల మధ్య పోరాటం ఒకవైపు అంతులేని అధికారం కలిగిన సామ్రాజ్యం మరోవైపు ఆత్మగౌరవం కోసం ప్రాణాలను అర్పించే సామాన్య గౌడ బిడ్డ ధైర్యమే సర్వాయి పాపన్న గౌడ్ జీవితం. కూలిపోతున్న పాపన్న గౌడ్ కోటలు సంరక్షించి భావి తరాలకు అందించాలి.చదువు, విజ్ఞానం, సాంకేతిక లేని ఆ రోజుల్లోనే ఒక సామాన్య గౌడ కుటుంబంలో పుట్టిన పాపన్న ఒక గొప్ప ఆలోచనతో బహుజన జాతుల మరియు బలహీన వర్గాల ప్రజాల సంక్షేమం కోసం రాజ్యాధికార బావుటా ఎగరవేసాడు. మరీ ప్రస్తుతం కాలంలో అన్ని మనకు అందుబాటులో ఉన్నాయి. విజ్ఞానం, చదువు, సాంకేతిక అనే అంశాల మధ్య మన జీవనం ఉంది అయినా బహుజన కులాల వెనుకబాటు తనానికి కారణాలు ఏంటి ? వాటిని అన్వేషించుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది. అమాయకంగా ఉన్నంత కాలం అణగదొక్కిరాజ్యమేలడానికి ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండే మనుషులు సమాజంలో ఉండటం సర్వసాధారణం. కావున పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తిగా తీసుకుని వినూత్న పంథాతో గౌడ కులస్తులు రాజకీయ, సామాజిక,ఆర్థిక అంశాలలో విలక్షణమైన కార్యాచరణతో సమిష్టి నాయకత్వం తో అందరూ సంఘటితంగా మారి ఒక శక్తిగా, అందరిని ఆదరించే యుక్తి గా ఎదగడమే పాపన్న గౌడ్ కు అందించే ఘన నివాళి.

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376లో జయంతి సందర్భంగా...





బండి.వంశీకృష్ణ గౌడ్
రాష్ట యూత్ ఉపాధ్యక్షుడు
సర్వాయిపాపన్న మోకుదెబ్బ(గౌడ సంఘం)
తెలంగాణ రాష్ట్రం
8688063096

# నిన్నటి తరం పాత్ర లేకుండా నేటి తరం ప్రగతి అసాధ్యం

## (17 ఆగష్టు "బేబీ బూమర్స్ గుర్తింపు దినోత్సవం" శుభ సందర్భంగా)

2వ ప్రపంచ యుద్ధం అనంతరం 1946 నుండి 1964 మధ్య జన్మించిన నేటి 62 నుంచి 80 ఏండ్ల వయస్సు కలిగిన తరాన్ని "బేబీ బూమర్స్ జనరేషన్" అని పిలుస్తున్నాం. ప్రపంచ యుద్ధం మిగిల్చిన మారణ హోమం, ఆస్తుల విధ్వంసం, కుటుంబ విచ్ఛిన్నం, కుటుంబ సభ్యులను కోల్పోయిన నాటి తరం ఆ గాయాలను మరిచిపోతూ ఆధునిక ప్రపంచం వైపు బహుముఖీన ప్రగతిని నమోదు చేసుకుంటూ నేటి డిజిటల్ తరానికి పునాదిగా నిలిచింది బేబీ బూమర్స్ తరం. బేబీ బూమర్స్ తరం ప్రజల సేవలను, నేటి సమాజంపై వారి ముద్రను గుర్తిస్తూ, వారి గౌరవార్థం ప్రతి ఏటా 17 ఆగష్టు రోజున "బేబీ బూమర్స్ గుర్తింపు దినోత్సవం" లేదా "బేబీ బూమర్స్ రికగ్నిషన్ డే" పాటించడం 2011 నుంచి ఆనవాయితీగా మారింది. 1969లో జరిగిన ప్రసిద్ధ "వుడ్‌స్టాక్" మ్యూజిక్ ఫెస్టివల్ ప్రారంభమైన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవాన్ని నిర్వహించడం కొనసాగుతున్నది. దశాబ్దాలుగా సంస్కృతి వారసత్వాలు, వృత్తిపరమైన విలక్షణతలు, రాజకీయ సామాజిక పురోగతి, పౌర సమాజాన్ని ప్రభావితం చేసిన తీరును బేబీ బూమర్స్ గుర్తింపు దినోత్సవ వేదికలు ఏకరువు పెట్టడం జరుగుతున్నది.



**బేబీ బూమర్స్ తరం ప్రత్యేకతలు:**

మానవ సంస్కృతి, ఆర్థిక పురోగతి, సమాజ సమగ్రాభివృద్ధికి బేబీ బూమర్స్ తరం చేసిన గణనీయమైన కృషిని నేడు నెమరు వేసుకుంటూ, వారు నడిచిన సన్మార్గంలో నడుస్తూ, వారి విజయాలను గుర్తిస్తూ, వారి ప్రగతి కథలను వింటూ, వారి త్యాగాలను స్మరించుకుంటూ ఆధునిక సమాజాన్ని తీర్చిదిద్దిన వారి సృజనశీల విలువల కృషి మెచ్చుకుంటూ, వారు చూపిన పట్టుదలకు వందనాలు చేస్తూ, ఆ తరానికి మనసు నిండా కృతజ్ఞతలు తెలియజేసుకునే శుభ వేదికగా ఈ దినోత్సవం ఉపకరిస్తున్నది. దాదాపు రెండు దశాబ్దాలు విస్తరించిన (1946 – 1964) బేబీ బూమర్స్ తరం అపారమైన వైవిధ్యభరితమైన అనుభవాలను కలిగి ఉండడం విశేషంగా చెప్పుకోవాలి. 1960ల్లో జరిగిన పౌర హక్కుల ఉద్యమాలతో పాటు యుద్ధ వ్యతిరేక నిరసనల నుంచి 1990ల్లో కంప్యూటర్ విప్లవం, 2000ల్లో పడిన డిజిటల్ విప్లవ బీజాల వరకు, ఆధునిక చరిత్రలోకి అత్యంత పరివర్తనాత్మక కాలాల్లో బేబీ బూమర్స్ పాల్గొనడం, చురుకుగా జీవించడం చూసాం.

**మానవ తరాలను 9 వర్గాలుగా వర్గీకరణ :**

మానవ పరిణామ క్రమంలో నాటి లాస్ట్ జనరేషన్ నుంచి నేటి/రేపటి బీటా జనరేషన్ వరకు తొమ్మిది తరాలుగా, వివిధ కాలాలు, పని తీరులు, వ్యవహారశైలిలను గమనించి వర్గీకరించారు. మొదటి ప్రపంచ యుద్ధ సమాయంలో 1883 – 1900 మధ్య జన్మించిన తరాన్ని "లాస్ట్ జనరేషన్"గా పేర్కొన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో 1901 – 1927 మధ్య జన్మించిన తరాన్ని "గ్రేటెస్ట్ జనరేషన్" అని పిలుస్తున్నాం. అలాగే 1928 – 1945 మధ్య జన్మించిన తరాన్ని "సైలెంట్ జనరేషన్" అంటున్నాం. 1946 – 1964 మధ్య జన్మించిన తరాన్ని "బేబీ బూమర్స్ జనరేషన్" అని పిలుస్తాం. 1965 – 1980 మధ్య జన్మించిన "జనరేషన్ ఎక్స్", 1981 – 1996 మధ్య జన్మించిన "జనరేషన్ వై" లేదా "మిలినియల్స్", 1997 – 2012 మధ్య జన్మించిన తరాన్ని "జనరేషన్ జెడ్" లేదా "జెన్ జెడ్" అని పిలుస్తున్నాం. 2013 – 2024 మధ్య జన్మించిన "జనరేషన్ ఆల్ఫా", 2024 తర్వాత జన్మించిన "జనరేషన్ బీటా" నేడు లేత వయస్సు ఉన్న చిన్నారులుగా పేర్కొంటున్నాం.

**బేబీ బూమర్స్ తరం వృద్ధులకు ఊతకర్రలుగా నిలుద్దాం :**

2వ ప్రపంచ యుద్ధంలో పాల్గొని బయట పడిన పౌరులు, సైనికులు వెంటనే తేరుకొని కుటుంబాలుగా స్థిరపడి, వేగంగా ఆర్థిక ప్రగతిని నమోదు చేసి, జననాల రేటును పెంచిన నాటకీయ తరంగా బేబీ బూమర్స్ తరం నిలుస్తున్నదని గుర్తించాలి. బేబీ బూమర్స్ తరంలో బలమైన పని నీతి, విలువల కట్టుబాట్లు, మార్పును స్వీకరించడం, వినియోగ సంస్కృతిని అలవర్చుకోవడం, కళలపై గణనీయమైన ప్రభావాలను చూపడంతో నేటి డిజిటల్–ఏఐ యుగానికి నాడే పునాదులు పడ్డాయని తెలుసుకోవాలి. గత ఆరు దశాబ్దాల్లో నమోదైన ప్రతి ప్రగతి చరిత్రలో బేబీ బూమర్స్ పాత్ర విలక్షణమైనది. నేడు వయస్సు పెరిగిన వృద్ధాప్యంలో ఉన్న బేబీ బూమర్ తరాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవడం ప్రతి పౌరుడి కనీస కర్తవ్యం అని నమ్మాలి. వారి నుంచి మంచి పాఠాలను నేర్చుకుంటూ, వారి ప్రాముఖ్యతను గుర్తిస్తూ, వారికి అన్ని విధాలుగా ఊతకర్ర వలె నిలుస్తూ మన పునాదులను సముచితంగా గౌరవిద్దాం.


బేబీ బూమర్స్ తరం వృద్ధులతో ప్రేమగా మసలుకుంటూ, అనుబంధాలను పెంచుకుంటూ, వారి సంస్కృతిని నెమరు వేసుకుంటూ, జ్ఞాపకాలను పంచుకుంటా, వృద్ధులను మద్దతునిస్తూ, వివిధ తరాల ఆచార వ్యవహారాల పట్ల అవగాహన పెంచుకుంటూ రేపటి తరానికి నేటి తరం కృతజ్ఞతగా ఉంటూ, గట్టి పునాదులు వేస్తూ ముందుకు సాగుదాం.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# లాభం కాదు లక్ష్యం, సేవే ధ్యేయం: జాతీయ లాభాపేక్షలేని దినోత్సవం

## సమాజ హితం కోసం స్వచ్ఛంద కృషి: జాతీయ లాభాపేక్షలేని దినోత్సవ సందేశం
## ఆగస్టు 17....జాతీయ లాభాపేక్షలేని దినోత్సవం

2026 ఆగస్టు 17న ప్రపంచ వ్యాప్తంగా జాతీయ లాభాపేక్షలేని దినోత్సవం ఘనంగా జరుపుకోబడుతుంది. ఈ రోజు సమాజ నిర్మాణంలో, మానవ సంబంధాల పరిరక్షణలో, మానవతా విలువల నిలుపుదలలో, అట్టడుగు వర్గాల అభ్యున్నతిలో లాభాపేక్షలేని సంస్థలు పోషిస్తున్న విశిష్టమైన పాత్రను గుర్తించి గౌరవించుకునే సందర్భం. ఆర్థిక లాభాన్ని కాకుండా మానవ సేవనే ప్రధాన లక్ష్యంగా ఎంచుకొని, నిరంతరం కృషి చేస్తున్న ఈ సంస్థల పట్ల కృతజ్ఞతను వ్యక్తం చేయడం, వాటి ప్రాముఖ్యతను సామాజిక చైతన్యంలో నిలుపుకోవడం ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం. లాభాపేక్షలేని దినోత్సవానికి పునాది 1894 ఆగస్టు 17న అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన 'టారిఫ్ చట్టం'లో ఉంది. ఆ చట్టం ద్వారా విద్య, ఆరోగ్యం, మత, దాతృత్వ, విజ్ఞాన, సాంస్కృతిక, సామాజిక రంగాల్లో పనిచేసే సంస్థలకు ఫెడరల్ ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు కల్పించబడింది. ఈ నిబంధన వల్ల వేల సంఖ్యలోనే కాక లక్షల సంఖ్యలో లాభాపేక్షలేని సంస్థలు ఆర్థిక భారాల నుండి విముక్తి పొంది తమ సేవా కార్యక్రమాలను విస్తృత స్థాయిలో కొనసాగించగలిగాయి. ఈ చట్టం చారిత్రక ప్రాధాన్యతను, దాని ఫలితంగా అభివృద్ధి చెందిన సేవా రంగాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని గుర్తించి ప్రసిద్ధ రచయిత, సామాజిక




ఉద్యమకారిణి షెరిటా జె. హెర్రింగ్ 'నేషనల్ నాన్ ప్రాఫిట్ డే'ను స్థాపించారు. ఈ సందర్భంగా ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు, దాతృత్వ ట్రస్టులు, సేవాసంస్థలు, సహాయ సమితులు తమ సేవా ప్రయాణాన్ని, విజయాలను, భవిష్యత్ లక్ష్యాలను ప్రజలకు పరిచయం చేసుకుంటాయి. విద్య, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, పేదరిక నిర్మూలన, మహిళా శక్తీకరణ, గ్రామీణాభివృద్ధి, మానవ హక్కుల రక్షణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలు వంటి విభిన్న రంగాల్లో ఇవి సమాజానికి ప్రాణాధారాలుగా నిలుస్తాయి. అమెరికాలో మాత్రమే లాభాపేక్షలేని రంగం స్థూల దేశీయోత్పత్తిలో 5.4 శాతం వాటా కలిగి ఉంది. 2012లో ఈ రంగం \$887.3 బిలియన్ ఆర్థిక విలువను సృష్టించింది. 12 మిలియన్లకు పైగా ఉద్యోగాలను కల్పిస్తూ ఉత్పత్తి రంగం, రిటైల్ రంగాల తరువాత మూడవ అతిపెద్ద ఉద్యోగ దాతగా నిలిచింది. ఈ గణాంకాలు లాభాపేక్షలేని రంగం ఆర్థికాభివృద్ధి, సామాజిక స్థిరత్వం, మానవ వనరుల శ్రేయస్సులో కీలక స్తంభమని నిరూపిస్తున్నాయి. ఈ దినోత్సవం కేవలం గణాంకాల గర్వోత్సవం మాత్రమే కాకుండా, మానవత్వానికి అంకితమైనవారి నిరంతర కృషిని స్మరించుకునే ఆత్మీయ సందర్భం. ఆకలితో అలమటించే వారికి ఆహారం అందించే ఫుడ్ బ్యాంకులు, అనాథలకు ఆశ్రయం కల్పించే ఆశ్రమాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి సహాయక చర్యలు చేపట్టే సేవకులు—వీరి సమర్పణకు ఈ రోజు వందనం చేస్తుంది. ప్రస్తుత ప్రపంచం ఆర్థిక అసమానతలు, సామాజిక విభేదాలు, పర్యావరణ సంక్షోభం, ఆరోగ్య సవాళ్లతో పోరాడుతున్న తరుణంలో లాభాపేక్షలేని సంస్థలు వెలుగుదారి చూపుతున్నాయి. ప్రభుత్వ పరిధి దాటిన అనేక సమస్యలకు సృజనాత్మక పరిష్కారాలను అందిస్తూ, సమాజంలో ఆశను నింపుతున్నాయి. ఈ రోజు సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయాన్ని అందించడం సమాజ ధర్మం. దాతృత్వ దానం చేయడం, స్వచ్ఛంద సేవలో పాల్గొనడం, స్థానిక సేవాసంస్థలకు అవసరమైన వనరులను సమకూర్చడం, తమ పరిసరాల్లో అవసరమున్నవారికి చేయూతనివ్వడం—ఇవన్నీ ఈ దినోత్సవాన్ని అర్థవంతంగా మార్చే మార్గాలు. సోషల్ మీడియా వేదికల ద్వారా National Nonprofit Day వంటి హ్యాష్ ట్యాగ్‌లతో అవగాహన పెంపొందించడం, సేవా సంస్థల గురించి సమాచారాన్ని పంచుకోవడం, వాటి అవసరాల కోసం మద్దతు సమకూర్చడం కూడా సమాజ సేవలో భాగమే. కాబట్టి ఈ దినోత్సవం అమెరికా లేదా పాశ్చాత్య దేశాలకు మాత్రమే పరిమితమైనది కాదు; ఇది మానవ సమాజం మొత్తానికి స్ఫూర్తిదాయకమైన మానవీయ విలువల ఉత్సవం. 'సేవే పరమధర్మం' అనే తత్వాన్ని ప్రతి ఒక్కరి హృదయంలో మరింత గాఢం చేయడానికి, లాభం కోసం కాకుండా మానవ సౌభ్రాతృత్వం కోసం అంకితమైన ప్రతి చెయ్యి, ప్రతి హృదయం గౌరవించబడాలనే సందేశాన్ని పంచటానికి ఈ రోజు ప్రత్యేకంగా నిలుస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్
కాలమిస్ట్...
9440595494

## అలియా భట్
# గ్లోయింగ్ స్కిన్ కేర్ సీక్రెట్



అలియా భట్ అందంలో ప్రత్యేకంగా ఆకట్టుకునేది ఆమె చర్మంపై కనిపించే సహజమైన కాంతి. సినిమాల్లో విభిన్నమైన లుక్స్‌లో కనిపించినా, సాధారణ సందర్భాల్లో మాత్రం మినిమల్ మేకప్‌తో ఫ్రెష్‌గా కనిపించడానికే ఆమె ఎక్కువగా ఇష్టపడుతుంది. రోజంతా షూటింగ్‌లు, మేకప్, ప్రయాణాలు ఉన్నా చర్మాన్ని నిర్లక్ష్యం చేయకుండా తనకు సరిపోయే స్కిన్‌కేర్ రొటీన్‌ను పాటిస్తానని అలియా గతంలో పంచుకుంది. బిజీ లైఫ్‌లోనూ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి అలియా పాటించే ఈ సింపుల్ బ్యూటీ రొటీన్ ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం..

సినిమాల్లో అలియా భట్ లుక్ ఎంత నేచురల్‌గా, ఫ్రెష్‌గా కనిపిస్తుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మేకప్ ఉన్నా, లేకపోయినా ఆమె ఫ్రెష్ గ్లోయింగ్ స్కిన్ అభిమానులను ఆకట్టుకుంటుంది. అయితే ఆ గ్లో వెనుక ఖరీదైన ట్రీట్‌మెంట్లు మాత్రమే కారణం అని అనుకుంటున్నారేమో. అయితే ఆ లుక్ కోసం కేవలం మేకప్‌పై ఆధారపడకుండా, రోజువారీ స్కిన్‌కేర్‌కు అలియా చాలా ప్రాధాన్యం ఇస్తుంది. అలియా తన స్కిన్‌కేర్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటూ, రోజువారీ రొటీన్‌లో తనకు నచ్చిన కొన్ని ప్రాథమిక ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇస్తుంది.

తన యూట్యూబ్ వీడియోలో ఆమె స్వయంగా తన స్కిన్‌కేర్ రొటీన్‌ను షేర్ చేసుకుంది. బిజీ షెడ్యూల్, తక్కువ నిద్ర వంటి కారణాలతో చర్మంపై ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, దాన్ని క్రమంగా సంరక్షించుకోవడానికి ఆమె కొన్ని స్టెప్పులను పాటిస్తుంది. మరి అలియా భట్ తన వానిటీలో తప్పనిసరిగా ఉంచుకునే ఈ బ్యూటీ ఎసెన్షియల్స్ ఏవి? ఆమె స్కిన్‌కేర్ రొటీన్ ఎలా ఉంటుందో తెలుసుకుందాం..

**జేడ్ రోలర్‌తో ఫేస్ మసాజ్**

అలియా తన స్కిన్‌కేర్ రొటీన్‌ను జేడ్ రోలర్, స్కిన్ మసాజర్‌తో స్టార్ట్ చేస్తుంది. చెంపలు, దవడ ప్రాంతంలో జేడ్ రోలర్‌తో సన్నితంగా మసాజ్ చేస్తుంది. ఫేస్ మసాజ్ చేయడం వల్ల చర్మానికి ఫ్రెష్ లుక్ వస్తుంది. జేడ్ రోలర్ చర్మాన్ని టైట్‌గా చేస్తుంది, వృద్ధాప్య ఛాయలు త్వరగా రాకుండా చూసుకుంటుందని జీజణ అధ్యయనం పేర్కొంది. జేడ్ రోలర్‌ను ఉపయోగించేటప్పుడు ముఖంపై ఎక్కువ ఒత్తిడి పెట్టకుండా సున్నితంగా మసాజ్ చేయాలి.

**కళ్ల చుట్టూ ఐ క్రీమ్**

తన బిజీ షూటింగ్ షెడ్యూల్ కారణంగా నిద్ర తక్కువగా ఉండే సందర్భాల్లో కళ్ల కింద డార్క్ సర్కిల్స్ కనిపిస్తాయని అలియా చెప్పింది. అందుకే ఆమె ఐ క్రీమ్‌ను రొటీన్‌లో చేర్చుకుంది. కళ్ల చుట్టూ చర్మం చాలా సున్నితంగా ఉంటుంది కాబట్టి ఏ ఉత్పత్తినైనా మెల్లగా అప్లయ్ చేయడం మంచిది. అలాగే

**నియాసినామైడ్ సీరమ్**

అలియా రొటీన్‌లో మరో ముఖ్యమైన ప్రొడక్ట్ నియాసినామైడ్ ఉన్న సీరమ్. నియాసినామైడ్‌ను సాధారణంగా చర్మ బ్యారియర్‌ను మెరుగుపరచడం, చర్మాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. అయితే ప్రతి ఒక్కరి చర్మానికి ఒకే ఉత్పత్తి సరిపోదు.

**మాయిశ్చరైజర్ మర్చిపోదు**

స్కిన్‌కేర్‌లో మాయిశ్చరైజింగ్ చాలా ముఖ్యమైన స్టేజ్ అని అలియా చెబుతుంది. షూటింగ్ సమయంలో ఎక్కువసేపు మేకప్‌లో ఉండాల్సి రావడంతో చర్మం పొడిబారకుండా ఉండేందుకు ఆమె మాయిశ్చరైజర్‌ను కచ్చితంగా అప్లై చేస్తుంది. ముఖంతో పాటు మెడ, చేతులకు కూడా మాయిశ్చరైజర్ రాసుకుంటుంది. అలియా రొటీన్‌లో ముఖ్యమైన స్టేజ్ సన్‌స్క్రీన్. ఆమె 50 ఉన్న సన్‌స్క్రీన్‌ను ఉపయోగిస్తుంది. ముఖం, మెడకు సన్‌స్క్రీన్ అప్లై చేసి ఆ తర్వాత మేకప్ చేసుకుంటుంది. సూర్యుడి ఖఎ కిరణాల నుంచి చర్మాన్ని రక్షించుకోవడానికి సన్‌స్క్రీన్‌ను ఉపయోగించడం ముఖ్యం. అలియా భట్ స్కిన్‌కేర్ రొటీన్ చూస్తే ఎక్కువ ఉత్పత్తులు వాడటం కంటే, క్లెన్సింగ్, హైడ్రేషన్, మాయిశ్చరైజింగ్, సన్ ప్రొటెక్షన్ వంటి ప్రాథమిక దశలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే సెలబ్రిటీ ఉపయోగించే ఉత్పత్తులు అందరికీ సరిపోవాల్సిన అవసరం లేదు.

# ఫోన్‌తో హెల్త్ సమస్యలు రాకుండా ఉండాలంటే...



**ఈ రోజుల్లో ఫోన్ ఎక్కువగా వాడటం జీవితంలో ఒక అలవాటు అయిపోయింది. దీంతో లేని పోని సమస్యలు తెచ్చుకుంటున్నారు. ముఖ్యం గా మెడ, నడుముకి సంబంధించిన సమస్యలు ఎక్కువైపోయాయి. నటి షకీలా ఇటీవల ఫోన్ ఎక్కువగా వాడటం వల్ల దాదాపు 3 లక్షల ఖర్చుతో మెడ సర్జరీ చేయించుకున్నానని తెలిపారు. కేవలం ఫోన్ వాడటం వల్లే సర్జరీ దాకా వెళ్లకపోయినా, ఇప్పటికే మెడ సంబంధిత సమస్యలు ఉన్నవారికి చెడు భంగిమ తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.**

దక్షిణ భారత నటి షకీలా ఇటీవల సర్వైకల్ స్పైన్ (మెడ వెన్నుపూస) సంబంధిత తీవ్ర సమస్యలతో బాధపడుతూ దాదాపు 3 లక్షల ఖర్చుతో మెడ సర్జరీ చేయించుకున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన అనంతరం తన ఆరోగ్యం, కోలుకుంటున్న తీరు గురించి యూట్యూబ్ వేదికగా పంచుకున్నారు. గంటల తరబడి మెడ వంచి స్మార్ట్‌ఫోన్లు చూడటం, ఒకే భంగిమలో ఎక్కువసేపు కూర్చోవడం వల్ల వచ్చే అనర్థాలపై ఈ ఘటన మరోసారి చర్చకు దారితీసింది. కేవలం ఫోన్ వాడకం వల్లనే సర్జరీ దాకా వెళ్లకపోయినా, ఇప్పటికే మెడ సంబంధిత సమస్యలు ఉన్నవారికి చెడు భంగిమ తీవ్ర ఒత్తిడిని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

1. నార్మల్ రీడింగ్ కంటే స్మార్ట్‌ఫోన్ వైపు తల వంచి చూడటం ఎందుకు ఎక్కువ ప్రమాదకరం?

1. నార్మల్ రీడింగ్ కంటే స్మార్ట్‌ఫోన్ వైపు తల వంచి చూడటం ఎందుకు ఎక్కువ ప్రమాదకరం?

ఫోన్ చూసేటప్పుడు చాలామంది మెడను ఎక్కువ కోణంలో కిందకు వంచుతారు దీనివల్ల తల బరువు మోసే మెడ కండరాలు, వెన్నుపూసలపై విపరీతమైన భారం పడుతుంది. పుస్తకాలు చదివేటప్పుడు సాధారణంగా అనుకూలమైన ఎత్తులో పట్టుకుంటారు, కానీ ఫోన్‌ను ఒడిలో లేదా కిందికి పెట్టి చూడటం వల్ల మెడపై నిరంతర ఒత్తిడి ఉంటుంది. ఇది ఎక్కువ సమయం కొనసాగితే కండరాల అలసట, దృఢత్వం డిస్క్ లేదా కీళ్ల సమస్యలు తీవ్రమవుతాయి.

2. మొదట్లో గమనించకుండా వదిలేసే ప్రారంభ లక్షణాలు ఏవి?

2. మొదట్లో గమనించకుండా వదిలేసే ప్రారంభ లక్షణాలు ఏవి?

సాధారణ లక్షణాలు: మెడ పట్టేయడం, మెడ – భుజాల వద్ద నొప్పి, తలనొప్పి, పైభాగపు వీపు నొప్పి.

తీవ్రమైన లక్షణాలు: సమస్య పెరిగేకొద్దీ నొప్పి మెడ నుంచి చేతులు, భుజాల వైపు పాకడం చేతుల్లో తిమ్మిర్లు, మొద్దుబారినట్లు అనిపించడం లేదా బలహీనత రావడం. ఇవి నరాలపై ఒత్తిడి పడుతోందనడానికి సంకేతాలు.

3. పెయిన్ కిల్లర్స్ వాడటం ఆపి స్పైన్ స్పెషలిస్ట్‌ను ఎప్పుడు సంప్రదించాలి?

పెయిన్ కిల్లర్స్ వాడటం ఆపి స్పైన్ స్పెషలిస్ట్‌ను ఎప్పుడు సంప్రదించాలి?

నొప్పి కొన్ని వారాల పాటు తగ్గకుండా ఉన్నా, లేదా మందులు వేసుకున్నా పదే పదే వస్తున్నా వైద్యుడిని కలవాలి.

నొప్పి నిద్రకు లేదా దైనందిన పనులకు ఆటంకం కలిగిస్తున్నప్పుడు, చేతి పట్టు (+తీఅజూ) తగ్గడం, నడవడంలో ఇబ్బంది లేదా మూత్ర విసర్జన నియంత్రణ కోల్పోవడం వంటి తీవ్ర లక్షణాలు ఉంటే వెంటనే స్పెషలిస్ట్‌ను సంప్రదించాలి. స్పెషలిస్ట్‌ను కలవడం అంటే వెంటనే సర్జరీ అని కాదు. ఫిజియోథెరపీ, జీవనశైలి మార్పులు లేదా సరైన మందుల ద్వారా సమస్యను గుర్తించి పరిష్కరించడం.

4. చెడు భంగిమ ఏ దశలో సర్జరీకి దారితీస్తుంది?

4. చెడు భంగిమ ఏ దశలో సర్జరీకి దారితీస్తుంది?

సాధారణంగా పోశ్చర్ సంబంధిత నొప్పులకు సర్జరీ అవసరం ఉండదు. వీటికి ఫిజియోథెరపీ, వ్యాయామాలు సరిపోతాయి.

డిస్క్ హెర్నియేషన్ (డిస్క్ జారడం), స్పైనల్ స్టెనోసిస్ (వెన్ను నరం ఉండే మార్గం కుచించుకుపోవడం) లేదా వెన్నుపాముపై తీవ్ర ఒత్తిడి ఉండి, ఇతర చికిత్సలు పనిచేయనప్పుడు మాత్రమే సర్జరీని పరిశీలిస్తారు.

5. ఫోన్ వాడేటప్పుడు పాటించాల్సిన సాధారణ మార్పులు

5. ఫోన్ వాడేటప్పుడు పాటించాల్సిన సాధారణ మార్పులు

ఐ-లెవల్ : ఫోన్‌ను కిందకు చూడకుండా, కంటి చూపు ఎత్తుకు తీసుకురావాలి.

విశ్రాంతి, మార్పు: భుజాల్ని రిలాక్స్‌గా ఉంచాలి. ఎక్కువసేపు ఒకే భంగిమలో ఉండకుండా మధ్యమధ్యలో బ్రేకులు తీసుకుంటూ మెడ, భుజాలను సున్నితంగా కదిలించాలి.

వ్యాయామం: మెడ, పై వీపు, భుజాల కండరాలను బలోపేతం చేసే చిన్నపాటి వ్యాయామాలు రోజువారీ అలవాటుగా చేసుకోవాలి.

**ముఖ్యమైన విషయాలు**

**తల బరువు ఒత్తిడి:** సాధారణంగా తల బరువు 4-5 కిలోలు ఉంటుంది. తలను 60 డిగ్రీల కోణంలో కిందకు వంచినప్పుడు మెడ వెన్నుపూసపై దాదాపు 27 కిలోల వరకు ఒత్తిడి పడుతుంది. 20-20-20 రూల్: ప్రతి 20 నిమిషాల స్క్రీన్ సమయానికి 20 సెకన్ల పాటు కనీసం 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడటం, మెడను నిటారుగా ఉంచడం అలవాటు చేసుకోవాలి.

# పిల్లల జుట్టు బాగా పెరగాలంటే...

పిల్లల జుట్టు పలుచగా ఉండటం, ఆశించినంత వేగంగా పెరగకపోవడం చాలామంది తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తుంది. దీంతో రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. రకరకాల ఆయిల్స్ వాడుతుంటారు. ఈ క్రమంలో జుట్టు త్వరగా పెరగాలనే ఉద్దేశంతో ఆముదం, కొబ్బరి నూనెతో తరచుగా మసాజ్ చేస్తూ ఉంటారు. అయితే ఈ రెండు నూనెల్లో పిల్లల జుట్టుకు నిజంగా ఏది ఎక్కువ ప్రయోజనం చేస్తుంది? పిల్లల జుట్టు ఒత్తుగా, సిల్కీగా, దృఢంగా, ఆరోగ్యంగా పెరగాలని ప్రతి తల్లిదండ్రి కోరుకుంటారు. అయితే కొందరు పిల్లల్లో జన్యుపరమైన లక్షణాలు, ఆహారపు అలవాట్లు, తల చర్మం ఆరోగ్యం వంటి కారణాల వల్ల జుట్టు పెరుగుదల నెమ్మదిగా ఉండొచ్చు. భారతీయులు హెయిర్ కేర్‌లో ఎక్కువగా వినియోగించేది కొబ్బరి నూనె లేదా ఆముదం. చిన్న పిల్లలకు కూడా వీటిని హెయిర్ కేర్‌లో ఎక్కువగా వాడుతుంటారు. వారి జుట్టు హెల్తీగా పెరగాలని ఇంట్లోనే ఆముదం, కొబ్బరి నూనెతో మసాజ్ చేస్తుంటారు. ఈ రెండు నూనెలు కూడా జుట్టు సంరక్షణలో విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ, వాటి పనితీరు ఒకేలా ఉండదు. రెండు నూనెలు కూడా జుట్టు సంరక్షణలో తమదైన లాభాలు చూపిస్తాయి. అయితే పిల్లల జుట్టు పెరుగుదలకు ఏది ఎక్కువ ఉపయోగపడుతుంది? రెండింటిలో తేడా ఏమిటి? నిపుణులు, అధ్యయనాలు ఏమి సూచిస్తున్నాయో ఈ స్టోరీలో వివరంగా తెలుసుకుందాం.. ముదం హెయిర్ కేర్‌లో చాలా ప్రసిద్ధి అని చెప్పొచ్చు. దీనిలో ఉండే రిసినోలిక్ యాసిడ్ తలకు రక్త ప్రసరణను పెంచి, జుట్టు కుదుళ్లను బలపరుస్తుంది. తద్వారా హెయిర్ ఫాల్‌ను కంట్రోల్‌లో ఉంచుతుంది. అంతేకాకుండా జుట్టును సిల్కీగా మారుస్తుందని రీసెర్చ్‌గేట్ అధ్యయనం పేర్కొంది. పిల్లల్లో, జుట్టు కుదుళ్ల ఏర్పాటును ఉత్తేజపరిచేందుకు వారానికి ఒకటి లేదా రెండు సార్లు ఆముదం నూనెతో తలకు సున్నితంగా మర్దన చేయాలి. ఆముదం నూనె చిక్కగా, జిగటగా కూడా ఉంటుంది,. అందు వల్ల దీనిని కొన్నిసార్లు రాసుకోవడం కష్టంగా ఉంటుంది.

# రిజర్వ్ ఫారెస్ట్‌లో 'రియల్' దందా?

- హైకోర్టు ఆదేశాలు.. అటవీశాఖ స్పష్టమైన ఉత్తర్వులు..
- అయినా లోతువాగులో ఆగని అక్రమ నిర్మాణాలు!
- సర్వే నంబర్ 17లో 215 ఎకరాల అటవీ భూమిపై రియల్ ఎస్టేట్ కన్ను?



**లక్ష్మీదేవిపల్లి, ఆగష్టు 16 (నినాదం):** రిజర్వ్ ఫారెస్ట్ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉంటే.. ఆ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయన్న ప్రశ్న ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకవైపు న్యాయస్థానం ఆదేశాలు.. మరోవైపు అటవీశాఖ ఉన్నతాధికారుల స్పష్టమైన ఉత్తర్వులు.. పంచాయతీ కార్యదర్శులకు నేరుగా ఇచ్చినా లోతువాగు బీట్ పరిధిలో అక్రమ నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెం రేంజ్ పరిధిలోని లోతువాగు బీట్ సర్వే నంబర్ 17లో సుమారు 215 ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు సమాచారం. ఈ భూమి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందని, ఇక్కడ ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదని పేర్కొంటున్నప్పటికీ.. కొందరు వ్యక్తులు నిబంధనలను పక్కనపెట్టి నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నిర్మాణాల వెనుక పెద్దల హస్తం ఉందా ? లేక ఈ రియల్ మాఫియాకు సూత్రధారి ఎవరు ? ఇంత జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారో? అన్న ప్రశ్నలు స్థానిక ప్రజల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

**అటవీశాఖ ఉత్తర్వులు.. పంచాయతీలకు స్పష్టమైన ఆదేశాలు**

ఈ వ్యవహారంపై తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని కొత్తగూడెం రేంజ్ అటవీశాఖ ఇప్పటికే స్పష్టమైన వైఖరి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.శ్రీనివాసరావు లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలో నూతనంగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ముఖ్యంగా లోతువాగు బీట్ పరిధిలో నిర్మించే ఇళ్లకు ఇంటి నంబర్లు జారీ చేయవద్దని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అటవీ భూమి స్వరూపాన్ని కాపాడేందుకు అధికారికంగా ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదేశాలు ఉన్నప్పుడు కూడా కొత్త నిర్మాణాలు ఎలా కొనసాగుతున్నాయి? వాటికి ఎవరి అండ ఉంది? అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**ఇంటి నంబర్ ఇవ్వొద్దన్నా.. నిర్మాణాలు ఎలా?**

సాధారణంగా ఇంటి నిర్మాణానికి స్థానిక సంస్థల అనుమతులు, అనంతరం ఇంటి నంబర్ వంటి ప్రక్రియలు ఉంటాయి. అయితే లోతువాగు బీట్ పరిధిలో రిజర్వ్ ఫారెస్ట్ భూముల విషయంలో కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇంటి నంబర్లు జారీ చేయకూడదని అటవీశాఖ స్పష్టంగా చెప్పినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆదేశాలను దాటి నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు నిజమైతే.. వాటిని ఎవరు పర్యవేక్షిస్తున్నారు ? నిర్మాణ సామగ్రి అక్కడికి ఎలా చేరుతోంది ? స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకున్నారు ? అనుమతులు లేకపోతే సంబంధిత అధికారులు ఎందుకు అడ్డుకోవడం లేదు ? అనే ప్రశ్నలు ఇప్పుడు కీలకంగా మారాయి.

**'రియల' దందాకు తెరలేపుతున్నారా?**

అటవీ భూములపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడిందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. విలువైన భూమిని ఆక్రమించి భవిష్యత్‌లో ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటవీ భూమి రక్షణ పేరుతో ఉన్న రికార్డులను పక్కనపెట్టి.. క్రమంగా నిర్మాణాలు పెంచుతూ భూమిని ప్రైవేటు వినియోగంలోకి తీసుకురావాలన్న ప్రయత్నం జరుగుతోందా? అన్నది అధికారుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో అక్రమ నిర్మాణాలకు సంబంధించి న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. న్యాయస్థానం ఆదేశాలు, అటవీశాఖ ఉత్తర్వులు, పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చిన స్పష్టమైన సూచనలు ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు కొనసాగితే.. అధికారుల ఆదేశాలకు క్షేత్రస్థాయిలో విలువ లేకుండా పోయిందా? అనే ప్రశ్న తలెత్తుతోంది.

**ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి**

సర్వే నంబర్ 17లోని మొత్తం 215 ఎకరాల భూమిపై సమగ్ర సర్వే నిర్వహించి, అటవీ రికార్డులు--రెవెన్యూ రికార్డులు--స్థానిక సంస్థల రికార్డులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే నిర్మించిన ఇళ్ల వివరాలు, నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? ఇంటి నంబర్లు ఎవరికి జారీ అయ్యాయి? నిర్మాణాలకు సంబంధించిన పత్రాలు ఎలా వచ్చాయి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. రిజర్వ్ ఫారెస్ట్‌ను కాపాడేందుకు అటవీశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నాయని చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శులకు కూడా స్పష్టమైన సూచనలు వెళ్లాయి. అయినా నిర్మాణాలు కొనసాగుతున్నాయంటే.. ఈ వ్యవహారం వెనుక ఉన్న అసలు కారణం ఏమిటన్నది తేలాల్సిందే. అటవీ భూమి రక్షణలో కాగితాలపై ఆదేశాలు కాకుండా.. క్షేత్రస్థాయిలో కఠిన చర్యలు ఎప్పుడు? లోతువాగు బీట్‌లో సాగుతున్న నిర్మాణాల వెనుక ఎవరున్నారు? రిజర్వ్ ఫారెస్ట్ భూమి రియల్ ఎస్టేట్ దందాగా మారుతోందా? అనే ప్రశ్నలకు అటవీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.


# సీనియర్ సిటిజన్లకు బెస్ట్ పథకం..

స్థిరమైన, రిస్క్ లేని రాబడి కోరుకునే సీనియర్ సిటిజన్లకు ప్రస్తుతం చాలా బ్యాంకుల్లో తక్కువ వడ్డీ ఇస్తున్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లను పెంచకపోవడంతో డిపాజిట్ల వడ్డీ రేట్లు తక్కువగా ఇస్తున్నారు. అయితే, ఇప్పటికీ ఓ 2 బ్యాంకులు ఏకంగా 8 శాతం మేర వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల్లో 8.05 శాతం వరకు వడ్డీ వస్తోంది. ఇందులో రూ.5 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుందో తెలుసుకుందాం. రిటైర్మెంట్ తర్వాత ఆదాయం ఉండదు. అందుకే మలివయసులో స్థిరమైన ఆదాయం అందించే మార్గాల్లో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉంటుంది. 60 ఏళ్ల వయసు దాటిన సీనియర్ సిటిజన్లు ఎక్కువగా స్థిరమైన, రిస్క్ లేని రాబడులు అందించే బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను ఎంచుకుంటుంటారు. గత ఏడాది కాలంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును భారీగా తగ్గించి స్థిరంగా కొనసాగిస్తూ వస్తోంది. దీంతో ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ వంటి పెద్ద బ్యాంకులు డిపాజిట్ వడ్డీ రేట్లను కనిష్ట స్థాయిలో అందిస్తున్నాయి. దీంతో ఎక్కడ డిపాజిట్ చేయాలో తేల్చుకోలేకపోతున్నారు. అలాంటి సీనియర్ సిటిజన్లందరికీ బెస్ట్ ఎఫ్‌డీ ఆప్షన్ ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. పెద్ద పెద్ద వాణిజ్య బ్యాంకులు డిపాజిట్ల వడ్డీ రేట్లను తక్కువగా ఆఫర్ చేస్తున్నా రెండు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు మాత్రం ఇప్పటికీ 8.05 శాతం వరకు వడ్డీ రేట్లను ఆఫర్ చేస్తున్నాయి. అవే జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ 5 సంవత్సరాల మెచ్యూరిటీ పీరియడ్ గల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం ద్వారా వరుసగా 8 శాతం, 8.05 శాతం వడ్డీ రేట్లనుఈ రెండు బ్యాంకులు ఆఫర్ చేస్తున్నాయి. 60 సంవత్సరాలు దాటిన ఒక సీనియర్ సిటిజన్ ఈ రెండు బ్యాంకుల్లో రూ.5 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుందో ఆన్‌లైన్ ఎఫ్‌డీ కాలిక్యులేటర్ ద్వారా ముందే అంచనా వేయవచ్చు. జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో 5 ఏళ్ల టర్మ్‌తో రూ.5 లక్షలు జమ చేస్తే 8 శాతం వడ్డీ వర్తిస్తుంది. దీని ప్రకారం మెచ్యూరిటీ తర్వాత చేతికి రూ. 2,42,975 వడ్డీతో మొత్తం రూ.7,42,975 వరకు అందుతాయి. అదే సూర్యోదయ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ అయితే వడ్డీ రూ.2,44,797 వరకు వస్తుంది. అంటే మొత్తం రూ.7,44,797 వరకు వస్తాయి. చాలా మంది స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులు అంటే వెనకడుగు వేస్తుంటారు. తమ డబ్బులు సురక్షితమేనా, వడ్డీ తక్కువ అయినా ఎస్‌బీఐ వంటి పెద్ద బ్యాంకులే బెటర్ అని అనుకుంటారు.




## ప్రకృతి సోయగాలకు ఆభరణ రూపం.. 'సిందూరం'





**హైదరాబాద్ బ్యూరో, ఆగస్టు 16 (నినాదం) :** ప్రముఖ సహజ వజ్రాల ఆభరణాల బ్రాండ్ కీర్తిలాల్స్ హైదరాబాద్ సోమాజిగూడ స్టోర్‌లో 'సిందూరం' పేరుతో ప్రత్యేక బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్‌ను ఆవిష్కరించింది. ప్రకృతి అందాల నుంచి స్ఫూర్తి పొందిన ఈ కలెక్షన్‌లో పుష్పాలు, మందార పువ్వులు, నెమళ్లు తదితర అంశాలను ఆధారంగా చేసుకుని రూపొందించిన ఆకర్షణీయమైన డిజైన్లు ఉన్నాయి. అత్యున్నత నాణ్యత కలిగిన సహజ వజ్రాలు, విలువైన లోహాలు, రంగురంగుల రత్నాల సమ్మేళనంతో 'సిందూరం' ఆభరణాలను రూపొందించారు. సంప్రదాయ బ్రైడల్ ఆభరణాల వైభవాన్ని సమకాలీన డిజైన్లతో మేళవిస్తూ, ఆధునిక వధువుల అభిరుచులకు అనుగుణంగా ఈ కలెక్షన్‌ను తీర్చిదిద్దారు. ప్రతి ఆభరణం తరతరాలకు అందించే వారసత్వ సంపదగా నిలిచేలా ప్రత్యేక శ్రద్ధతో రూపొందించారు. రిటైల్ జ్యువెల్లర్ ఇండియా అవార్డ్స్ 2026లో కీర్తిలాల్స్ బ్రైడల్ కలెక్షన్‌కు ప్రతిష్ఠాత్మక 'బెస్ట్ బ్రైడల్ జ్యువెలరీ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించింది. అవార్డు గెలుచుకున్న ఆభరణాన్ని ప్రస్తుతం సోమాజిగూడ స్టోర్‌లో ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా కీర్తిలాల్స్ డైరెక్టర్--బిజినెస్ స్ట్రాటజీ సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ, వధువు జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన రోజుకు ధరించే ఆభరణాలు కూడా చిరస్మరణీయంగా ఉండాలనే ఆలోచనతో 'సిందూరం' కలెక్షన్‌ను రూపొందించినట్లు తెలిపారు. ప్రకృతి సౌందర్యం, సృజనాత్మకత, అత్యుత్తమ హస్తకళల సమ్మేళనంగా ఈ కలెక్షన్‌ను తీర్చిదిద్దామని పేర్కొన్నారు. వధువులు, ఆభరణాల ప్రేమికులు సోమాజిగూడ స్టోర్‌ను సందర్శించి ఈ ప్రత్యేక కలెక్షన్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలని ఆయన ఆహ్వానించారు.

## రాంపల్లి సుచిత్ర కాలనీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన





**కీసర, ఆగస్టు 16 (నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం, మేడ్చల్ ఇన్‌చార్జ్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సహకారంతో నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి సుచిత్ర కాలనీలో రూ. 21 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, కౌకుంట్ల జీవన్ రెడ్డి, బలరాజ్ యాదవ్, పొట్ట శ్రీశైలం, పరమేష్, దొడ్డి బాలనరసింహ, కాలనీ అధ్యక్షుడు రమేష్, ఆల్ కాలనీల జనరల్ సెక్రటరీ ప్రవీణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు. కాలనీలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ఈ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుచిత్ర కాలనీ కమిటీ మెంబర్స్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

## ఐవోఎంటీ కమ్యూనికేషన్‌పై పరిశోధనకు పీహెచ్.డీ.



**పటాన్చెరు, ఆగస్టు 16 (నినాదం):** హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకుడు షేక్ జానీ బాషా డాక్టరేట్‌కు అర్హత సాధించారు. 'సురక్షిత ఐవోఎంటీ కమ్యూనికేషన్ కోసం శక్తి సామర్థ్యం గల, డేటా గోప్యతా పరిరక్షణ, ప్రమాణీకరణ పథకం'పై ఆయన అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ప్రధాన పర్యవేక్షకునిగా గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, ఈఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీతా పాండా ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సిద్ధాంత వ్యాసం, సకాలంలో పర్యవేక్షణ, రోగి సంరక్షణ కోసం ఆరోగ్య సంరక్షణ నెట్వర్కుల సురక్షితమైన ప్రసారాన్ని నిర్ధారిస్తూనే, వైద్య డేటాను శక్తి-సమర్థవంతంగా సేకరించడానికి వీలు కల్పించే ఒక సమీకృత ఫ్రేమ్ వర్కును ప్రతిపాదిస్తుందని తెలియజేశారు. పరిశోధనలో భాగంగా, డాక్టర్ జానీ బాషా కోసం ఎనర్జీ అవేర్ లింక్ ఎఫిషియెంట్ రూటింగ్ అనే ఒక వినూత్న రూటింగ్ ప్రోటోకాల్‌ను అభివృద్ధి చేశారన్నారు. ఇది మిగిలిన శక్తి దూరం, లింక్ నాణ్యత, హాప్ కౌంట్ వంటి అంశాల ఆధారంగా అత్యంత సమర్థవంతమైన కమ్యూనికేషన్ మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా డేటా ప్రసారాన్ని ఆప్టిమైజ్ చేస్తుందని తెలిపారు. ఈ విధానం వైర్ లెస్ బాడీ ఏరియా నెట్‌వర్కులలో నెట్ వర్క్ జీవితకాలాన్ని, కమ్యూనికేషన్ విశ్వసనీయతను మెరుగుపరుస్తుందన్నారు. ఈ పరిశోధన, ఇంప్రూవ్డ్ టంప్ ఆప్టిమైజేషన్ అల్గారిథం ద్వారా ఆప్టిమైజ్ చేసిన హైబ్రిడ్ క్లాసిఫైయర్‌ను ఉపయోగించి సింక్ నోడ్ల కోసం ఒక అధునాతన ప్రమాణీకరణ యంత్రాంగాన్ని కూడా పరిచయం చేసిందని పేర్కొన్నారు. గోప్యత, భద్రతను మరింత బలోపేతం చేయడానికి, క్రోనెకర్ ఉత్పత్తి ఆధారంగా ఒక ఆప్టిమైజ్ చేసిన క్రిప్టోగ్రాఫిక్ కీ జనరేషన్ పద్ధతిని అభివృద్ధి చేసినట్టు తెలిపారు. ఇది డేటా సమగ్రత, గోప్యతను కాపాడుతూ, సింక్ నోడ్లు, సర్వర్ మధ్య సురక్షితమైన ఆరోగ్య సంరక్షణ డేటా మార్పిడిని నిర్ధారిస్తుందన్నారు. డాక్టర్ జానీ బాషా సిద్ధాంత వ్యాసం పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.ఎం.ప్రశాంత, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు అభినందించినట్టు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## లైన్స్ క్లబ్ ఆఫ్ అల్వాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



**అల్వాల్, ఆగస్టు 16(నినాదం):** లయన్స్ క్లబ్ ఆఫ్ అల్వాల్ ఆధ్వర్యంలో ఆల్వాల్ లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఉత్తమ ద్వితీయ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు మెమెంటోలు అందచేశారు. విద్యార్థిని విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమం లో లయన్స్ క్లబ్ ఆల్వాల్ అధ్యక్షులు డివి సుబ్బారావు, కోశాధికారి ఆర్. రవీంద్రన్ మరియు సభ్యులు పి సత్యనారాయణ రావు, జయంతి, వెంకటరమణ, సునీత తివారి, భాగ్యలక్ష్మి, పద్మజ పాల్గొన్నారు.

## ఘనంగా ఫిజియోషియన్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం



**అల్వాల్, ఆగస్టు 16( నినాదం):** పంచశీల్ కాలనీ హై టెన్షన్ రోడ్ అల్వాల్ లో అమ్మల్ ఫిజియోథెరపీ & డెంటల్ క్లినిక్ డాక్టర్ జలగం తిరుపతి రావు ఫిజియోథెరపీ మరియు డాక్టర్ జలగం సరిత డెంటల్ స్పెషలిస్ట్ క్లినిక్ ని ప్రారంభించడం జరిగింది, ఇట్టి క్లినిక్ ని డాక్టర్ బి శ్రీనివాస్ గాంధీ ప్రొఫెసర్, డాక్టర్ పి శ్రీనివాస్ నిలపల్ ప్రొఫెసర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయడం జరిగింది. గతంలో జలగం తిరుపతిరావు గారు నిజామాబాద్ లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ గా సుదీర్ఘ సేవలు అందించడం జరిగింది, ఫిజియోథెరపీ గా నిజామాబాద్ లో ప్రజలకు అనేక రకాల సేవలు అందించడం జరిగింది, వారు ప్రస్తుతం గాంధీ మెడికల్ కాలేజ్ లో ప్రొఫెసర్ గా పని చేస్తు ఉన్నారు. వీరు ముఖ్యంగా డయాబెటిస్, ఫీవర్ మరియు ఒబెసిటీకి సంబంధించిన సేవలు అందించడంలో సుదీర్ఘ అనుభవం కలిగినటువంటి వైద్యులు, వీరు అల్వాల్ లో క్లినిక్ ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని పరిసర కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు, ఇట్టి కార్యక్రమానికి పరిసర కాలనీయైన హిల్స్ కాలనీ, మంగాపురం, పంచశీల కాలనీ, అల్వాల్ హిల్స్, మంజీరా కాలనీ, సిటిజన్ కాలనీ కి సంబంధించిన కాలనీ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# తాండూర్‌ను కమ్మేస్తున్న కాలుష్యం

ఆందోళనలో స్థానిక ప్రజలు



**వికారాబాద్, ఆగస్టు 16(నినాదం):** జిల్లా లోనే వాణిజ్యపరమైన పట్టణంగా ఖ్యాతి గాంచిన పారిశ్రామిక వాడ తాండూర్ కాలుష్యపు కోరల్లో చిక్కుకుని ఊపిరి ఆడక సతమతమవుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ విషయం చర్చనీయాంశమైయిందని వాపోతున్నారు. సంబంధిత అధికారులనుండి ఏలాంటి స్పందన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని విచారం వ్యక్తం చేస్తున్నారు. తాండూర్ ప్రాంతం మైనింగ్ తవ్వకాలు, పరిశ్రమలు, రాయి కటింగ్ యూనిట్లు, భారీ వాహనాల రాకపోకలు, రోడ్లపై దుమ్ములాంటి అనేక కారణాలతో తాండూర్‌లో వాయు కాలుష్యం ప్రధాన సమస్యగా మారుతోందని అంటున్నారు. కాలుష్య నియంత్రణకు అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతు న్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాండూర్ కాలుష్యంపై గతంలోనే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) దృష్టిసారించింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి నివేదికల్లో కూడా తాండూర్‌లో ప్రధానంగా దుమ్ము కాలుష్యం, భారీ వాహనాల రాకపోకలు, రాయి కటింగ్, పాలిషింగ్ యూనిట్లు, రోడ్ల పరిస్థితి వంటి అంశాలు ప్రస్తావించబడ్డాయి. 2021లో తాండూర్‌లోని ఒక ప్రాంతంలో నిర్వహించిన పర్యావరణ పర్యవేక్షణలో పీఎం 10 132/ఏటగా నమోదైంది జాతీయ ప్రమాణం 100 ప్ర/ఏటగా ఉంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు వాహనాలను పూర్తిగా కవరింగ్ చేయడం, రోడ్లను తరచూ శుభ్రం చేయడం, నీటిని చల్లడం, రాయి వ్యర్థాలను రోడ్ల పక్కన వేయకుండా చూడడం, బైపాస్ రోడ్డును పూర్తి చేయడం వంటి చర్యలను అధికారులు సూచించారు.

**భారీ వాహనాలకు కట్టడి చేయాలి**

సిమెంట్, రాయి, ఇతర ముడి పదార్థాలను తరలించే వాహనాలను తప్పనిసరిగా పూర్తిగా కవరింగ్ చేయాలి. పట్టణం మధ్య నుంచి భారీ వాహనాల రాకపోకలను తగ్గించాలి. ప్రధాన రోడ్లను ప్రతిరోజూ యంత్రాలతో శుభ్రం చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో నిరంతరం నీటిని చల్లాలి. ఎన్ జీ టీ కూడా రోడ్ల స్వీపింగ్, వాటర్ స్ప్రింక్లింగ్ పెంచాలని సూచించింది. రాయి కటింగ్ యూనిట్లపై కఠిన నిఘా ఉండాలని, రాయి చిప్స్, స్లర్రిని రోడ్ల పక్కన పడేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే యూనిట్లపై జరిమానాలతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సిమెంట్ పరిశ్రమల ఆన్‌లైన్ ఎమిషన్ మానిటరింగ్ వ్యవస్థలను నిరంతరం పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో కొన్ని పరిశ్రమల్లో కాలుష్య పరిమితులు అధిగమించిన సందర్భాల్లో పర్యావరణ పరిహారం విధించినట్లు అధికారిక నివేదికల్లో ఉందని, బైపాస్ రోడ్డు పూర్తి చేయాలని పట్టణం మీదుగా వెళ్లే భారీ వాహనాల సంఖ్య తగ్గితే దుమ్ము కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లోనే బైపాస్ రోడ్డు అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలన్నారు. ప్రధాన రోడ్ల వెంట, పరిశ్రమల పరిసరాల్లో విస్తృతంగా మొక్కలు నాటి గ్రీన్‌బెల్ట్‌ను అభివృద్ధి చేయాలని ప్రజలకు రియల్‌టైమ్ సమాచారం.

తాండూర్‌లో పలు ప్రాంతాల్లో నిరంతర గాలి నాణ్యత మానిటరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. తాండూరుకు పరిశ్రమలు ఆర్థిక బలాన్ని ఇస్తే, అదే పరిశ్రమల కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతినకూడదని వారన్నారు. అభివృద్ధి పేరుతో కాలుష్యాన్ని భరించాల్సిన పరిస్థితి ప్రజలకు రాకుండా అధికారులు, పాలకులు కలిసి శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఎన్ జీ టీ సూచించిన చర్యలు కేవలం నివేదికల్లో కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా ప్రత్యేక కాలుష్య నియంత్రణ కార్యాచరణ రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందని అంటున్నారు. కాలుష్య నియంత్రణపై పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారని పలువురు అంటున్నారు.

# సీరియల్ హత్యల గుట్టు రట్టు

నిందితురాలు అరెస్ట్..
జుడీషియల్ రిమాండ్‌కు తరలింపు
బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలింపు
వివరాలు వెల్లడించిన సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్





**దుబ్బాక, ఆగస్టు 16 (నినాదం):** దుబ్బాక మండలం రామక్కపేట గ్రామ శివారులో ఈ నెల 8న కలకలం రేపిన పాక్షికంగా కాలిన గుర్తుతెలియని మహిళ మృతదేహం కేసును సిద్దిపేట పోలీసులు ఛేదించారు. మృతురాలు భూంపల్లి గ్రామానికి చెందిన అతికం విజయ (45), భర్త రామస్వామిగా గుర్తించారు. బంగారం, నగదు కోసం తల్లి, బాలుడు కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితురాలు రాపాక రజిత (38), భర్త దుబ్బయ్యను అరెస్ట్ చేసి జుడీషియల్ రిమాండ్‌కు తరలించగా, బాలుడిని జువైనల్ హోమ్‌కు పంపించారు. ఈ కేసు వివరాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఐపీఎస్ వెల్లడించారు.

**రామక్కపేట శివారులో కాలిన మృతదేహం**

ఆగస్టు 8న ఉదయం రామక్కపేట గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పనం సర్వయ్య పొలం సమీపంలోని రహదారి పక్కన పాక్షికంగా కాలిన మహిళ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. స్థానిక పోలీసులతో పాటు సీసీఎస్, ఇతర ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు కొనసాగించారు.

**సీసీటీవీ ఫుటేజీతో బయటపడిన అసలు విషయం**

దర్యాప్తులో మృతురాలు భూంపల్లి గ్రామానికి చెందిన అతికం విజయగా గుర్తించారు. చుట్టుపక్కల గ్రామాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించడంతో కేసులో కీలక ఆధారాలు లభించాయి. డబ్బులు, బంగారం సులభంగా సంపాదించాలనే ఉద్దేశంతో చాకలి రజిత, ఒక బాలుడు కలిసి విజయను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. పోలీసుల ప్రకారం.. ఆగస్టు 8న సాయంత్రం విజయను కిరాణా దుకాణంలోకి పిలిపించి హత్య చేసి, అదే రోజు రాత్రి మృతదేహాన్ని ఎంఎ ఊ వాహనంపై రామక్కపేట గ్రామ శివారుకు తీసుకెళ్లి పెట్రోల్ పోసి కాల్చివేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**గతంలో మరో హత్య.. రాబరీ కేసు**

ఈ తల్లి, బాలుడి ప్రమేయంతో గతంలో కూడా మరో హత్య జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మే 28, 2026న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో నివాసం ఉండే కుంట రేఖను హత్య చేసి అమ్మమ్మాయిపల్లి గ్రామ అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని కాల్చివేసినట్లు దర్యాప్తులో తేలింది.

అలాగే 2025 జూన్‌లో భూంపల్లి గ్రామానికి చెందిన అన్నపూర్ణ భర్త జెన్నారెడ్డిని ఉదయం వెంచర్‌లో వాకింగ్ చేస్తుండగా దాడి చేసి, ఆమె మెడలో ఉన్న సుమారు 5 తులాల పుస్తెలతాడును దోచుకున్న ఘటనలోనూ వీరి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**రూ. 10 లక్షల విలువైన వస్తువుల స్వాధీనం**

నిందితుల నుంచి పోలీసులు 5.61 తులాల బంగారు ఆభరణాలు, 53 తులాల వెండి ఆభరణాలు, బ్లూ కలర్ ఎంఎ ఊ వాహనం, రూ. 1,03,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ సుమారు రూ. 10 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

**మరో నలుగురిని టార్గెట్ చేసినట్లు వెల్లడి**

దర్యాప్తులో తల్లి, బాలుడి వ్యవహారశైలి గురించి పోలీసులు దిగ్భ్రాంతికర విషయాలను వెల్లడించారు. టీ పాయింట్ల వద్ద కూర్చుని ప్రజల కదలికలు, వారి ఆస్తులు, కుటుంబ వివరాలను గమనించేవారని తెలిపారు. ముఖ్యంగా ఒంటరిగా ఉండే మహిళలను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడటంతో పాటు హత్యలకు కూడా పాల్పడినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు హత్యలకు సంబంధించిన విషయాలు వెలుగులోకి రాగా, విచారణలో మరో నలుగురిని కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు తేలిందని పోలీసులు తెలిపారు. ప్రతి నేరం అనంతరం పోలీసుల దృష్టిని వేరే వ్యక్తులు, వివాదాల వైపు మళ్లించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు.

**లక్ష్యంగా ఎంచుకోవడానికి కారణాలు**

అతికం విజయకు పాలివారితో భూ వివాదాలు ఉండటంతో ఆమెను కనిపించకుండా పోతే అనుమానం పాలివారిపైకి వెళ్లే అవకాశం ఉందని భావించినట్లు పోలీసులు తెలిపారు. కుంట రేఖ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండటంతో ఆమెతో సోషల్ మీడియాలో మాట్లాడే వ్యక్తులపై అనుమానం వచ్చేలా చేయాలనే ఉద్దేశంతో ఆమెను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు. అన్నపూర్ణ ప్రతిరోజూ ఒంటరిగా వాకింగ్‌కు వెళ్లే అలవాటు ఉండటంతో ఆమెను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భూంపల్లి గ్రామానికి చెందిన మరో నలుగురిని కూడా హత్య చేసేందుకు నిందితులు టార్గెట్‌గా పెట్టుకున్నట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

**పోలీసు బృందానికి సీపీ అభినందనలు**

కేవలం వారం రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించి దర్యాప్తు చేసి నిందితురాలిని, బాలుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కేసుతో పాటు గతంలో జరిగిన మరో హత్య, రాబరీ కేసులను కూడా విజయవంతంగా ఛేదించిన పోలీసు అధికారులను ఆమె అభినందించారు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సిద్దిపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, దుబ్బాక సీఐ రాజేష్, దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజు, భూంపల్లి ఎస్ఐ రాజశేఖర్, మిరుదొడ్డి ఎస్ఐ నరేష్, ఎస్ఐ షైక్ అలీ, సిద్దిపేట డివిజన్ సిబ్బంది, సీసీఎస్ సదనకుమార్, ఇన్‌స్పెక్టర్ జగన్‌రెడ్డి, సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని సీపీ అభినందించారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు**

నిర్జన ప్రాంతాల్లో సంచరించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలి. గుర్తుతెలియని వ్యక్తులకు వ్యక్తిగత వివరాలను వెల్లడించకూడదు. ఇళ్లు, వ్యాపార సంస్థల వద్ద సరైన యాక్సెస్ తో కూడిన సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సీసీటీవీ నిఘా మరింత బలోపేతమైందని పోలీసులు తెలిపారు. నేరాల ఛేదనలో సీసీటీవీ నిఘా కీలకంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను సూచించారు. ప్రజల భద్రత కోసం సిద్దిపేట పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తుందని సీపీ రష్మీ పెరుమాళ్ స్పష్టం చేశారు.

## ఆలయ అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరం



**అల్వాల్, ఆగస్టు 16 (నినాదం):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని వజ్ర ఎంక్లేవ్‌లో ఉన్న శ్రీ సుబ్రహ్మణ్య ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయ అభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలని వజ్ర ఎంక్లేవ్ అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. ఆలయంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి, నిర్మాణాలను క్రమబద్ధీకరించడంతో పాటు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆలయ పరిశుభ్రతను కాపాడుతూ భక్తిశ్రద్ధలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి కోసం కాలనీవాసులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ. మహిపాల్ రెడ్డి, సీహెచ్. సంతోష్, శ్రీధర్, నాగేశ్వరరావు, టీవీ ప్రవీణ్ కుమార్, సదాశివరావు, పూర్ణారావు, శ్రీనివాస్, మధుకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి, బంగారు మైసమ్మకు ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 16 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ సర్కిల్ భౌరంపేట్ శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం (బౌరమ్మగుడి) వార్షికోత్సవం, శ్రీ భౌరంపేట్ బంగారు మైసమ్మ తల్లి బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులచే ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, భౌరంపేట్ గ్రామంలో శాంతి, సౌభాగ్యం, సుఖసంతోషాలు వెల్లివిరియాలని, గ్రామం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని, అమ్మవారిని ఆయన వేడుకున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులకు ప్రాధాన్యం

- కూన శ్రీశైలం గౌడ్
- సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



**కుత్బుల్లాపూర్, ఆగస్టు 16 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో భాగంగా గాజుల రామారం, మహదేవపురం డివిజన్లలో రూ. 1.16 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలంగౌడ్ శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా గాజులరామారం డివిజన్ శ్రీరామ్ నగర్ లో రూ. 26.50 లక్షలతో మంజూరైన అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, మహదేవపురం డివిజన్ పరిధిలోని యంచమూరి లేఅవుట్‌లో రూ. 60 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి, శివపురం కాలనీలో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని ఆయన అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోయిందని ఆయన విమర్శించారు. ప్రజల అవసరాలను తీర్చడంలో అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాలు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్, సిహెచ్ బుచ్చిరెడ్డి, యాదయ్య సాగర్, దంపనబోయిన శ్రీనివాస్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు శ్రీనివాసరెడ్డి, దివాకర్, వెంకటేశ్వర్ రెడ్డి, సుమన్ రెడ్డి, శ్రీధర్, తిరుపతి రెడ్డి, నాగరాజు, ప్రసాద్ రెడ్డి, మహేష్, రాజేష్‌గౌడ్, ఏకాంబరం, సుమన్, ధనరాజ్, చంద్రశేఖర్ మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.



సామాజిక సేవా కార్యక్రమాలు

## అభినందనీయం

పెద్దకంజర్లలో వీధిదీపాలు ప్రారంభించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**పటాన్చెరు, ఆగస్టు 16 (నినాదం):** గ్రామ అభివృద్ధికి సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఇందేశం మున్సిపల్ పరిధిలోని పెద్ద కంజర్ల గ్రామంలో రెండవ వార్డ్ కౌన్సిలర్ సారా లావణ్య లక్ష్మణ్ ఆధ్వర్యంలో మూడు లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ దీపాలు, స్తంభాలను శనివారం రాత్రి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రేశం మున్సిపల్ పరిధిలో ప్రతి వార్డు అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. ప్రధానంగా మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సొంత నిధులతో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్కింవెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యులు సమీమా బేగం నవాబ్, సల్మాన్, సీనియర్ నాయకులు రామచందర్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని విజయవంతం చేయండి



- దుర్గం మల్లికార్జున్ గౌడ్

**వికారాబాద్, ఆగస్టు 16(నినాదం):** ఈ నెల 18న మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు, వికారాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 9 గంటలకు వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో వేడుకలు ప్రారంభమవుతాయని, 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు డాక్టర్ సత్యనారాయణ గౌడ్ నివాసంలో బండెయ్య గౌడ్ రచించిన పుస్తకావిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం పెద్ద ఎత్తున జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు పల్లె లక్ష్మణ్ గౌడ్, నాగరాజ్ గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు గౌడ సోదరులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# తీగలగుట్టపల్లి ఆర్ఓబికి ఎప్పుడు మోక్షం?

**మూడేళ్లుగా కొనసాగుతున్న నిర్మాణం. రవాణా కష్టాలు పరిష్కరించాలని కాంగ్రెస్ ధర్నా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య**



**కరీంనగర్, ఆగస్టు16(నినాదం):** తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రజల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మూడేళ్లుగా పనులు కొనసాగుతున్నా పూర్తి కాకపోవడంతో రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు గుంతల రహదారిపై ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సూచన మేరకు ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య ఆధ్వర్యంలో రైల్వే ట్రాక్ సమీపంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓబీ నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఆకుల నరసయ్య మాట్లాడుతూ, ఐదు నిమిషాల్లో చేరాల్సిన దూరానికి గంట సమయం పడుతోందని, గుంతల రహదారిపై వాహనదారులు, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తి చేసి ఆర్‌ఓబీని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎంపీ బండి సంజయ్ చొరవ తీసుకుని పనులను వేగవంతం చేయాలని కోరారు. ఆర్‌ఓబీ పూర్తయితే తీగలగుట్టపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు నగరంలోని పలు ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థ సమన్వయంతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బానోతు భాస్కర్ నాయక్, సీనియర్ నాయకులు కొసికె శ్రీనివాస్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కొలగాని అనిల్, మనోహర్, రాము, మహిళా నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ఇంటలిజెన్స్ విభాగానికి ఎన్నికైన జమ్మికుంట విద్యార్థిని

**.. దేశంలో అత్యుత్తమ ఐ బి డిపార్ట్మెంట్ లో పోస్ట్**



**జమ్మికుంట, ఆగస్టు 16 (నినాదం):** దేశంలో ఉన్న మారుమూల గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని అత్యుత్తమమైన కేంద్ర ఇంటెలిజెన్స్ విభాగంలో ఉద్యోగం సాధించి పేరు ప్రతిష్టలు నిలిపింది. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని గణేష్ నగర్ కు చెందిన వడ్లకొండ శీను వనజ దంపతుల రెండవ కుమార్తె వడ్లకొండ సింధూజ. ప్రాథమిక విద్యాభ్యాసం జమ్మికుంట లోనే కొనసాగగా ఇంటర్ విద్య హనుమకొండలో చదివింది. అనంతరం అత్యుత్తమమైన కేంద్ర సర్వీసులకు వెళ్లాలని ఉద్దేశంతో హైదరాబాదులోని 21 సెంచరీ ఇంటిగ్రేటెడ్ డిగ్రీ తో పాటు ఐఏఎస్ కోచింగ్ తీసుకుంది. గతంలో ఐఏఎస్ కు ప్రిపేర్ అయినప్పటికీ ఫలితం రాకపోవడంతో మొక్కవోని ధైర్యంతో కేంద్ర ఇంటెలిజెన్స్ బ్యూరో పరీక్ష రాసి అందులో ఉత్తీర్ణత సాధించడంతోపాటు ఇంటర్వ్యూలో విజయం సాధించింది. దేశ ప్రధానమంత్రి కి ఉండే ఐదు అంచల భద్రతలో సెక్యూరిటీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంటెలిజెన్స్ బ్యూరో పోస్ట్ కు సింధుజ ఎంపిక కావడం పట్ల స్థానికంగా పలువురు విద్యావేత్తలు, మేధావులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె తండ్రి శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నతనం నుండి చదువుపై ఆసక్తి ఉండడమే కాకుండా కేంద్ర సర్వీసులు చేయాలని సంకల్పంతో గత మూడు సంవత్సరాలుగా ఐఏఎస్ కోచింగ్ తీసుకుంటూ ఈ పరీక్షకు అర్హత సాధించిందని అయినప్పటికీ తిరిగి మళ్ళీ ఐఏఎస్ రాసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన వెల్లడించారు.

## మల్లాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ

**ఆవిష్కరించిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్**



**మల్లాపూర్, ఆగస్టు 16 (నినాదం) :** మల్లాపూర్ మండల కేంద్రంలోని నంది చౌరస్తా వద్ద తెలంగాణ చరిత్రలో ధైర్యసాహసాలకు, సామాజిక సమానత్వ పోరాటానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచి సామాజిక చైతన్యానికి నాంది పలికిన మహనీయుడని కొనియాడారు. ప్రజల్లో ఆత్మగౌరవం, ధైర్యాన్ని నింపిన పాపన్న గౌడ్ చరిత్ర నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. మొగల్ పాలన కాలంలో పాపన్న గౌడ్ తనకంటూ సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని పోరాటాలు సాగించారని, ఖిలాషాపూర్‌ను కేంద్రంగా చేసుకుని కోటలను నిర్మించి ప్రజల కోసం పరిపాలన సాగించారని పేర్కొన్నారు. ఆయన పోరాట వారసత్వం తెలంగాణ సామాజిక చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా నంది చౌరస్తా జనసందోహంతో సందడిగా మారింది. కార్యక్రమంలో మల్లాపూర్ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, గౌడ సంఘం నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత, కుల సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## మానేరు డ్యాం వద్ద ఘనంగా గంగమ్మ బోనాల జాతర


**ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, ఆగస్టు16(నినాదం):** కరీంనగర్ పట్టణ గంగపుత్ర (బెస్త) సంఘం ఆధ్వర్యంలో మానేరు డ్యాం వద్ద గంగమ్మ తల్లి బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన వేడుకలకు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గంగపుత్ర సంఘం ప్రతినిధులు మేయర్‌ను ఘనంగా సన్మానించారు. గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మేయర్ ఆకాంక్షించారు. బోనాల జాతరతో మానేరు డ్యాం పరిసర ప్రాంతం భక్తుల సందడితో, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, నాంపల్లి రేణుక శ్రీనివాస్, కో–ఆప్షన్ సభ్యుడు బల్వీర్‌సింగ్, పట్టణ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి నాగుల రాజారాం, కోశాధికారి గడప నర్సింహస్వామి, ఉపాధ్యక్షులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, సంఘం ప్రతినిధులు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలి: కానుగుల దశరథం

**నాయి బ్రాహ్మణ సంఘాలకు నూతన సారథ్యం**



**ఆమనగల్లు, ఆగస్టు 16(నినాదం):** ఆమనగల్లు పట్టణ, మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘాల నూతన కార్యవర్గాలను ఆదివారం ఎన్నుకున్నారు. తెలంగాణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం సమన్వయ కమిటీ చైర్మన్ కానుగుల దశరథం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా జంపుల పాండు, ఉపాధ్యక్షుడిగా దేవరకొండ శ్రీను, ప్రధాన కార్యదర్శిగా జంపుల వినయ్, సహాయ కార్యదర్శిగా దేవరకొండ దుర్గాప్రసాద్, కోశాధికారిగా జంపుల సురేష్ ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడిగా పెరికేటి కోటయ్య, ఉపాధ్యక్షుడిగా దేవరకొండ నాగేష్, ప్రధాన కార్యదర్శిగా పగిడి పాల వెంకటేష్, సహాయ కార్యదర్శిగా జంపుల రవి, కోశాధికారిగా గుద్దేటి బాలు బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కానుగుల దశరథం మాట్లాడుతూ నాయి బ్రాహ్మణుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు నూతన కమిటీలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

# పారమిత విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం

**వాకర్స్, క్రీడాకారులకు బీపీ, షుగర్, బీఎంఐ పరీక్షలు**



**కరీంనగర్, ఆగస్టు16(నినాదం):** ప్రజల్లో ఆరోగ్య అవగాహనతో పాటు విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు ఆదివారం అంబేద్కర్ స్టేడియంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. పాఠశాల సైన్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో, నర్సింగ్ అధికారి పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో స్టేడియానికి వచ్చిన వాకర్స్, క్రీడాకారులకు రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయి, శరీర ద్రవ్యరాశి సూచిక (బీఎంఐ) తదితర ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా చేశారు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించిన శిబిరానికి వాకర్స్, క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. పాఠశాలలో నేర్చుకున్న జ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా ఆచరణలో పెట్టడం ద్వారా విద్యార్థుల్లో సేవా దృక్పథం, సామాజిక బాధ్యత పెంపొందించడమే కార్యక్రమం ఉద్దేశమని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ప్రసాద్‌రావు తెలిపారు. శిబిరంలో చురుగ్గా పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు నాగరాజు, రాము, సైన్స్ విభాగం ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గాయత్రీనగర్‌లో రోడ్డు పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డంకి

**స్తంభాలు తొలగించకుండానే రోడ్డు నిర్మాణం. ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసుల విజ్ఞప్తి,**



**కరీంనగర్, ఆగస్టు16(నినాదం):** నగరంలోని 37డివిజన్ గాయత్రీ నగర్ లో జరుగుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు ఇబ్బందికరంగా మారాయని కాలనీవాసులు తెలిపారు. ముఖ్యంగా రహదారి మలుపులో రెండు స్తంభాలు ఉండటంతో ఆటోలు, కార్లు కాలనీలోకి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన తర్వాత స్తంభాలను తొలగిస్తే రహదారిని తిరిగి పగులగొట్టాల్సి వస్తుందని, దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అయ్యే అవకాశం ఉందని, కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లగా నగరపాలక సంస్థ విద్యుత్ విభాగం అధికారులను సంప్రదించాలని సూచించినట్లు తెలిపారు. దానితో స్థానిక కార్పొరేటర్‌ను సంప్రదించగా విద్యుత్ శాఖ సహాయ ఇంజినీర్‌కు ఇప్పటికే సమాచారం ఇచ్చామని, అధికారులు వచ్చి స్తంభాలను తొలగిస్తారని చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. స్తంభాలు తొలగించకుండానే రోడ్డు పనులు కొనసాగించడం వల్ల భవిష్యత్‌లో రహదారిని మళ్లీ తొలగించాల్సి వస్తుందని ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్, మేయర్ వెంటనే స్పందించి స్తంభాలను తొలగించే వరకు రోడ్డు పనులను నిలిపివేసి, అనంతరం నిర్మాణ పనులు చేపట్టాలని గాయత్రీనగర్ వాసులు కోరారు. స్థానిక కార్పొరేటర్ ప్రత్యేక చొరవ తీసుకుని కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడడంతో పాటు, ప్రభుత్వ ధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# ఎస్ఐఆర్ ఫేజ్-2పై కాంగ్రెస్ శ్రేణులకు శిక్షణ

**అర్హులైన ప్రతి ఓటు రక్షణే లక్ష్యం. భూపాలపల్లి ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ ఎస్కే సిరాజ్ హుస్సేన్**



కరీంనగర్, ఆగస్టు16,(నినాదం) తెలంగాణలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా రెండో దశ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, సమన్వయకర్తలకు హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్కే సిరాజ్ హుస్సేన్ ఇందులో పాల్గొన్నారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు నిర్వహించనున్న రెండో దశలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో గుర్తించే అసాధారణ వివరాలు, సేకరించలేని వివరాలు, ఓటర్ల సమాచారంలోని తప్పులు, ఇతర లోపాలను గుర్తించి సరిదిద్దే విధానంపై శిక్షణ ఇచ్చారు. ముసాయిదా జాబితా విడుదల అనంతరం బూత్ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు చేపట్టాల్సిన కార్యాచరణ, సమాచార పరిశీలన, అర్హులైన ఓటర్ల గుర్తింపు తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయ కర్తలు, 17 పార్లమెంట్ నియోజకవర్గాల సమన్వయ కర్తలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ శిక్షణా కమిటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఎస్ఐఆర్ రాష్ట్ర సమన్వయకర్త గంప వేణుగోపాల్, ఏఐసీసీ జాతీయ సమన్వయకర్తలు నిశాంత్, అనూష, రాష్ట్ర సమన్వయకర్త రఘు తదితరులు పాల్గొని రెండో దశ కార్యాచరణపై శిక్షణ, సూచనలు అందించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాలని, ఏ ఒక్క అర్హుడి ఓటు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గంలో బూత్ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ రెండో దశను విజయవంతంగా పూర్తి చేస్తామని ఎస్కే సిరాజ్ హుస్సేన్ తెలిపారు.

# గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

## 230 గ్రాముల గంజాయి స్వాధీనం



**జమ్మికుంట, ఆగస్టు 16 (నినాదం):** జమ్మికుంటలో అక్రమంగా గంజాయి విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను జమ్మికుంట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 11,400 విలువైన 230 గ్రాముల గంజాయిని, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రామకృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన నాగిరెడ్డి హరిప్రసాద్, దుర్గం కార్తిక్ అనే ఇద్దరు యువకులు గంజాయి అలవాటుకు బానిసల య్యారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ఈ నెల 15న మహారాష్ట్రలోని నాగపూర్ వెళ్లి ఒక వ్యక్తి వద్ద 230 గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి, రైలులో మందమర్రికి తెచ్చి ఆదివారం ఆ గంజాయిని విక్రయించేందుకు జమ్మికుంటలోని ఎఫ్‌సీఐ గోడౌన్ పరిసర ప్రాంతానికి చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకోగా, నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి, ఫోన్లు లభ్యమయ్యాయి. పట్టణంలో గాని పరిసర ప్రాంతాల్లో గంజాయి రవాణా, విక్రయం కు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ రామకృష్ణ గౌడ్ హెచ్చరించారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల్లో ప్రధాని మోదీ ఫొటో ముద్రించాలి

**కేంద్ర పథకం ద్వారా తెలంగాణలో 2 కోట్ల మందికి ఉచిత బియ్యం అందుతోంది: డిప్యూటీ మేయర్, యాదగిరి సునీల్‌రావు**



**కరీంనగర్, ఆగస్టు 16(నినాదం):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' కింద తెలంగాణలో సుమారు 2 కోట్ల మంది ప్రజలకు ప్రతి నెలా ఉచితంగా 5 కిలోల బియ్యం అందిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. ఆదివారం రోజున ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 21 కోట్ల రేషన్ కార్డుదారులకు చెందిన సుమారు 90 కోట్ల మందికి ఉచిత బియ్యం పంపిణీ కొనసాగుతోందని, ఈ పథకాన్ని 2031 వరకు పొడిగించినట్లు తెలిపారు. పేదలు ఆకలితో అలమటించకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీ చేస్తున్న నూతన స్మార్ట్ రేషన్ కార్డుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించి, కేంద్ర పథకం ద్వారా ఉచిత బియ్యం అందిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటోను ముద్రించకపోవడం విచారకరమన్నారు. కేంద్ర నిధులతో అమలయ్యే పథకాల్లో రాష్ట్ర ప్రభుత్వాలను గౌరవించే విధంగా కేంద్రం వ్యవహరిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ప్రొటోకాల్‌ను పాటించడం లేదని విమర్శించారు. నూతన స్మార్ట్ రేషన్ కార్డుల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోను కూడా ముద్రించి, కేంద్ర ప్రభుత్వ పాత్రను ప్రజలకు తెలియజేయాలని సునీల్‌రావు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి సరిదిద్దుకోవాలని కోరారు.

# ప్రాథమిక పాఠశాలకు ప్రొజెక్టర్ బహుకరించిన సర్పంచ్

**– అప్పాజీపల్లి సర్పంచ్ వెంకట్ గౌడ్ (గజిని)**



**కొల్చారం ఆగస్టు 16 ( నినాదం )** విద్యార్థులు ప్రస్తుత విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన బోధనోపకరణలు ఉండడం వలన, వాళ్లకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయడానికి సాంకేతికత తోడ్పాటు అందించడంలో, ఉపాధ్యాయులు సరళమైన పద్ధతిలో విద్యార్థుల అర్థమయ్యే విధంగా, ప్రస్తుత సాంకేతిక వ్యవస్థను విద్యావ్యవస్థను అనుసంధానం చేసినట్లయితే విద్యార్థులలో మంచి ఫలితాలు రాబట్ట వచ్చని ఆయన తెలియజేశారు. అనంతరం పాఠశాలకు తన వంతు సహాయంగా 25వేల రూపాయల విలువగల ప్రొజెక్టర్ మరియు స్క్రీన్ ను సర్పంచ్ నాయిని వెంకట్ గౌడ్ ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ మెంబర్లు ఉపాధ్యాయులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బోయవాడలో గంగమ్మ తల్లి బోనాలు

**బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్న, మాజీ మంత్రి గంగుల కమలాకర్**



**కరీంనగర్, ఆగస్టు16(నినాదం):** జిల్లా కేంద్రంలోని బోయవాడలో గంగమ్మ తల్లి బోనాల వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోనం ఎత్తుకుని ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ, గంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. బోనాల వేడుకలతో బోయవాడలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్ తాటి ప్రభావతి, మాజీ కార్పొరేటర్ సోహన్‌సింగ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గడప మల్లేశం, స్థానిక నాయకులు కర్ర సూర్యశేఖర్, కన్న కృష్ణ, నేతి రవివర్మ, గంగాధర చందు, స్వామి, నవీన్, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



**జమ్మికుంట, ఆగస్టు 16 (నినాదం):** యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని జమ్మికుంట మండలం అంకుశ పూర్ గ్రామ సర్పంచ్ కవిడె కుమారస్వామి 16వ వార్డు కౌన్సిలర్ కుతాటి తిరుపతి పిలుపునిచ్చారు . జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో వాలీబాల్ టోర్నమెంట్ను శనివారం నిర్వహించారు. టోర్నమెంట్ లో భాగంగా 12 టీములు పాల్గొనగా మొదటి విజేతగా వీణవంక మండలం మండలం మల్లారెడ్డి పల్లె వాలీబాల్ టీం గెలుచుకోగా ద్వితీయ విజేతగా ఇల్లంతకుంట మండలం సిరిసేడు టీం గెలుచుకుంది ఈ సందర్భంగా నగదు బహుమతిని 16వ వార్డు కౌన్సిలర్ కుతాటి తిరుపతి 8000 వేల రూపాయలను నగదును టోపీలను జమ్మికుంట మండలం అంకుశ పూర్ గ్రామ సర్పంచ్ కవిడె కుమారస్వామి గెలుపొందిన టీములకు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఆవుల తిరుపతి పోట్టాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కోరపల్లిలో ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



జమ్మికుంట, ఆగస్టు 16: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలోని అంబేద్కర్ కూడలి వద్ద బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ ముందస్తు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గండి రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, యువకులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గండి రంజిత్ కుమార్ మాట్లాడుతూ... నిరంకుశ పాలకులపై పోరాడి బహుజనులకు రాజ్యాధికారాన్ని అందించిన పోరాట యోధుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందిన గీత కార్మికుల కుటుంబాలకు ఐదేళ్లుగా నిలిచిపోయిన ?5 లక్షల ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ కుటుంబానికి రూ.4.10 లక్షల భరోసా

**తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం**



**కరీంనగర్, ఆగస్టు16(నినాదం):** అనారోగ్యంతో మృతి చెందిన కరీంనగర్ జిల్లాకు చెందిన ఫోటోగ్రాఫర్ మహిమల సంధ్య కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 4.10 లక్షల కుటుంబ భరోసా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవి, కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి భూపతి సూరిబాబు కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, సభ్యుల కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫోటో, వీడియో గ్రాఫర్స్ అధ్యక్షుడు కొప్పుల కనకారావు, నైస్ రఫీ, నాగిశెట్టి రమేష్, దక్షిణ భారత అసోసియేషన్ ప్రతినిధి రాజేశ్వర్‌రెడ్డి, బొంగోని మధు, మియాపురం రాజు, లక్ష్మణ్ శంకరాచారి, మాటూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# రిపేర్‌లో ట్రాన్స్‌ఫార్మర్.. పట్టించుకోని అధికారులు

- సమస్య వస్తే ఎల్‌సీ తీసుకోవాల్సిందేనంటున్న రైతులు
- అవస్థలు పడుతున్న వసంతాపురం గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు

**కోదాడ, ఆగస్టు 16(నినాదం):** అనంతగిరి మండలంలోని వసంతాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ గత కొన్ని రోజులుగా మరమ్మతులకు గురై ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను ఆన్/ఆఫ్ చేసేందుకు ఉపయోగించే ఆపరేటింగ్ పైపు రిపేర్ కావడంతో దాన్ని తొలగించి పక్కన ఉంచారు. అయితే ఇప్పటివరకు సంబంధిత లైన్మెన్, అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు, సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఏదైనా విద్యుత్ సమస్య ఏర్పడితే సరఫరా నిలిపివేసేందుకు, మరమ్మతులు చేపట్టేందుకు ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఆపరేటింగ్ పరికరం సక్రమంగా లేకపోవడంతో చిన్న సమస్య వచ్చినా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి ఆపరేటింగ్ పైపునకు మరమ్మతులు చేసి తిరిగి అమర్చాలని, ట్రాన్స్‌ఫార్మర్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.





## ఉత్తమ ఉద్యోగి చలిగంటి రాజయ్యకు ఘన సన్మానం



- విధి నిర్వహణలో అంకితభావంతో అందించిన సేవలకు గుర్తింపు
- సూర్యాపేట జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అంజన్‌గౌడ్

**కోదాడ, ఆగస్టు 16 (నినాదం):** ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకున్న మున్సిపాలిటీ సీనియర్ అసిస్టెంట్ చలిగంటి రాజయ్యను సూర్యాపేట జిల్లా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు అంజన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజయ్యను పూలమాల, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అంజన్‌గౌడ్ మాట్లాడుతూ.. చలిగంటి రాజయ్యకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చేతుల మీదుగా ఉత్తమ ప్రభుత్వ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకోవడం అభినందనీయమన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు అందించిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించడం 30వ వార్డు ప్రజలకు సంతోషకరమైన విషయమన్నారు. చలిగంటి రాజయ్య మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రశంసాపత్రం అందుకోవడం ఇది రెండోసారి అని తెలిపారు. తన పనితీరును గుర్తించి ప్రోత్సహిస్తున్న జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. తనను సన్మానించి ప్రోత్సహించిన అంజన్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చలిగంటి ప్రసాద్, భూమా శ్రీనివాస్, సట్టు యల్లయ్య, బాడిష రమేష్, సత్తార్, ఉల్లెందుల సతీష్, ఆలవెల్లి రమణ, భూక్యా వెంకటేష్‌తో పాటు 30వ వార్డు సభ్యులు, అంజన్‌గౌడ్ ఆర్మీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా కార్యదర్శిగా చిల్లంచర్ల అభి నియామకం



**మిర్యాలగూడ, ఆగస్టు 16 (నినాదం):** భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి బిజెపి జిల్లా కార్యదర్శిగా మిర్యాలగూడ వాసి చిల్లంచర్ల అభిని నియమిస్తూ ఆయనకు నియమాపక పత్రం అందజేశారు. చిల్లంచర్ల అభి స్వయంసేవక గా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో కీలకంగా పనిచేసి భారతీయ జనతా యువమోర్చా పట్టణ ఉపాధ్యక్షుడి నుండి అసెంబ్లీ కన్వీనర్ గా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిల్లంచర్ల అభి మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో ఇచ్చిన ప్రతి పనిని నిబద్ధతతో పూర్తి చేస్తానని నాకు ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి గారికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్ గారికి ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

# నల్గొండలో రాక్షస, కమిషన్ల రాజ్యం నడుస్తోంది

- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



**నల్గొండ ప్రతినిధి ఆగస్టు 16(నినాదం ):** నల్గొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండతో రాక్షస, కమిషన్ల రాజ్యం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, ఒక్కో ఇంటికి రూ. 3 లక్షల వరకు లంచాలు తీసుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో 546 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించామని, ప్రజల సమక్షంలో డ్రా నిర్వహించి అర్హులకు ఇళ్లు కేటాయించామని తెలిపారు. ప్రస్తుతం ఇచ్చిన ఇళ్లను రద్దు చేసి మళ్లీ పారదర్శకంగా డ్రా నిర్వహించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై 15 రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. సీపీఎం కార్యాలయంపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, సీపీఎం నాయకుల పట్ల అమర్యాదగా వ్యవహరించిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై త్వరలో డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నల్గొండ పట్టణంలో ప్రభుత్వ భూముల కబ్జాలు, అమృత్ పథకం నిధుల దుర్వినియోగం జరుగుతున్నాయని ఆరోపించారు. వెంచర్లలో అమృత్ పథకం నిధులతో సీసీ రోడ్లు వేస్తున్నారని, రానున్న రోజుల్లో వెంచర్లపై విజిలెన్స్ విచారణ చేయిస్తామని అన్నారు. లతీఫ్‌సాబ్ గుట్టకు బఫర్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ లైన్‌ను 92 కిలోమీటర్ల మేర వెడల్పు చేసి 3,000 క్యూసెక్కుల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మెడికల్ కాలేజీకి రూ. 200 కోట్లు, కార్పొరేషన్‌కు రూ. 1,000 కోట్లు తీసుకురావాలని మంత్రి డిమాండ్ చేశారు. నల్గొండ అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డితో బహిరంగ చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. జర్నలిస్టులకు ఇళ్ల కోసం భూమి కేటాయించినందున వెంటనే ఆ భూమిని వారికి అప్పగించాలని కోరారు. జర్నలిస్టులకు అండగా బీఆర్ఎస్, తాను ఉద్యమిస్తామని భూపాల్‌రెడ్డి తెలిపారు. మంత్రి తనకు సొంత ఇల్లు లేదని తరచూ చెబుతున్నారని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మంత్రికి కూడా ఒక ఇల్లు కేటాయించాలని కలెక్టర్‌ను కోరుతున్నానంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ కటికం సత్తయ్యగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ చీరా పంకజ్‌యాదవ్, అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాసరెడ్డి, మారగోని గణేష్, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## అనాథ పిల్లల మధ్య చిన్నారి తొలి పుట్టినరోజు



- పుట్టినరోజు వేడుకల్లో అన్నదానం..
- మానవత్వం చాటుకున్న కుటుంబం

**కోదాడ,ఆగస్టు 16(నినాదం):** మిర్యాలగూడకు చెందిన కురెంద రాజ్‌కుమార్--ఉష దంపతులు తమ కుమారుడు దర్శన్ తొలి పుట్టినరోజు వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. ఆదివారం కోదాడలోని శనగల రాధాకృష్ణ అనాథ ఆశ్రమంలో చిన్నారులకు అన్నదానం చేసి వేడుకలు జరిపారు. ఆడంబరాలకు దూరంగా అనాథ పిల్లల ఆకలి తీర్చడమే నిజమైన వేడుకగా భావించి ఈ కార్యక్రమం చేపట్టినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నారులతో కలిసి సమయం గడిపి వారితో పుట్టినరోజు ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారి తాత, నానమ్మ కురెంద సత్తయ్య, లక్ష్మమ్మ, లక్కమల్ల రాములు, సైదమ్మ, మేనమామ ఉపేందర్, ప్రియాంకతో పాటు గ్రామ ప్రముఖులు నర్సింగ్ రామకృష్ణ, సాత్విక్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. ఆశ్రమ నిర్వాహకులు, పెద్దలు చిన్నారి దర్శన్‌కు ఆయురారోగ్యాలు, విద్యాబుద్ధులు కలగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు.

# అర్హులైన అందరికీ పెన్షన్లు అందించాలి




**మిర్యాలగూడ, ఆగస్టు 16 (నినాదం ):** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో ఒంటరి మహిళా పెన్షన్‌కు అర్హులైన దరఖాస్తుదారులకు తహశీల్దార్ ధృవీకరణ పత్రాలు జారీ చేయకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిఆర్ఎస్ పట్టణ కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మిర్యాలగూడ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. భర్తను కోల్పోయిన లేదా కుటుంబానికి దూరంగా ఒంటరిగా జీవిస్తున్న మహిళలకు ప్రభుత్వ పెన్షన్ ఎంతో కీలకమైన ఆర్థిక సహాయమని, అధికారుల నిర్లక్ష్యం లేదా ధృవీకరణ ప్రక్రియలో జాప్యం కారణంగా అర్హులైన మహిళలు సంక్షేమ పథకానికి దూరం కాకూడదని అన్నారు. అలాగే అర్హత కలిగిన ప్రతి ఒంటరి మహిళకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెన్షన్ అందేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే బాధిత మహిళల తరపున దీ=గా పార్టీ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమములో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండి. ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, పద్మశెట్టి లక్ష్మి కోటేశ్వర రావు, తీరంశెట్టి సీతా కోటేశ్వర రావు,పునాతి లక్ష్మీనారాయణ, దీపిక విజయ్, జానకమ్మ దుర్గాప్రసాద్,లావుడి అరుణ సుధాకర్, సందేషి రజిని అంజన్ రాజు,మర్రి అంజిబాబు,తిరుమలగిరి వజ్రం,వడ్డేపల్లి శ్రీనివాస్,జన్నపాల సునీత కిరణ్, యర్రమల్ల దినేష్,గంగుల బిక్షం యాదవ్, భూక్య రాంబాబు,ఆయిల వెంకన్న,ఎనుగంటి తిరుపతయ్య నాయుడు,వల్లపట్ల వినోద్,కందగట్ల అశోక్,పందిరి వేణు,నునే రవి కుమార్,కంచర్కుంట్ల దయాకర్ రెడ్డి,నేరెళ్ళ శివ, తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి అనంతగిరిలో గ్రీవెన్స్

మండల ప్రజల నుంచి నేరుగా వినతుల స్వీకరణ




**కోదాడ, ఆగస్టు 16(నినాదం):** అనంతగిరి మండల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు నేటి నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుష్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు, వినతిపత్రాలను కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. ప్రజల నుంచి ప్రతిరోజూ స్వీకరించే వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసేలా చూస్తామన్నారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు.

## రెండు బస్సులు ఢీ.. తప్పిన పెను ప్రమాదం

డ్రైవర్‌ను రెండు గంటలు శ్రమించి బయటకు తీసిన పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది






**కోదాడ/మునగాల,ఆగస్టు 16(నినాదం):** సూర్యాపేట జిల్లా మునగాల మండలం ఆకుపాముల వద్ద జాతీయ రహదారి-65పై ఆదివారం రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది. నర్సాపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న శ్రీకృష్ణ ట్రావెల్స్ ప్రైవేట్ బస్సును, ఏలూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఏపీఎస్ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న ధాటికి రెండు బస్సులు అదుపుతప్పాయి. ఆర్టీసీ బస్సు రహదారి కిందికి దూసుకెళ్లి పక్కనే ఉన్న కల్వర్టు, చెట్టును ఢీకొని ఆగింది. దీంతో బస్సు మరింత ముందుకు వెళ్లకుండా నిలిచిపోవడంతో భారీ ప్రమాదం తప్పింది.

**క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్**

ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో ప్రయాణికుల్లో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న మునగాల ఎస్సై సంజీవరెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. డ్రైవర్‌ను బయటకు తీసేందుకు సుమారు రెండు గంటలపాటు శ్రమించి ఎట్టకేలకు సురక్షితంగా బయటకు తీశారు.

**63 మంది ప్రయాణికులు**

ప్రమాద సమయంలో శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సులో 31 మంది, ఆర్టీసీ బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 63 మంది ఉండగా ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం కారణంగా కొద్దిసేపు జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించి వెనుక నుంచి వస్తున్న బస్సులను నిలిపి ప్రయాణికులను ఇతర బస్సుల్లోకి ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సమయస్ఫూర్తితో చేపట్టిన సహాయక చర్యలతో పెను విషాదం తప్పింది.

# వినియోగదారుల మన్ననలు పొందాలి



**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 16 (నినాదం):** వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన మస్తాన్ బిర్యానీ సెంటర్‌ను వారు ప్రారంభించారు. అనంతరంవారు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన రుచికరమైన ఆహారాన్ని అందిస్తూ, పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ వినియోగదారులకు సేవలు అందించాలని అన్నారు. నూతనంగా నిర్వహించే వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నిర్వాహకులు ఎస్ కె బాబా, అబ్బాస్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్,మన్నెం అరుణ మల్లేష్,యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా సేవాదల్ చీఫ్ ఆలేటి మాణిక్యం, నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నరేందర్ నాయుడు, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, చెంచల నిఖిల్, అబ్బాస్, గుగులోత్ నాగు నాయక్, పడిదల రవి, గుణగంటి సైదులు గౌడ్, ఎస్.కె సైదులు, బీరవాలు కరుణాకర్ రెడ్డి, మోహిన్ పాషా, బుక్క ఉపేందర్, శివ, గోల్కొండ శ్రీకాంత్, తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షులు నల్లగొండ వెంకట్,లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## తక్కల్లపల్లి హైస్కూల్‌కు దాతల విరాళం



**చింతపల్లి, ఆగస్టు 16 ( నినాదం ) :** మండలంలోని తక్కల్లపల్లి హైస్కూల్ అభివృద్ధికి పలువురు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించారు. పాఠశాల విద్యార్థుల సౌకర్యాలు, మౌలిక వసతుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, గుండ్లపల్లి అనిత నరసింహారెడ్డి, సర్పంచ్ మేడపు అంజయ్య,, ఉపసర్పంచ్ పుప్పాల కన్నయ్య, హైస్కూల్ హెడ్‌మాస్టర్ జంగయ్య పాల్గొన్నారు. అలాగే పోతుగోని రామస్వామి గౌడ్, ముద్దం సాయి, ముద్ద వెంకటయ్య, గొడ్డటి కొమరమ్మ--శ్రీశైలం, ఎం.డి. కాసిం, పుప్పాల నరేష్ తదితరులు పాఠశాలకు డొనేషన్ అందించి విద్యాభివృద్ధికి తమ సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని, భవిష్యత్‌లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పాఠశాల నిర్వాహకులు కోరారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# అలవాలపురంలో మున్నూరు కాపు సంఘం నూతన కమిటీ

- అధ్యక్షుడిగా పోతురాజు శ్రీనివాసరావు



**కోదాడ,ఆగస్టు 16(నినాదం):** కోదాడ రూరల్ మండలం అలవాలపురం గ్రామ మున్నూరు కాపు సంఘం నూతన కమిటీని జిల్లా కన్వీనర్ రామసాని శ్రీనివాసనాయుడు సమక్షంలో, నియోజకవర్గ కన్వీనర్ శెట్టి విజయభాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతురాజు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కంబాల స్వామి, కార్యదర్శిగా మద్దాల అప్పారావు, కోశాధికారిగా శనగల రాధాకృష్ణ, కంబాల వేణు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహా దారులు, కుల పెద్దలు పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. కమిటీ ఎన్నికలో ఇన్‌చార్జీలు మురళి, సిరాపురపు శ్రీనివాసరావు, సిరాపురపు బిక్షం, కస్తూరి వెంకటేశ్వర్లు, పూల వాసు పాల్గొన్నారు.

## మండల స్థాయిలో ప్రజావాణి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి ప్రతినిధి, ఆగస్టు16(నినాదం):** ఈ నెల 17వ తేదీ నుంచి ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని అన్ని మండలాల ఎంపిడిఓ కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యల దరఖాస్తులను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో అందజేయాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహిస్తున్నందున ప్రజలు తమ సమస్యలు, వినతులు ఇచ్చేందుకు జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి, ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# ఆత్మహత్యాయత్నం చేసిన కార్మికురాలికి పరామర్శ

- రత్తమ్మకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ విజ్ఞప్తి



**కోదాడ, ఆగస్టు 16(నినాదం):** విధుల్లోకి తీసుకోకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కోదాడ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు పులి రత్తమ్మను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రత్తమ్మకు మెరుగైన వైద్యం అందించాలని, అవసరమైన వైద్య సేవలను తక్షణమే అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను కోరారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మున్సిపాలిటీలో విధులు నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ విధుల్లోకి తీసుకోకపోవడంతో రత్తమ్మ మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, అధికారులు స్పందించి ఆమెకు న్యాయం చేయాలని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మల్లయ్యయాదవ్ కోరారు.

# తబిత ఆశ్రమంలో ఘనంగా గుజ్జుల రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు

**ఆశ్రమానికి క్వింటాల్ బియ్యం**
**నిత్యావసర సరుకులు అందజేత**





**గోదావరిఖని ఆగస్టు 16 (నినాదం):** స్థానిక తబిత ఆశ్రమంలో మాజీ ఎమ్మెల్యే, సీనియర్ బీజేపీ నాయకులు శ్రీ గుజ్జుల రామకృష్ణారెడ్డి గారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామగుండం బీజేపీ ఇంచార్జ్ శ్రీమతి లికందుల సంధ్యారాణిలి గారి సూచన మేరకు బీజేపీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి ఒక క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ఏబీవీపీ నాయకుడిగా ప్రజా జీవితాన్ని ప్రారంభించిన గుజ్జుల రామకృష్ణారెడ్డి గారు, 25 ఏళ్ల వయసులో ఖమ్మర్‌ఖాన్‌పేట సర్పంచ్‌గా, 29 ఏళ్లకే జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా, ధర్మారం వైస్ ఎంపీపీగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా, ఇలా వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ఉత్తర తెలంగాణలో బీజేపీ అభివృద్ధికి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పెద్దపల్లి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు, వాగులపై వంతెనలు, తాగునీటి సౌకర్యాలు, విద్యా-వైద్య రంగాల్లో అనేక మౌలిక వసతులు కల్పించారని తెలిపారు. అలాగే ఎలిగేడు మండల ఏర్పాటు, మంథని ఫ్లైఓవర్ బ్రిడ్జి, ఎస్సారెస్పీ కాలువలకు చివరి ఆయకట్టు వరకు జజ లైనింగ్ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు ఆయన కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. అప్పటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ప్రజలకు అండగా నిలిచి, నక్సలిజం ప్రభావిత కాలంలో అనేక మంది ప్రాణాలను కాపాడేందుకు ధైర్యంగా పనిచేసిన నాయకుడిగా గుజ్జుల రామకృష్ణారెడ్డి గారి సేవలు చిరస్మరణీయమని నాయకులు అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎందరో నాయకులకు, కార్యకర్తలకు రాజకీయ ఓనమాలు నేర్పిన మార్గదర్శిగా, గురువుగా ఆయన నిలిచారని, ఆయన శిష్యులుగా రాజకీయాల్లో ఎదిగిన అనేక మంది నేడు వివిధ స్థాయిల్లో ఉన్నారని తెలిపారు. ప్రజలకు, కార్యకర్తలకు అవసరమైన సమయంలో అండగా నిలిచిన ఆయన సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. గుజ్జుల రామకృష్ణారెడ్డి గారిని కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందంగా ఉందని, ఆయనకు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల అధ్యక్షులు బోడకుంట సుభాష్, జనగామ మండల అధ్యక్షులు గుండబోయిన భూమయ్య, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ, బీజేపీ సీనియర్ నాయకులు తడగొండ నరసన్న, కొల్లూరి లక్ష్మణ్, చిలువేరు కుమార్, నడి గొట్టు రాజేందర్, రాజి ఖాన్, సల్మాన్, తిప్పని సురేష్, అరవింద్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వాజ్ పేయ్ చిత్రపటానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే

**నిర్మల్ ప్రతినిధి, ఆగస్టు 16 (నినాదం):** భారతరత్న, మాజీ ప్రధానమంత్రి, భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు దివంగత శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి గారి 8వ వర్ధంతి సందర్భంగా నేడు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘన నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అటల్ జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి, ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. అటల్ జీ ఒక రాజనీతిజ్ఞుడు మాత్రమే కాదు, ఒక కవి, ఒక దార్శనికుడు. పోఖ్రాన్ అణు పరీక్ష, సర్వ శిక్షా అభియాన్ వంటి ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలతో భారతదేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన మహనీయుడని కొనియాడారు. ఆయన చూపిన సుపరిపాలన మార్గం ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, తక్కల రమణ రెడ్డి, ముత్యం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, పట్టణ బీజేపీ నాయకులు



కందుల హరీష్, పొడెల్లి గణేష్, డి శ్రీనివాస్, తో పాటు బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల కోసం గళమెత్తిన గౌడ సంఘాలు

**కాట్నపల్లి వద్ద బస్ యాత్రకు ఘన స్వాగతం**

**సుల్తానాబాద్, ఆగస్టు 16 (నినాదం):** తాటి చెట్లపై నుంచి పడి మృతిచెందిన గీత కార్మికులను స్మరిస్తూ తెలంగాణ రాష్ట్ర కల్లు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బస్ యాత్రకు సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి వద్ద గౌడ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితర నాయకులను గౌడ సంఘం నాయకులు శాలువాలతో సన్మానించారు. కాట్నపల్లికి చెందిన గీత కార్మికుడు వీరగోని బక్కయ్య గౌడ్ మూడు నెలల క్రితం తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందిన విషయాన్ని నాయకులు గుర్తుచేశారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించి, ప్రభుత్వం ప్రకటించిన రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియాను వెంటనే విడుదల చేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సంక్షేమం, ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వారు



కోరారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు వేగోళం శంకర్ గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, వీరగోని కిరణ్ గౌడ్, గుర్రం శ్రీనివాస్ గౌడ్, గుర్రం మల్లేశం గౌడ్, వీరగోని కొమురయ్య గౌడ్, పొన్నం పోచమల్లు గౌడ్, వీరగోని బాలయ్య గౌడ్, బుర్ర కనకయ్య గౌడ్, శ్రీపతి శ్రీనివాస్ గౌడ్, శ్రీపతి శ్రీధర్ గౌడ్, శ్రీపతి కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు..?

**గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి**
**నిత్యం ప్రమాదాలతో వాహనదారుల అవస్థలు**

**మంచిర్యాల, ఆగస్టు 16 (నినాదం):** ఒకప్పుడు సాఫీగా ప్రయాణం సాగిన ఆ రహదారి... నేడు గుంతల గూటిగా మారింది. వర్షాలు పడితే చెరువును తలపించేలా నీరు నిలిచిపోవడం, ఎండా కాలంలో దుమ్ము ధూళితో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం అక్కడి ప్రజలకు నిత్యకృత్యంగా మారింది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ పోచమ్మగుడి నుంచి కటిక దుకాణాల వంకు రోడ్డు అధ్వానంగా తయారయింది. రోడ్డు ప్రయాణం అంటేనే వాహనదారులు భయపడే పరిస్థితి నెలకొంది.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు?..

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు ప్రశ్న స్థానికుల నోట వినిపిస్తోంది. రోజూ వందలాది వాహనాలు, పాఠశాల బస్సులు, అంబులెన్సులు, రైతులు, ఉద్యోగులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తున్నారు. కానీ రహదారి పూర్తిగా దెబ్బతినడంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. గుంతలను తప్పించబోయి వాహనాలు అదుపు తప్పడం, ద్విచక్రవాహనదారులు



కిందపడటం, వృద్ధులు, మహిళలు గాయపడటం వంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి గుంతల్లో నీరు నిలవడంతో అసలు రహదారి ఎక్కడుందో కూడా గుర్తించడం కష్టంగా మారుతోంది. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. వీధి దీపాల వెలుతురు సరిగా లేకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం మాత్రం కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పుడప్పుడు గుంతల్లో మట్టి లేదా కంకర పోసి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నప్పటికీ, వర్షం పడగానే పరిస్థితి మళ్లీ యథాతథంగా మారుతోంది. ఈ రహదారి దుస్థితి కారణంగా అత్యవసర సేవలు కూడా ఆలస్యమవుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. అంబులెన్సులు నెమ్మదిగా వెళ్లాల్సి రావడం, పంటలను మార్కెట్‌కు తరలించే రైతులు ఇబ్బందులు పడటం, విద్యార్థులు పాఠశాలలకు ఆలస్యంగా చేరుకోవడం వంటి సమస్యలు తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిపై అధికారులు వెంటనే స్పందించి నాణ్యమైన బీటీ రోడ్డును నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరో ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**జీఎం, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం**
**6వ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి కేత**

6వ డివిజన్ లో రోడ్డు అధ్వానంగా ఉండడంతో బీటీ రోడ్డు వేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు దృష్టికి తీసుకెళ్లామని స్థానిక కార్పొరేటర్ వనపర్తి కేత పేర్కొన్నారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అధికారుల సైతం సానుకూలంగా స్పందించినప్పటికీ ఇలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని డిమాండ్ చేశార

# రేషన్ కార్డుపై ప్రధాని ఫోటో ఏదీ?

**సీఎం శాశ్వత రాజులా వ్యవహరిస్తున్నారు**
**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి**

**మంచిర్యాల, ఆగస్టు 16 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై కేంద్ర ప్రభుత్వ అధికారిక ముద్ర, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి శాశ్వత రాజులా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శనివారం మంచిర్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేదలకు ఉచితంగా ప్రతి వ్యక్తికి నెలకు 5 కిలోల రేషన్ బియ్యం అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తామే పూర్తిగా రేషన్ బియ్యం అందిస్తున్నట్లుగా ప్రచారం చేసుకోవడం సరికాదన్నారు. ప్రజలకు అందించే రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫొటోలు కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారిక ముద్రలు ఉండాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, మంత్రుల పదవులు శాశ్వతం కాదని, పేదలకు అందించే రేషన్ కార్డులు మాత్రం దీర్ఘకాలం ఉపయోగపడతాయని అన్నారు. అందువల్ల వ్యక్తుల ప్రచారానికి కాకుండా ప్రభుత్వాల అధికారిక గుర్తింపుతో కార్డులు జారీ చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ ముద్ర, ప్రధానమంత్రి ఫొటో లేకుండా కార్డులు పంపిణీ చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఏదీ..**

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం



స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే గతంలో పెండింగ్‌లో ఉన్న బకాయిల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరసనల నేపథ్యంలోనే ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రకటన చేసిందని పేర్కొన్నారు. డిగ్రీ, ఇంజినీరింగ్, ఇతర ఉన్నత విద్యా కోర్సులు పూర్తి చేసిన లక్షలాది మంది విద్యార్థులకు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఫలితంగా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక, ఉన్నత విద్యను కొనసాగించలేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, గాజుల ముకేష్‌గౌడ్, దుర్గం అశోక్, పెద్దపల్లి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా శివాలయంలో ప్రత్యేక పూజలు

**ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ**
**బిజెపి పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు**

**సుల్తానాబాద్, ఆగస్టు 16 (నినాదం):** పెద్దపల్లి అసెంబ్లీ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకులు గుజ్జుల రామ కృష్ణారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ మున్సిపాలిటీ బీజేపీ ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ బీజేపీ పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు అధ్యక్షతన మహాపురాతన శివాలయంలో ప్రత్యేక పూజలునిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రామకృష్ణారెడ్డి ప్రజాసేవలో మరింతకాలం



కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు కొమ్ము తిరుపతి యాదవ్, మాజీ పట్టణ అధ్యక్షులు ఎల్లంకి రాజన్న, ఉపాధ్యక్షులు భూసారపు సంపత్, గజబింకర్ పవన్, ఎనగందుల సతీష్, జిల్లా బీజేవైఎం కార్యదర్శి బుర్ర



సతీష్ గౌడ్, దళిత మోర్చా అధ్యక్షులు ఏనుగుల శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మాటూరి లత, పట్టణ కార్యదర్శి ఆగండ్ల శంకర్, పోచంపల్లి ఈశ్వర్, దేశెట్టి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న జయంతి వేళ.. గౌడుల హక్కులపై ప్రకటనలు చేయాలి

**రూ.17 కోట్ల పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయాలి**
**మోకు దెబ్బ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు.. వేగోళం శంకర్ గౌడ్**

**సుల్తానాబాద్, ఆగస్టు 16 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 18న ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించడం శుభపరిణామమని సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేగోళం శంకర్ గౌడ్ అన్నారు. అయితే పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా గౌడులు, కల్లుగీత వృత్తిదారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో వృత్తి చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన వృత్తిదారులు, కాలు చేతులు విరిగి ప్రమాదాలకు గురైన బాధితులకు సంబంధించిన రూ. 17 కోట్ల పెండింగ్ నిధులను జయంతి రోజునే విడుదల చేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో కోకాపేటలో రూ. 5



కోట్లతో శంకుస్థాపన చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ భవనానికి జయంతి సందర్భంగా మరో రూ. 10 కోట్లు మంజూరు చేసి, పనులు వెంటనే ప్రారంభించేలా జీవో విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గౌడ కార్పొరేషన్‌కు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఏర్పాటు చేసిన నేపథ్యంలో తగిన నిధులు మంజూరు చేసి గౌడ కులస్తులు, కల్లుగీత వృత్తిదారులు, గౌడ మహిళలు, యువతకు ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు. అలాగే కల్లుగీత వృత్తిదారులకు రూ. 2లక్షల మోపెడు వాహనాల పథకం, ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా వైన్స్‌లలో 25 శాతం వాటా తదితర అంశాలను పాపన్న గౌడ్ జయంతి ఉత్సవల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ హామీ లన్నింటినీ అమలు చేసినప్పుడే తెలంగాణలో గౌడులకు, కల్లుగీత వృత్తిదారులకు, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ప్రభుత్వం నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని వేగోళం శంకర్ గౌడ్ పేర్కొన్నారు.

# వృద్ధాప్యపు మలుపులో.. బాల్య స్నేహం పలకరింపు

**50 ఏళ్ల విరామం... ఒక్కరోజులో మధుర జ్ఞాపకం**
**ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం**

**మంచిర్యాల, ఆగస్టు 16 (నినాదం):** అది ఒకప్పుడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన బడి.. అక్కడే బాల్యాన్ని గడిపారు. ఒకే బెంచిపై కూర్చున్నారు.. ఒకే మైదానంలో ఆటలాడారు.. పరీక్షల సమయంలో కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత ఎవరి దారిలో వారు వెళ్లిపోయారు. ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు, జీవన ప్రయాణంలో బిజీ అయిపోయారు. చూస్తుండగానే ఐదు దశాబ్దాలు గడిచిపోయాయి. అయినా ఆ బాల్య జ్ఞాపకాలు మాత్రం చెరిగిపోలేదు. యాభై వసంతాల తర్వాత పాత మిత్రులంతా మళ్లీ ఒకచోట చేరడంతో మంచిర్యాలలోని గద్దరెగడి శ్రీనివాస గార్డెన్ వేదికగా భావోద్వేగ క్షణాలు ఆవిష్కృతమయ్యాయి. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, మంచిర్యాలలో 1975–76లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఐదు దశాబ్దాల తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి రోజులు, ఉపాధ్యాయుల బోధనలు, పాఠశాల ప్రాంగణంలో గడిపిన క్షణాలు, స్నేహితులతో పంచుకున్న సరదాలు.. ఇలా ఒక్కొక్క జ్ఞాపకాన్ని గుర్తుచేసుకుంటూ ఆనందంలో మునిగిపోయారు.

**వయసు పెరిగినా.. స్నేహం మారలేదు.**

ఐదు దశాబ్దాల తర్వాత కలిసినప్పటికీ వారి మధ్య స్నేహానికి వయసు అడ్డుకాలేదు. అప్పటి విద్యార్థులు ఇప్పుడు వివిధ రంగాల్లో స్థిరపడినా.. ఒకరినొకరు చూసిన క్షణంలోనే మళ్లీ ఆ పాఠశాల రోజులకే వెళ్లిపోయినట్లయ్యారు. పేర్లు గుర్తు చేసుకుంటూ.. పాత సంఘటనలను తలచుకుంటూ.. ఆ నాటి ముచ్చట్లను నెమరువేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. కొందరిని చూసి మరికొందరు భావోద్వేగానికి గురయ్యారు.



**వేడుకల్లో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు...**

50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలకు మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు హాజరై పూర్వ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును పూర్వ విద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఐదు దశాబ్దాల తర్వాత పూర్వ విద్యార్థులు ఇంత ఆత్మీయంగా కలుసుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల ముఖాల్లో కనిపించిన చిరునవ్వులు.. వారి మాటల్లో వినిపించిన ఆనాటి ముచ్చట్లు.. ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కార్పొరేటర్ తూముల నరేష తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యానికి ఆందోళన వద్దు.. ఆపన్నహస్తంగా ఉచిత వైద్యం

**6వ డివిజన్‌లో వైద్య శిబిరం**

**మంచిర్యాల, ఆగస్టు 16 (నినాదం):** చేతిలో డబ్బుల్లేక వైద్యుడిని సంప్రదించేందుకు వెనుకాడుతున్న కుటుంబాలకు ఆ శిబిరం కొంత ఊరటనిచ్చింది. చిన్న ఆరోగ్య సమస్య పెద్దదయ్యే వరకు నిర్లక్ష్యం చేసే వారికి ముందస్తు పరీక్షల ప్రాధాన్యాన్ని తెలియజేసింది. వైద్యం ఖరీదవుతున్న రోజుల్లో.. ఉచితంగా పరీక్షలు, మందులు అందడంతో మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ లో పలువురు పేద, మధ్యతరగతి కుటుంబాల ముఖాల్లో సంతృప్తి కనిపించింది. శ్రీ వాసుదేవాయ హెల్త్ కేర్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్మల పాలిక్లినిక్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ కాలనీలోని 6వ డివిజన్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 6వ డివిజన్ కార్పొరేటర్ వనపర్తి



కేతా రాజేష్ సహకారం, దాత గుత్తికొండ ప్రశాంత్ తోడ్పాటుతో నిర్వహించిన ఈ శిబిరానికి స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు కుటుంబంలో ఎవరికైనా అనారోగ్యం వస్తే వైద్య పరీక్షలు చేయించాలంటే ఖర్చు ఎంతవుతుందోననే భయం పేద కుటుంబాలను వెంటాడుతుంటుంది. దీంతో కొందరు చిన్నపాటి ఆరోగ్య సమస్యలను సైతం నిర్లక్ష్యం చేస్తుంటారు. అలాంటి వారికి ఈ శిబిరం ఒక అవకాశంగా మారింది. రక్తపోటు, మధుమేహ పరీక్షలతో పాటు సాధారణ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో చాలామంది తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునే అవకాశం పొందారు.

**వృద్ధులకు ప్రత్యేక ఊరట**

వయసు పెరిగేకొద్దీ కీళ్ల నొప్పులు, ఎముకలకు సంబంధించిన సమస్యలు సాధారణమవుతుంటాయి. వైద్యుడిని కలిసేందుకు ఆసుపత్రికి వెళ్లడం కొందరు వృద్ధులకు ఇబ్బందిగా ఉంటుంది. శిబిరంలోనే ఆర్థోపెడిక్ వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో వృద్ధులు, కీళ్ల సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేకంగా ప్రయోజనం కలిగింది. డా. జి. శ్రీకాంత్ (జనరల్ ప్రాక్టిషనర్), డా. కుసుమ నిర్మల (ఆర్థోపెడిక్ సర్జన్) ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వాటిని నియంత్రించుకోవచ్చని వైద్యులు సూచించారు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలు పాటించాలని అవగాహన కల్పించారు.

**మందులు కూడా ఉచితమే..**

పరీక్షలు చేయించుకున్న తర్వాత మందులు కొనుగోలు చేయడం మరో భారంగా మారకుండా అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీంతో వైద్య పరీక్షలకే పరిమితం కాకుండా చికిత్సలోనూ కొంత సహాయం అందినట్లయింది.

**సేవలోనే సంతృప్తి..**

ఆరోగ్యం విషయంలో అవగాహన, ముందస్తు పరీక్షలు, అందుబాటులో వైద్య సేవలు.. ఈ మూడు అంశాలపై శిబిరం దృష్టి పెట్టింది. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా కాలనీల్లో ఇలాంటి ఆరోగ్య శిబిరాల అవసరం ఎంత ఉందో స్పష్టమైంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సేవాభావంతో ముందుకొచ్చిన ట్రస్ట్, వైద్యులు, దాతలు, స్థానిక ప్రజాప్రతినిధుల ప్రయత్నం అభినందనీయం. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ కార్పొరేటర్ తోటపల్లి రాజేశ్వరి, ప్రణయ్, ముక్కెర శ్రీనివాస్, బొజ్జ భూమన్న, శ్రీనివాస్, సంపత్, సాగర్, శ్యామ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# మందమర్రిలో కళ్యాణిఖని ప్రెస్‌క్లబ్ కు శ్రీకారం



**అధ్యక్షుడిగా పార్వతి రాజేష్ కుమార్**

**మంచిర్యాల, ఆగస్టు 16 (నినాదం):** మందమర్రిలో నూతనంగా కళ్యాణిఖని ప్రెస్‌క్లబ్ ఏర్పాటైంది. ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పార్వతి రాజేష్‌కుమార్, జనరల్ సెక్రటరీగా రామ్ వేణు, ట్రెజరర్‌గా తెల్ల విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొమ్ము రాజేష్, గౌరవ సలహాదారుగా కనపర్తి రమేష్, వైస్ ప్రెసిడెంట్లుగా మదాసు కుమార్, గరిగే సుమన్, ఎగుడ రాయమల్లు, జాయింట్ సెక్రటరీలుగా మాసు రాకేశ్, కంది రాజేశం, కాగితపు శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్‌గా అడిచెర్ల నాగేందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా జీవన్‌కుమార్, పి. ఆర్. ఓ. /క్లబ్ ఇన్‌చార్జిగా బీరం రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. కళ్యాణిఖని ప్రెస్‌క్లబ్‌ను జర్నలిస్టుల ఐక్యతకు బలమైన వేదికగా తీర్చిదిద్దుతామని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు వృత్తి విలువలు, నైతిక ప్రమాణాలను కాపాడుతూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ, అధికార యంత్రాంగం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

**ఐక్యతతోనే బలం**

స్థానికంగా జర్నలిస్టులు ఒకే వేదికపైకి రావడం వల్ల పరస్పర సహకారం పెరగడంతో పాటు వృత్తిపరమైన సమస్యలను సమష్టిగా పరిష్కరించుకునే అవకాశం ఏర్పడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

మెగాస్టార్ చిరంజీవి జన్మదినం వేడుకల సందర్భంగా

# ఘనంగా రక్తదాన శిబిరం

### పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు



**అమీన్ పూర్, ఆగస్టు 16, (నినాదం ):** పద్మభూషణ్, పద్మవిభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని.. తెలంగాణ బెస్ట్ జోన్ యూత్ ఫోర్స్ కన్వీనర్ దంగేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలోని సత్య స్పోర్ట్స్ అకాడమీలో రక్తదాన శిబిరాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంగేటి సత్యనారాయణ మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు వివిధ సేవా కార్యక్రమాలతో జన్మదిన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఈ మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రక్తదాన శిబిరానికి చిరంజీవి అభిమానుల నుంచి విశేషస్పందన లభించింది. అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుమారు 300 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బసెట్టి కృష్ణ, యువత, అభిమానులు మరియు నిర్వాహకులు తదితరులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.



నార్సింగి పీ. హెచ్.సీ ఎంపీ హెచ్ఏ(ఎఫ్) టీ.అమృతకుకు

# ప్రతిభావంతమైన సేవలకు ప్రశంసా పత్రం

### రంగారెడ్డి జిల్లా కార్యాలయ ప్రాంగణంలో ప్రశంసా పత్రాన్ని అందజేసిన మంత్రి దుద్దీళ్ల శ్రీధర్ బాబు



**రాజేంద్రనగర్,ఆగస్టు 15 ( నినాదం):** 2025బి26 ఆర్థిక సంవత్సరం యందు రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హైదర్ షాకోట్ ఆరోగ్య ఉపకేంద్రంలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్(మహిళ)గా విధులు నిర్వహిస్తున్న టీ. అమృత ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉన్నతస్థాయి అధికారుల నుంచి కిందిస్థాయి అధికారులు, సిబ్బంది ప్రతిభావంతమైన సేవల ద్వారా చేసిన విశిష్టకృషిని గుర్తిస్తూ సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రశంసా పత్రాలను సమర్పించింది. 80వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా శనివారం రంగారెడ్డి జిల్లా కార్యాలయ ప్రాంగణంలో జరిగిన స్వతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు మరియు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి,కాలే యాదయ్యలతో కలిసి జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారులకు సిబ్బందికి ప్రతిభవంతమైన సేవలను గుర్తిస్తూ ప్రశంసా పత్రాలను సమర్పించారు. అందులో భాగంగానే నార్సింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని హైదర్షా కోట్ ఆరోగ్య ఉప కేంద్రంలో పనిచేస్తున్న ఎంపీహెచ్ఏ(ఎఫ్) టీ. అమృతకు మంత్రి శ్రీధర్ బాబు జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, కిరణ్మయి, శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్యలతో కలిసి ప్రశంస పత్రాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు.

ప్రతి సోమవారం మండల

# స్థాయి ప్రజావాణి కార్యక్రమం

### కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి ఆగస్టు 16( నినాదం) :** ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయి రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య, విద్య, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖ, ఫారెస్ట్, అంగన్వాడీ తదితర శాఖల అధికారులు హాజరు కానున్నారని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 01:00 వరకు సమస్యలకు సంబంధించిన అన్ని రకాల అర్జీలను పరిశీలించి సత్వర న్యాయం చేస్తామని అన్నారు. ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# రేపు కలెక్టరేట్లో, ప్రజావాణి కార్యక్రమం రద్దు



**కొల్చారం ఆగస్ట్ 16 ( నినాదం ) :** రేపు కలెక్టరేట్లో, ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని ప్రజావాణి హాల్లో జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీ. డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గారి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నమై ఉంటారని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో ,తాసిల్దార్ కార్యాలయాల్లో యధావిధిగా .ప్రజావాణి దరఖాస్తులు స్వీకరణ జరుగుతుందని తెలియజేశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి హాల్ నందు 17.08.2026 న మధ్యాహ్నం 12:30 గంటలకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు మరియు భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రివర్యులు. మరియు జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీ. డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గారి చేతుల మీదగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు . అధికారులందరూ వారికి కేటాయించిన విధుల్లో నిమగ్నమై ఉన్నందున రేపు సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. మండల ప్రజావాణి యధావిదంగా కొనసాగుతుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇట్టి విషయాన్ని ప్రజలందరూ గమనించి సహకరించాలన్నారు.

NINADAM CINEMA



## బ్యాక్ అందాలతో రెచ్చిపోయిన గాయత్రీ రమణ..

### కుర్రకారు హార్ట్‌బీట్ పెరగాల్సిందే

యంగ్ హీరోయిన్ గాయత్రి రమణ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. మోడలింగ్ రంగంలో మంచి గుర్తింపును సంపాదించుకున్న తర్వాత సినీ పరిశ్రమలోకి అడుగు పెట్టింది. తొలుత అడవి శేష్ హీరోగా తెరకెక్కిన 'హిట్ 2' చిత్రంలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇటీవల 'మెన్షన్ హౌస్ మల్లేశం' చిత్రంలో హీరోయిన్‌గా కనిపించింది. ఈ సినిమా పర్వాలేదనే స్థాయి విజయాన్ని అందుకున్నప్పటికీ.. ఇందులో గాయత్రి అద్భుతమైన నటనకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు దక్కాయి. ఈ చిత్రం తర్వాత భారీ స్థాయిలో అవకాశాలు దక్కకపోయినా.. తనకు వచ్చిన అవకాశాలతో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. అప్పుడప్పుడు తనకు సంబంధించిన హాట్ లుక్ ఫొటోలను సోషల్ మీడియా అకౌంట్‌లో పోస్ట్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా గాయత్రి తన ఇన్‌స్టాగ్రామ్‌లో సూపర్ అల్ట్రా స్టైలిష్ లుక్‌లో మెరిసింది. స్లీవ్‌లెస్ డ్రెస్‌లో ఫ్రంట్, బ్యాక్ అందాలు హైలైట్ అయ్యేలా ఫొటోలకు పోజులిచ్చింది. చేతులకు గాజులు, చెవులకు ఇయర్ రింగ్స్ ధరించి.. తన కురులను సెట్ చేసుకుంటూ ఇచ్చిన స్టైలిష్ పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మొత్తంగా ఈ ఫొటోల్లో గాయత్రి రమణ హాట్ లుక్‌లో మెరిసిపోవడంతో.. ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## నిరీక్షణ ముగిసింది..

### బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌తో కళ్యాణి ప్రియదర్శన్ బాలీవుడ్ ఎంట్రీరి



'లోకా' సినిమాతో బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టించడంతో పాటు తన నటనతో ప్రశంసలు పొందిన కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పుడు బాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రి ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. బాలీవుడ్ స్టార్ హీరో రణ్ వీర్ సింగ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న అతి పెద్ద యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ప్రళయ్' లో ఆమె పవర్‌ఫుల్ పాత్రలో నటించబోతున్నారు. తాజాగా, ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ముంబై పరిసర ప్రాంతాలలో అధికారికంగా ప్రారంభమైంది. బాక్సాఫీసు వద్ద సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధురంధర్', 'ధురంధర్ ది రివేంజ్' వంటి ఆల్-టైమ్ బ్లాక్‌బస్టర్ల తర్వాత రణ్ వీర్ సింగ్ చేస్తున్న ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం. ఈ చిత్రంలో రణ్ వీర్ హీరోగా కాకుండా నిర్మాణ భాగస్వామిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి అత్యంత క్రేజ్ ఉన్న పాన్-ఇండియా చిత్రంలో కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తుండటంతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. 'స్కామ్ 1992', 'లూటేరే' వంటి మైండ్ బ్లోయింగ్ ప్రాజెక్ట్‌లను అందించిన దర్శకుడు జై మెహతా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. బిర్లా స్టూడియోస్ బ్యానర్‌పై అనన్య బిర్లా సమర్పిస్తుండగా, 'ట్రూ స్టోరీ ఫిల్మ్స్' నిర్మాణంలో హన్సల్ మెహతా, సాహిల్ సైగల్ నిర్మిస్తున్నారు. ప్రపంచం అంతమయ్యే అత్యంత భయంకరమైన పరిస్థితి ఎదురైనప్పుడు.. ముంబై నగర నేపథ్యంలో మనుషులు తమ వారి కోసం, ప్రాణాల కోసం చేసే ఉత్కంఠభరిత పోరాటమే ఈ సినిమా ప్రధాన కథాంశం అని టాక్. ఈ గ్రిప్పింగ్ సర్వైవల్ డ్రామాలో కళ్యాణి ప్రియదర్శన్ పాత్ర ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం.

కన్నడలో శ్రీనిధి శెట్టికి

## లక్కీ చాన్స్..

### భండారి బ్రదర్స్ మూవీలో కీ రోల్!



కేజీఎఫ్' సినిమాతో దేశమంతటా గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శ్రీనిధి శెట్టి. 'కేజీఎఫ్ 2' తర్వాత వేరే భాషల్లో బిజీగా మారిన ఆమె, తమిళం, తెలుగు భాషల్లో పలు హిట్ సినిమాల్లో నటించి మెప్పించారు. అతి తక్కువ సమయంలోనే స్టార్స్ సరసన నటించి క్రేజీ హీరోయిన్‌గా మారారు. ప్రస్తుతం తెలుగులో వెంకటేష్ – త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రాబోతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలా వేరే భాషల్లో వరస ఆఫర్లు పొందుతున్న సమయంలో, శ్రీనిధి శెట్టికి మళ్లీ కన్నడలో ఓ లక్కీ చాన్స్ దక్కినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. . తాజా సమాచారం ప్రకారం.. దర్శకుడు అనుప్ భండారి తెరకెక్కిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ద్వారా ఆమె మళ్లీ కన్నడ ప్రేక్షకులను పలకరించబోతున్నారట. శ్రీనిధి రీ-ఎంట్రీతో ఈ సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు అనుప్ భండారి, తన సోదరుడు నిరూప్ భండారితో కలిసి ఈ కొత్త సినిమాను మొదలు పెట్టినట్లు టాక్. ఇందులో హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టిని ఎంపిక చేయగా.. ఇప్పటికే కర్ణాటకలోని కుమ్టా ప్రాంతంలో ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైందట. శ్రీనిధి శెట్టి 'కేజీఎఫ్' తర్వాత ఇక అనుప్ భండారి, నిరూప్ భండారి కలయికలో వస్తున్న నాలుగో సినిమా ఇది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'రంగీతరంగ', 'రాజ రథ', 'విక్రాంత్ రోణా' చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు మరో ప్రాజెక్ట్ రాబోతుండటంతో పాటు ఇందులో శ్రీనిధి శెట్టి నటిస్తుండటంతో సినిమాపై అప్పుడే భారీ బజ్ క్రియేట్ అయింది.

ఫాంటసీ హారర్ థ్రిల్లర్‌తో

## భయపెట్టేందుకు వస్తున్న నిత్యామీనన్!



తెలుగు, తమిళం, కన్నడ సినీ పరిశ్రమల్లో తన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ బ్యూటీ నిత్యామీనన్. రీసెంట్‌గా 'తలైవాన్ తలైవి', 'ఇడ్లీ కడై' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన ఆమె, చిన్న విరామం తర్వాత ఒక సరికొత్త హారర్ డ్రామాతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఒక విభిన్నమైన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ సబ్జెక్ట్‌తో ఆమె ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. 'యామిరుక్కా బయమే' చిత్రంతో వినోదాత్మక హారర్ జోనర్‌లో మంచి విజయాన్ని అందుకున్న దర్శకుడు డీకే ఈ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించనున్నట్లు టాక్. డీకే మార్క్ కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్‌కు నిత్యామీనన్ వంటి పవర్‌ఫుల్ నటి తోడవ్వడంతో ఈ చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. అయితే ఈ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుండగా, వచ్చే ఏడాది సమ్మర్ రేసులో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. సరికొత్త కథాంశంతో వస్తున్న ఈ థ్రిల్లర్ మూవీతో నిత్యామీనన్ బాక్సాఫీస్ వద్ద మరో హిట్ తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)Published at 6-3-439, kisannagar, Karimnagar-505001 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787